
ఆంధ్రజ్యోతి 5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 14, సెప్టెంబరు 2025



నెమలిగుండంలో జల సవ్వడి

రాచర్ల మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలోని నెమలిగుండ్ల రంగ నాయక స్వామి ఆలయంలో గుండం జలసవ్వళ్లతో హోరెత్తుతోంది. నల్లమల అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గుండానికి వరదనీరు భారీగా చేరుతోంది. దీంతో శనివారం ఆలయానికి భక్తులు విపరీతంగా వచ్చారు. అయితే కొండచరియలు విరిగిపడినా భక్తులకు ఇబ్బందులు కలగలేదు. 7

ఎస్పీగా హర్షవర్ధన్ రాజు

విజయనగరం జిల్లాకు దామోదర్ బదిలీ

ఒంగోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన ఎస్పీగా హర్షవర్ధన్ రాజు నియమితులయ్యారు. రాష్ట్రంలో 14 జిల్లాల ఎస్పీలను బదిలీలు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అందులో భాగంగా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఏఆర్ దామోదర్ విజయనగరం జిల్లాకు బదిలీ చేయగా ఆ స్థానంలో ప్రస్తుతం తిరుపతి ఎస్పీగా పనిచేస్తున్న వి.హర్షవర్ధన్ రాజును నియమించారు. నెల్లూరు జిల్లా కావలి ప్రాంతానికి చెందిన హర్షవర్ధన్ రాజు అనంతపురం జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్ చదివారు. 2013 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన అన్నమయ్య జిల్లా ఆవిర్భావం అనంతరం అక్కడ తొలి ఎస్పీగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొద్దికాలం తిరుపతిలో పనిచేశారు. తర్వాత విజయవాడ సీఐడీలో పనిచేశారు. అక్కడి నుంచి కడప జిల్లాకు వెళ్లిన హర్షవర్ధన్ అక్కడ వైసీపీకి చెందిన సోషల్ మీడియా విభాగం నాయకుడు రవీంద్రారెడ్డి వ్యవహారంలో పోలీసులపై విమర్శలు వచ్చిన సమయంలో ఆయనను ప్రభుత్వం వీఆర్‌కు పిలిచింది. కాగా ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో వేంకటేశ్వరస్వామి భక్తుల తొక్కిసలాట ఘటన నేపథ్యంలో అక్కడి ఎస్పీని మార్చిన ప్రభుత్వం ఆ స్థానంలో హర్షవర్ధన్‌రాజును నియమించింది. అప్పటి నుంచి తిరుపతి ఎస్పీగా కొనసాగుతున్న ఆయనను తాజా బదిలీల్లో ఇక్కడి ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇక్కడ ఎస్పీగా ఉన్న దామోదర్ విజయనగరం ఎస్పీగా బదిలీ అయ్యారు. గతేడాది జూలై ఆఖరులో ఇక్కడ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్ సుమారు 14 నెలల పాటు పనిచేశారు. రాష్ట్రంలో



నూతన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

మిగతా 6లో...


ముందుకెలా..

డెయిరీ పునరుద్ధరణపై ఉన్నత స్థాయిలో తర్జనభర్జన

- పలు ప్రతిపాదనలు సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి డాక్టర్ స్వామి
- మరో మంత్రి గొట్టిపాటితోనూ విస్తృత చర్చ
- ఇదే అంశంపై చంద్రబాబును ప్రత్యేకంగా కలిసిన దామచర్ల
- అసెంబ్లీ సమావేశాల సమయంలో మరోసారి బాబుతో భేటికి అవకాశం
- ఆస్తులు, అప్పులపై నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు



ఒంగోలు డెయిరీ



ఒంగోలు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన పాడి పరిశ్రమకు ప్రాణం లాంటి ఒంగోలు డెయిరీని పునరుద్ధరించేందుకు అధికారపార్టీ ప్రజాప్రతినిధులు కృతనిశ్చయంతో ముందుకెళ్తున్నారు. ప్రధానంగా జిల్లా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి చొరవ చూపి ఆరు మాసాలుగా వివిధ స్థాయిల్లో కదలించారు. ఒకవైపు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కీలక అధికారులతో తరచూ ఈ అంశంపై మాట్లాడుతూ తగు నివేదికలు, సూచనలు ఇస్తున్నారు. ఆయన తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి పలు ప్రతిపాదనలు తీసుకెళ్లినట్లు సమాచారం. పాడిపరిశ్రమ, డెయిరీ నిర్వహణపై విశేష అవగాహన ఉన్న ఆయన తన దృష్టికి తెచ్చిన పలు ప్రతిపాదనలను సావధానంగా వింటూనే సాధ్యాసాధ్యాలపై పలు అనుమానాలను వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోసారి వివరంగా మాట్లాడాలని ఆయన మంత్రి స్వామికి సూచించినట్లు తెలుస్తుండగా ఈ అంశాలపై ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రస్తుత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కూడా మంత్రి స్వామి చర్చించినట్లు సమాచారం.

మూడు ప్రతిపాదనలు చర్చకు....

పూర్వ కలెక్టర్ తమీమ్ అన్సారియా రెండుసార్లు కలెక్టర్ల సమావేశాల సందర్భంగా కూడా డెయిరీ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరణకు పలు చర్యలను వివరించారు. తాజాగా పదిరోజుల క్రితం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా పలు అంశాలపై సీఎంను కలిసిన సందర్భంగా డెయిరీ అంశాన్ని ప్రత్యేకంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇలా పలు సందర్భాలలో.. డెయిరీ పునరుద్ధరణకు సంబంధించి మూడు ప్రధాన ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి.

- పూర్తిగా ప్రభుత్వపరంగా నిధులు ఇచ్చి అటు అధికారులు, ఇటు కొందరు పాల సంఘాల ప్రతినిధులతో కమిటీ ద్వారా డెయిరీ నిర్వహణ ఒక అంశం
- నిర్వహణ బాధ్యతను కొంతకాలం పీపీపీ విధానంలో ముందుకు వచ్చే ప్రైవేటు సంస్థలకు అప్పగించడం మరొక అంశం
- గతంలో మాదిరి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్(ఎన్‌డీడీబీ)తో ఒప్పందం చేసుకొని అభివృద్ధి చేయడం మూడో అంశం. అందులో ఎన్‌డీడీబీతో కలిసి నిర్వహించడం మంచిదన్న అభిప్రాయం ఎక్కువమంది నుంచి వినిపిస్తుంది. ఇదే విషయాన్ని మంత్రి స్వామి సీఎం ముందు ఉంచినట్లు సమాచారం.

> "ఉమ్మడి జిల్లాకు తలమానికంగా, పాడి రైతులకు బాసటగా నిలిచిన ఒంగోలు డెయిరీ పునరుద్ధరణపై కదలిక మొదలైంది. ఎలా ముందుకు పోవాలనే దానిపైనే ఉన్నత స్థాయిలో తర్జనభర్జన సాగుతోంది. ఇటు జిల్లా టీడీపీ నాయకులు, అటు అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్‌లు దృఢనిశ్చయంతో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఒంగోలు డెయిరీని సమాధి కట్టగా ఆ సంస్థను పునఃప్రారంభించడం ద్వారా పాడిరైతులకు తద్వారా జిల్లాలో పాడిపరిశ్రమకు ఊతం ఇవ్వాలన్న సంకల్పంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే సమీక్షలు నిర్వహించారు. అలాగే డెయిరీ అధికారులు సంస్థకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ఇక కార్యాచరణే మిగిలి ఉంది."

నివేదికల రూపకల్పన

ప్రధానంగా ఒంగోలు డెయిరీ ప్రాధాన్యత, సంస్థ ఏర్పాటు, అనంతరం ఆ సంస్థ అభివృద్ధి తీరు, ఉమ్మడి జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధి, రైతులకు డెయిరీ వల్ల జరిగిన మేలు, సుదీర్ఘ కాలం టీడీపీ చేతిలో పాలకమండలి సాగడం తెలిసిందే. డెయిరీ అభివృద్ధికి పలు సందర్భాలలో ఒకప్పుడు ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబులు సీఎంలుగా సహకారం అందించారు. ఉద్దేశపూర్వకంగా వైసీపీ ప్రభుత్వం డెయిరీని ముంచేసింది. అటువంటి అంశాలతో పాటు ప్రస్తుత డెయిరీకి ఒంగోలుతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న భూములు, భవనాలు, మిషనరీ వంటి ఆస్తులు, వాటి విలువ, సంస్థకు ఉన్న అప్పులు తదితర అంశాలపై ఇప్పటికే జిల్లా, రాష్ట్ర అధికారులతో చర్చించి నివేదికల రూపకల్పనకు మంత్రి స్వామి ఆదేశించారు. అదేసమయంలో ఆ రంగంపై అవగాహన, అనుభవం ఉన్న వివిధ వర్గాల వారితోనూ కొంతకాలంగా మంత్రి స్వామి సంప్రదింపులు జరుపుతున్నారు. మరోవైపు ఆయన ఆదేశంతో గతనెలలో కొందరు అధికారులు అలాగే గతంలో డెయిరీ నిర్వహణలో భాగస్వాములైన కొందరు

మిగతా 6లో...

జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- వెలిగొండ పూర్తికి, మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- ప్రజలకు ఉపయోగపడే విధంగా గత కలెక్టర్ తీసుకున్న నిర్ణయాలను కొనసాగిస్తా
- 24/7 అందుబాటులో ఉంటా
- నూతన కలెక్టర్ రాజాబాబు వెల్లడి



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తానని నూతన కలెక్టర్ పి.రాజాబాబు వెల్లడించారు. అందుకోసం జిల్లాలోని ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఉదయం కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా జిల్లా కలెక్టర్‌గా తనను నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన దిశానిర్దేశం మేరకు జిల్లాలోని ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పొలిటికల్ గవర్నెన్స్‌పై ప్రత్యేక దృష్టిసారిస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ప్రజలకు 24/7 అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించానని తెలిపారు. జిల్లాలో గతంలో పనిచేసిన కలెక్టర్ ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకున్నారని, వాటిని కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కాగా అంతకుముందు ఎన్ఎస్‌పీ అతిథిగృహం వద్ద జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డిలు నూతన కలెక్టర్‌కు ఘనస్వాగతం పలికారు. ముందుగా పూలమొక్కలను ఇచ్చి అభినందించారు. అక్కడి నుంచి నేరుగా కలెక్టర్ రాజాబాబు ఆయన కుటుంబసభ్యులతో కలిసి కలెక్టరేట్ చేరుకున్నారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు ఆశీర్వచనాల మధ్య కలెక్టర్‌గా రాజాబాబు బాధ్యతలు స్వీకరించారు.



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న బృందసభ్యులు

డీఎస్సీ వైద్య సర్టిఫికెట్లపై నిశిత పరిశీలన

- ప్రభుత్వ వైద్యశాలల్లో తనిఖీలు
- కొందరు తప్పుడు పత్రాల సమర్పణ

ఒంగోలు విద్య, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ టీచర్ పోస్టులకు అభ్యర్థుల ఎంపికలో ప్రభుత్వం అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎక్కడ ఏ పొరపాటుకు తావివ్వకుండా జాగ్రత్త వహిస్తున్నారు. అందులో భాగంగా దివ్యాంగుల కోటాలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిపై ప్రత్యేక దృష్టిపెట్టారు. గతంలో బదిలీలకు కొందరు ఉపాధ్యాయులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తాము కోరుకున్న స్థానాలు పొందడంతోపాటు ప్రతినెల అదనంగా రూ. 2వేలు అలవెన్స్ కూడా పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి అభ్యర్థులకు దివ్యాంగ సర్టిఫికెట్ల జారీపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. దీనికోసం ప్రత్యేకంగా జిల్లా ప్రభుత్వ వైద్యశాలల్లో మెడికల్ బోర్డులు ఏర్పాటుచేశారు.

బోగస్ తేలితే డాక్టర్‌పై చర్యలు

బోర్డు ముందు హాజరయ్యే అభ్యర్థులకు సర్టిఫికెట్ల జారీలో అనుమానాలు ఉంటే మరో బోర్డుకు పంపిస్తామని, అక్కడ బోగస్ అని తేలితే సంబంధిత డాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ముందే హెచ్చరించింది. దీంతో జిల్లాలో మెడికల్ బోర్డు ముందు హాజరైన అభ్యర్థుల్లో నాల్గో వంతు మంది సర్టిఫికెట్లను అధికారులు తిరస్కరించారు. జిల్లాలో డీఎస్సీకి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, గిరిజన, సంక్షేమ పాఠశాలల్లో 672 పోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టులకు 20 వేల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొందరు అక్రమ మార్గాల్లో తప్పుడు వైద్య ధ్రువీకరణ పత్రాలతో టీచర్ పోస్టు సాధనకు ప్రయత్నాలు చేసి దొరికిపోయారు. దీంతో వీరిపై అనర్హత వేటు వేశారు. ఈ డీఎస్సీలో దివ్యాంగులకు మూడు శాతం పోస్టులు రిజర్వు చేశారు. రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లలో వీరికి స్థానాలు కేటాయించారు. దృష్టిలోపం ఉన్నవారు. శారీరక అంగవైకల్యం, మల్టిబుల్ డిజార్డర్ ఉన్నవారికి కనీసం 40శాతం, వినికిడిలోపం ఉన్నవారికి కనీసం 60 డెసిబుల్స్ మించి ఉంటేనే రిజర్వేషన్ లభిస్తోంది. వినికిడి లోపం ఉన్నవారికి గుంటూరు జిల్లా మెడికల్ బోర్డుకు, మిగిలిన వారిని ఒంగోలు రిమ్స్ మెడికల్ బోర్డుకు రెఫర్ చేశారు.

ఏడుగురివి...

అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లు సమగ్రంగా ఉన్న అభ్యర్థులను వైకల్యం ధ్రువీకరణకు గుంటూరు, ఒంగోలు మెడికల్ బోర్డులకు పంపారు. మొత్తం 29 మంది అభ్యర్థులను వైద్యపత్రాల ధ్రువీకరణకు పంపగా వీరిలో నాల్గో వంతు

మిగతా 6లో...

19న సీఎం చేతుల మీదుగా...

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నియామకపు పత్రాలు అందజేయనున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా పాల్గొంటారు. గతంలో 2016లో సీఎంగా ఉన్న చంద్రబాబు అప్పుడు డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులందరినీ విజయవాడకు పిలిపించి నియామకపత్రాలు అందజేశారు. అప్పట్లో అభ్యర్థులు తమ సొంత ఖర్చులతో విజయవాడ మీటింగ్‌కు హాజరుకాగా ప్రభుత్వ టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను వెలగపూడికి తరలించే బాధ్యతను జిల్లా విద్యాశాఖ అధికారులకు అప్పగించారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు చెక్

- 1,392 ఈపోస్ మిషన్లు సిద్ధం
- డీలర్లకు పంపిణీ చేస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు
- యంత్రాల వినియోగంపైనా అవగాహన



ఈపోస్ మిషన్లను అందజేస్తున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రజా ప్రభుత్వం అందుకు అవసరమైన పటిష్ఠ చర్యలు చేపట్టింది. బియ్యం, చక్కెర, కందిపప్పు వంటి నిత్యావసరాల సరుకులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ రైస్ కార్డులను ఈ నెలాఖరులోపు కార్డుదారులకు అందజేయనున్నారు. అందుకు సంబంధించి ఈ-పోస్‌ను మిషన్లను వచ్చేనెల నుంచి వినియోగించేందుకు జిల్లాకు రావడంతో వాటిని డీలర్లకు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 1,392 రేషన్ షాపులు ఉండగా అన్నింటికీ పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని డీలర్లకు అందిస్తున్నారు. ఈ కొత్త మిషన్ల వినియోగంపైనా అవగాహన కల్పిస్తున్నారు.

క్యూఆర్ కోడ్.. 5జీ నెట్‌వర్క్

ప్రస్తుతం ఇస్తున్న ఈపోస్ మిషన్ల ద్వారా స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కార్డుదారుని పూర్తి వివరాలు డిస్‌ప్లే అవుతుంది. కార్డుదారుడికి ఏయే సరుకులు అందజేయాలి, ఆ మిషన్‌లో నమోదు అవుతుంది. ఒక వేళ స్కాన్ పనిచేయని పక్షంలో వేలిముద్ర ద్వారానైనా సరుకులు తీసుకునే విధంగా మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఒకవేళ వేలిముద్ర పడకపోతే ఐరిష్(కళ్లు) స్కాన్ చేసే సదుపాయాన్ని కూడా కల్పించారు. ఇప్పటివరకు డీలర్ల వద్ద ఉన్న మిషన్లు 2జీ మాత్రమే ఉండగా ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఈపోస్ మిషన్లు 5జీ టెక్నాలజీతో అందిస్తున్నారు. తద్వారా కార్డుదారులకు వెంటనే రైస్‌ను అందించడంతోపాటు కార్డుదారుని వివరాలు కూడా వెంటనే డిస్‌ప్లే అయ్యే విధంగా రూపొందించారు. కాగా జిల్లావ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారి పరిధిలోని డీలర్లకు వీటిని పంపిణీ చేస్తున్నారు. ఎన్‌జీపాడు మండలం అమ్మనబ్రోలులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో డీలర్లకు ఈ మిషన్లను అందజేశారు. ఇలా జిల్లావ్యాప్తంగా మిషన్లను పంపిణీ చేస్తున్నారు.

అనుమానం పెనుభూతమైన వేళ..

- భార్యను చంపి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన భర్త
- గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు
- రేగలగడ్డలో దారుణం
- పెద్ద కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు



హతురాలు జయమ్మ (ఫైల్)

7



పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

7

- 100 మందికి 92 మంది హాజరు
- రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇచ్చే అవకాశం



మ్యాజిక్ డ్రైన్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల

అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం

● ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌతవరం గ్రామానికి రూ.23.75తో మంజూరైన మ్యాజిక్ కాల్వల నిర్మాణానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఆయనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ఎస్ భాస్కరరావు, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, ఏపీవో ఆర్ మహాలక్ష్మి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, రామాపురం సొసైటీ చైర్మన్ భవనం పుల్లారెడ్డి, గిద్దలూరు ఏఎంసీ చైర్మన్ బైలడుగు బాలయ్య, నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి, పఠాన్ సనావుల్లా ఖాన్, ఎస్ కళ్యాణ్ రెడ్డి, దప్పిలి కాశిరెడ్డి, ముత్తుముల రాజశేఖర్ రెడ్డి, సయ్యద్ మియా, పాపిశెట్టి శ్రీనివాసులు, సూర్నేని రామకోటయ్య, శిరిగిరి వెంకటపతి, బత్తిని రామకృష్ణ, యాసం లక్ష్మీరెడ్డి, ఉలాపు శంకర్ నాయుడు, పుట్ట బాలకృష్ణ, సర్పంచ్ మార్తోట లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరాజేశ్వరి పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగుల మధ్య నాగులపాడు తెలుగుయువత ఆధ్వర్యంలో నిమజ్జనంకు తరలిపోతున్న గణనాథుడు

ఉత్సాహంగా నాగులపాడు వినాయక నిమజ్జనం

అద్దంకి,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపాడులో తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం శనివారం వైభవంగా నిర్వహించారు. నాగులపాడులో తెలుగుయువత నేత పెంట్యాల రామాంజనేయులు, టీడీపీ నేతల ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిమజ్జనోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రానికి అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీ వరకు వినాయక విగ్రహం చేరింది. అనంతరం విద్యుత్ దీపాల వెలుగులు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య రాత్రి 7.30 గంటలకు నిమజ్జనోత్సవం ప్రారంభమైంది. రామ్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, భవానీసెంటర్ మీదుగా ఉత్సవం సాగింది. అనంతరం అర్ధరాత్రి సమయంలో గుండ్లకమ్మనదిలో గణనాథుని నిమజ్జనం చేశారు. అద్దంకి పట్టణంలో నిమజ్జనోత్సవం సాగినంత సేపు ఆయా ప్రాంతాలలో మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి తిలకించారు. అద్దంకి పట్టణంతోపాటు సమీప మండలాలలోని పలు గ్రామాల నుంచి కూడా ప్రజలు, పెద్దసంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు నిమజ్జనోత్సవం చూసేందుకు తరలివచ్చారు. ఎన్‌టీఆర్ విగ్రహం, పలువురు దేవతామూర్తుల విగ్రహాల అలంకరణ, విద్యుత్ దీపాల వెలుగులతో జరిగిన నిమజ్జనోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



తూర్పుతక్కెళ్లపాడులో సాగులోఉన్న మొక్కజొన్న

వర్షపు జల్లులతో పంటలకు జీవం

● రెండువేల ఎకరాలలో సాగవుతున్న మినుము

పంగులూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా పడుతున్న వర్షపు జల్లులు ఖరీఫ్ పంటలకు కొంత ఊపిరి పోసింది. మండలంలో వివిధ దశలలో ఉన్న మినుము, మొక్కజొన్న, పత్తి, మిరపలకు వర్షపు జల్లులు ఉపకరిస్తాయని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో ఖరీఫ్ పంటగా పలు గ్రామాలలో మినుము సాగు చేస్తున్నారు. మండలంలోని ఒక్క కొండమూరు గ్రామంలో 1200 ఎకరాలలో మినుము సాగు చేస్తుండగా, కోటపాడు, అలవలపాడు, రేణంగివరం, ముప్పవరం, బైటమంజులూరు, తూర్పు తక్కెళ్ళపాడు, కొండమంజులూరు గ్రామాలలో 50 నుంచి వంద ఎకరాలకు పైగా మినుము పంటసాగు చేస్తున్నారు. తూర్పుకొప్పెరపాడు, తక్కెళ్ళపాడు, రేణంగివరం, అలవలపాడు, చందలూరు గ్రామాలలో రెండువందల ఎకరాలలో మొక్కజొన్న, తూర్పుకొప్పెరపాడు, పంగులూరు, చందలూరు పరిసర గ్రామాలలో 250 ఎకరాలలో పత్తి, 60 ఎకరాలలో మిరప సాగవుతున్నట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. కొద్దిరోజులక్రితం వరకు అధిక ఎండలతో తల్లడిల్లిన పైరులు గురు, శుక్ర, శనివారాలల్లో కురిసిన వర్షాలు జీవం పోశాయి. మొక్కదశ నుండి పూత, పిందెదశకు చేరుకుంటున్న మినుము, కళ్లెకొచ్చిన మొక్కజొన్నతోపాటు పైర్లకు ప్రస్తుత వర్షం జీవం పోసింది.

అన్నదాన పథకం అమలుకు ప్రతిపాదనలు

అద్దంకి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అన్నదాన పథకం అమలుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు తెలిపారు. లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం శనివారం దేవస్థానం ఆవరణలో చైర్మన్ గుంజి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా నవరాత్రులు ఏర్పాట్లపై చర్చించారు. దేవస్థానం వద్ద ఆర్‌వో ప్లాంట్ మరమ్మతులు, మహామండపం అసంపూర్తి పనులు, అన్నదాన మండపం అసంపూర్తి పనులను దాతల సహకారంతో నిర్దిష్ట సమయంలో పూర్తి చేయించాలని నిర్ణయించారు. నక్షత్ర వనం మొక్కలు నాటే ముందు డ్రిప్, ట్రీ గార్డులను ముందుగా సమకూర్చాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఈవో మద్దినేని శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

శింగరకొండలో భక్తుల రద్దీ

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులరద్దీ ఎక్కువగా ఉంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగల్లు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆకుపూజలు, వాహనపూజలు, అర్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణ లో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి

సాగర్ నీరందక గగ్గోలు

కాలువలకు తగ్గిన నీటి పరిమాణం

మేజర్లు, మైనర్లకు అందక నాట్లకు ఇబ్బందులు

అధికనీరు వాడుకుంటున్న ఎగువ ప్రాంత రైతులు

దర్శి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలకు నీటి పరిమాణం తగ్గిపోయింది. ప్రధాన కాలువతో పాటు బ్రాంచ్ కాలువలకు నీటి సరఫరా తక్కువగా జరుగుతుండటంతో మేజర్లు, మైనర్లకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. ముమ్మరంగా వరినాట్లు సాగుచేస్తున్న తరుణంలో సాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా మారటంతో ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల ఒకటో తేదీనుంచి వరిసాగుకు అధికారికంగా నీరు విడుదల చేస్తున్నారు. దీంతో అన్నిప్రాంతాల్లో ఆయకట్టు రైతులు వరినార్లు పోసుకొని నాట్లు వేసుకుంటున్నారు. ఈపరిస్థితుల్లో సాగర్ కాలువలకు నీటి పరిమాణం తగ్గించటంతో ఏంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు.

ఓబీసీకి అంతంతమాత్రంగా..

సాగర్ డ్యామ్ నుంచి కుడి కాలువలకు గరిష్ఠ స్థాయిలో నీరు విడుదల చేస్తున్నప్పటికీ చివర్లో ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువ(ఓబీసీ)కు వచ్చేసరికి నామమాత్రంగా నీరు సరఫరా అవుతుంది. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం విడుదలవుతున్న నీటి పరిమాణం పరిశీలిస్తే ఈవిషయం స్పష్టమవుతుంది. నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి సాగర్ కుడి కాలువకు పదివేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఆ నీరు బుగ్గవాగుకు చేరుతుంది. బుగ్గవాగు నుంచి సాగర్ ప్రధాన కాలువకు 9390 క్యూసెక్కుల నీరు పంపిణీ చేస్తున్నారు. ఆనీటిని గుంటూరు బ్రాంచ్ కాలువకు రెండు వేల క్యూసెక్కులు, అద్దంకి బ్రాంచ్ కాలువకు 1350 క్యూసెక్కులు, సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు(ప్రకాశం బార్డర్) 2406 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. జిల్లా బార్డర్ నుంచి విడుదల అవుతున్న నీటిని పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 445 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు కేవలం 536 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. సుమారు లక్షా 70వేల ఆయకట్టు ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు అతితక్కువగా నీరు విడుదల చేస్తుండటంతో మేజర్లకు, మైనర్లకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీటిని వాటా ప్రకారం ఒంగోలు బ్రాంచ్ కాలువకు 1200 క్యూసెక్కుల నీరు సరఫరా చేయాలి. ప్రస్తుతం అందులో 50శాతం నీటిని కూడా విడుదల చేయటం లేదు. ఇప్పటివరకు ఎగువన ఉన్న గుంటూరు జిల్లా రైతులు వరినాట్లు వేస్తున్నారన్న సాకుతో అధిక నీరు వాడుతున్నారు. ఇక్కడ వరినాట్లు ప్రారంభమైన తర్వాత కూడా అదే తంతు కొనసాగుతుంది.





దర్శి బ్రాంచ్ కాలువలో తక్కువగా వస్తున్న నీరు (ఇన్‌సెట్లో) ఓబీసీలో పడిపోయిన నీటి పరిమాణం

అధికారుల అంకెల గారడీ..

జిల్లాకు వాటా ప్రకారం నీరు విడుదల చేయటంలో వివక్ష చూపుతున్నారు. అంకెల గారడీతో అధికారులు చేస్తున్న మాయతో చివరి ఆయకట్టు భూముల రైతులకు తీరని అన్యాయం జరుగుతుంది. ఓబీసీలోని మేజర్లు, మైనర్లకు నీరందక ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు నిలిచిపోయాయి. లేత వరిపైరుకు సక్రమంగా నీరందక వాడుముఖం పడుతుంది. గత కొద్దిరోజులుగా జిల్లాకు అతితక్కువగా నీరు విడుదలవుతుండటంతో కాలువలపైకి వెళ్లిన అధికారులను రైతులు ప్రశ్నిస్తుండటంతో ఏమి సమాధానం చెప్పాలో అర్థంకాక సతమతమవుతున్నారు. చివరి ఆయకట్టు భూముల రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఉన్నతాధికారుల గుర్తించి సాగునీరు అన్నిప్రాంతాలకు సక్రమంగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

డీఎస్సీ వైద్య సర్టిఫికెట్లపై నిశిత పరిశీలన

(5వ పేజీ తరువాయి)

మించి అంటే ఏడుగురివి తప్పుడు సర్టిఫికెట్లని తేలింది. మిగిలిన 22 మందిని ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నారు. వినికిడి లోపం ఉన్న 11 మందిని గుంటూరు పంపగా వీరిలో ఐదుగురి సర్టిఫికెట్లు బోగస్‌గా తేలాయి. ఒంగోలు రిమ్స్‌కు వెళ్లిన తొమ్మిది మంది దృష్టి లోపం అభ్యర్థుల్లో ఇద్దరివి బోగస్‌గా గుర్తించారు. శారీరక వైకల్యం ఉన్నవారు ఎనిమిది మంది, మల్టిబుల్ డిజార్డర్ గల ఒక అభ్యర్థి సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్నట్లు డాక్టర్లు తేల్చారు. టీచర్ పోస్టులకు ఎంపిక జోన్‌లో నిలిచి తప్పుడు వైద్య ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారిని అనర్హులుగా ప్రకటించి మెరిట్‌లో ఆ తర్వాత అభ్యర్థులకు ఎంపికలో అవకాశం కల్పించారు. మెడికల్ బోర్డుల ముందు హాజరైన అభ్యర్థుల వివరాలు ఇవీ..

వైకల్యంపేరు	అభ్యర్థులు	తప్పుడివి	సక్రమమైనవి
వినికిడి లోపం	11	05	06
మల్టిబుల్ డిజార్డర్	01	-	01
శారీరక వైకల్యం	08	-	08
దృష్టి లోపం	09	03	07
మొత్తం	29	07	22

15న తుది జాబితా

19న కొత్త టీచర్లకు నియామక ఉత్తర్వులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన కొత్త టీచర్లకు శుభవార్త. తుది ఎంపిక శుక్రవారంతో పూర్తయింది. రిజర్వేషన్లకు సంబంధించి ఎటువంటి వివాదాలకు తావులేకుండా అభ్యర్థులు సమర్పించిన సర్టిఫికెట్లను ఒకటికి రెండుసార్లు పునఃపరిశీలించి తప్పులన్నింటిని పరిశీలించి అర్హులకు ఎంపికలో పెద్దపీట వేశారు. శుక్రవారం అన్ని జిల్లాల డీఈవోలు, ఆర్‌జేడీల సమక్షంలో జాబితాను ఒకటికి రెండుసార్లు పునఃపరిశీలించి తుది జాబితాను ఖరారు చేశారు. ప్రస్తుతం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సెలవులో ఉన్నారు. ఆయన సోమవారం విధులకు హాజరవుతారు. అదేరోజు అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైనట్లు వారి మొబైల్ ఫోన్లకు మెస్సేజ్‌లు పంపుతారు.

జిల్లా నుంచి 30 బస్సులు

వెలగపూడి సచివాలయంలో కొత్త టీచర్ల నియామక పత్రాలు జారీకి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో టీచర్ పోస్టులకు ఎంపికయ్యే 672 మంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల్లో ఒకరు కలిపి 1,344 మందిని 30 బస్సుల్లో తరలించనున్నారు. వీరందరూ 18వ తేదీ సాయంత్రానికి ఒంగోలుకు చేరుకోవాలి. ఒంగోలులో వీరికి బస ఏర్పాటు చేసి రాత్రి భోజనం, 19వ తేదీ ఉదయం అల్పాహారం ఇచ్చి వారందరికి సీఎం సభకు తరలిస్తారు. మళ్ళీ వారిని ఒంగోలు తీసుకు వచ్చే బాధ్యతలను డీఈవోలకు అప్పగించారు. అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

ద్రోణాదులలో పశు వైద్యం కరువు

డాక్టరు లేక పోషకులకు ఇక్కట్లు

మార్టూరు,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోనే పశుపోషకులు ఎక్కువగా ఉన్న గ్రామం ద్రోణాదుల. ఈ గ్రామంలో గేదెలు,ఆవులు,గొర్రెలు, మేకలు ఎ క్కువగానే ఉన్నాయి.అయితే అవి అనారోగ్యానికి గురయిన సమయంలో వాటికి వైద్యం చేయడానికి పశుపోషకులు నానా ఇబ్బందులు పడుతున్నారు.గ్రామంలో పశువుల ఆస్పత్రి ఉన్నప్పటికీ అక్కడ డాక్టరు లేరు. వారానికి ఒకసారి బొబ్బేపల్లి పశువైద్యశాల నుంచి డాక్టరు వస్తారని,అది కూడా ఆయన సక్రమంగా రారని, ఎపుడు వస్తారో కూడా తెలియదని పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాంతో పశువులకు చిన్న అనారోగ్యం సోకినా ప్రయివేటు వ్యక్తుల పైనే ఆధారపడవలసివస్తున్నదని పశుపోషకులు అంటున్నారు.పశువుల ఆస్పత్రిలో సిబ్బంది ఒకరు ఉన్నపటికీ వైద్యం చేయడానికి మందులు మాత్రం లేవు.ఈ కారణంగా గ్రామంలోని రెండు ప్రయివేటు మెడికల్‌షాపులలో విక్రయించే మందులపైనే ఆధారపడవలసి వస్తున్నదని పశుపోషకులు అంటున్నారు.వాటి ధర కూడా అధికంగా ఉంటున్నదని, గ్రామంలో పశువుల ఆస్పత్రి ఉన్నా ఉపయోగం లేదని వాపోతున్నారు.



గేట్ లేకుండా ఉన్న ద్రోణాదుల పశువైద్యశాల

మందుబాబులకు నిలయంగా పశువైద్యశాల ప్రాంగణం

గ్రామంలో పశు వైద్యశాల పక్కనే మద్యం దుకాణం ఉంది.పగలు పశు వైద్యశాల వైపు మందు బాబులు చూడకపోయినా, సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత మద్యం సేవించాలనుకున్న వ్యక్తులు సరంజామాతో పశువైద్యశాల ప్రాంగణాన్ని రెస్టారెంట్ లాగా వినియోగించుకుంటున్నారు. వారిని అదేమిటని అడిగేవారు లేరు. అక్కడకు వెళ్ల వద్దని చేప్పేవారు కూడా లేరు. దాంతో పశువైద్యశాల ప్రాంగణంలో ఖా ళీ మద్యం సీసాలు,గ్లాసులు మన కు కనిపిస్తుంటాయి. దానికి తోడు వైద్యశాల ప్రాంగణం లోపలకు వెళ్లడానికి ఎలాంటి గేట్ లేకపోవడం, మరియు వైద్యశాలకు తూర్పు వైపున ప్రహరీ గోడ లేకపోవడంతో మందుబాబులకు ప్రాంగణం అడ్డాగా మారింది.

ఈ విషయమై అటు అధికారులు గాని, ఇటు గ్రామంలోని ప్రజా ప్రతినిదులు గాని, గ్రామంలోపెత్తనం చేసే నాయకులు గాని పట్టించుకోపోవడం బాధాకరంగా ఉందని పశుపోషకులు వాపోతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన

586 కేసులు పరిష్కారం

పర్చూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 586 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. అందులో 13 సివిల్ కేసులు, 4 వివాహ సంబంధ కేసులు, 31 క్రిమినల్, 13 ఎక్సైజ్ కేసులు, మిగిలిన 525 పెట్టీ కేసులన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణిలు మాట్లాడుతూ ఇరువురి సమ్మతితో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ చక్కని మార్గమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారిణి కె.ప్రశాంతి, జూనియర్ సివిల్ న్యాయాధికారిణి పి.శాంతి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.



పర్చూరు కోర్టులో లోక్‌అదాలత్ కేసులు పరిష్కరిస్తున్న న్యాయాధికారిణి ప్రశాంతి

అద్దంకిలో 739 కేసుల పరిష్కారం

అద్దంకి): అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 739 కేసులు పరిష్కారం అయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అఖిల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 27 సివిల్ కేసులు, 176 క్రిమినల్ కేసులు, 2 చెక్ బౌన్స్ కేసులు, 534 పెట్టీకేసులు(న్యూసెన్స్) రాజీ ద్వారా పరిష్కరించారు. మొత్తం 739 కేసులకు సంబంధించి రూ.56,74,900ల లావాదేవిలు జరిగినట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మీ తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు రామకృష్ణారావు, ఎం. శ్రీనివాసరావు, హైగ్రీవాచారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్తగా అశోక్‌కుమార్

అద్దంకి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ నియమితులయ్యారు. అశోక్‌కుమార్ పూర్వీకులు నియోజకవర్గంలోని సంతమాగులూరు మండలం మామిళ్లపల్లి నుంచి జానపాడు వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. ఇటీవల మామిళ్లపల్లిలో జరిగిన దేవర ఉత్సవాలకు కూడా అశోక్ కుమార్‌తో పాటు పలువురు చింతలపూడి కుటుంబీకులు జానపాడు నుంచి వచ్చారు. ఇలా అద్దంకి నియోజకవర్గంతో అనుబంధం ఉన్న అశోక్‌కుమార్ ఆ పార్టీ అధిష్టానాన్ని ఒప్పించుకొని నియోజకవర్గానికి సమన్వయకర్తగా వచ్చినట్లు తెలుస్తోంది. అయితే కొత్తగా సమన్వయకర్తను నియమించే ముందు అధిష్ఠానం అద్దంకి నియోజక వర్గంలోని నేతలతో ఎలాంటి సమావేశం ఏర్పాటు చేయకపోవడం, కనీసం అభిప్రాయ సేకరణ కూడా చేయకుండానే నేరుగా నియామకం చేపట్టడంపై వైసీపీ నేతలు, కేడర్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అశోక్‌కుమార్‌ను నియమించిన విషయం తెలిసిన వెంటనే నియోజక వర్గంలోని పలువురు నేతలు పిడుగురాళ్లకు వెళ్లి కలిసి అభినందనలు తెలిపారు.



దర్శి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌లు

వచ్చే ఫిబ్రవరికి నడికుడి నుంచి కనిగిరికి రైళ్లు

● డీఆర్ఎం సుదేష్ణసేన్ స్పష్టీకరణ

దర్శి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నడికుడి నుంచి కనిగిరి వరకు వచ్చే ఫిబ్రవరి నాటికి రైళ్లు నడిపే విధంగా చర్యలు తీసుకుంటామని గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్ణసేన్ స్పష్టం చేశారు. దర్శి రైల్వేస్టేషన్‌ను, రైల్వే లైన్ నిర్మాణం పనులను ఆమె పలువురు అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా డీఆర్ఎం సుదేష్ణసేన్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ హజ్‌మీరా మత్తీయ విలేకరులతో మాట్లాడుతూ నడికుడి నుంచి కనిగిరి వరకు 90 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయన్నారు. కనిగిరి వద్ద కేవలం 300 మీటర్లు మాత్రమే రైల్వే ట్రాక్ వేయాల్సి ఉందన్నారు. దర్శి రైల్వేస్టేషన్ పనులతో పాటు అక్కడక్కడా మిగిలిన పనులను డిసెంబరు నెలాఖరులోపు పూర్తిచేస్తామని చెప్పారు. అనంతరం ఉన్నతాధికారుల పరిశీలన జరిగిన తర్వాత రైళ్ల రాకపోకలు ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతం ఒకే రైలు కనిగిరి వరకు వెళ్లి తిరిగి వస్తుందన్నారు. ప్రస్తుతం సింగిల్ రైల్వేలైన్ మాత్రమే పూర్తయినందున కొంతకాలం ఇదేవిధంగా రైళ్లు నడపటం జరుగుతుందన్నారు. అనంతరం వారు పొదిలి మండలం మల్లవరం వరకు రైల్వేలైన్ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వే శాఖ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, సీనియర్ డీఈఎన్ శ్రీనివాసరావు, డీఎస్‌టీ రత్నాకర్, కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముందుకెలా....

(5వ పేజీ తరువాయి)

పాలకసంస్థల ప్రతినిధులతోనూ జేసీ గోపాలకృష్ణ సమీక్షలు చేశారు.

అందరూ కలిసి ముందుకు

ప్రస్తుతం ఆ రంగంలో ఉన్న తీవ్రమైన పోటీలో డెయిరీ ఏ మేరకు సంతృప్తికరంగా నడపగలం, అందుకు ఉన్న ప్రతికూల, సానుకూల పరిస్థితులు ఏమిటి అనే అనుమానాలను సీఎం వ్యక్తం చేస్తూ మరోసారి మాట్లాడాదామని చెప్పినట్లు సమాచారం. ఇదే అంశాలపై ఇరువురు మంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటి రవికుమార్ మధ్య చర్చ సాగగా అసెంబ్లీ సమావేశాల సమయంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులందరూ చర్చించుకొని సీఎం దృష్టికి తీసుకెళ్లడం మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా జిల్లా అధికారులు మాత్రం ప్రస్తుతం డెయిరీ ఆస్తులు, వాటి విలువ, భవనాలు, మిషనరీ స్థితిగతులు అలాగే సంస్థ అప్పులు తదితర అంశాలపై దృష్టిసారించారు. ఆయా అంశాలపై నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

ఎస్పీగా హర్షవర్ధన్ రాజు

(5వ పేజీ తరువాయి)

సంచలనం సృష్టించిన నాటి ఎంపీ, ప్రస్తుత ఉప శాసనసభపతి రఘురామకృష్ణంరాజు కేసు వంటి కీలకమైన కేసుల దర్యాప్తును కూడా దామోదర్‌కు ప్రభుత్వం అప్పగించింది. జిల్లాలో పోలీస్ శాఖ పనితీరు మెరుగుపర్చడం, వివిధ వర్గాల వారితో సమన్వయంగా సాగడంలో వివాదాలు లేకుండా పనిచేసి పేరు తెచ్చుకున్న దామోదర్ కొన్ని విషయాలలో ప్రభుత్వ పెద్దల వద్ద ప్రతికూలత ఎదుర్కొన్నారు. ప్రధానంగా జిల్లాలో సంచలనం కలిగించిన టీడీపీ నేత ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తు విషయంలో పోలీసుల తీరుపై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు వెళ్లాయి. అలాగే కుటుంబపరమైన శుభకార్యం ఒంగోలులో నిర్వహించిన తీరుతోపాటు కొండపి నియోజకవర్గంలోని కొన్ని కేసుల విషయంలోనూ ప్రభుత్వం దృష్టికి ప్రతికూలంగా సంకేతాలు వెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దామోదర్ బదిలీ జరిగినట్లు చర్చ సాగుతోంది.

మృత్యువుతో పోరాడి.. తుదిశ్వాస విడిచి

అంతుచిక్కని వ్యాధితో చిన్నారి సాత్విక్ మృతి

తొలుత అధిక జ్వరం.. ఆపై మెదడుకు ఇన్‌ఫెక్షన్

దాతలు ఆదుకున్నా నిలవని పసిప్రాణం



గుంటూరులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన సాత్విక్

చెన్నుంబొట్ల అగ్రహారం (పర్చూరు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల వయస్సులోనే చిన్నారికి నిండు నూరేళ్లు నిండిపోయాయి. పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారం గ్రామానికి చెందిన విద్యార్థి పేర్లి స్వాతిక్(10) శుక్రవారం మృతి చెందాడు. శనివారం గ్రామంలో విద్యార్థికి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సాత్విక్‌కు పదిరోజుల క్రితం తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో అపస్మారక స్తితికి చేరుకోవడంతో గుంటూరులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చేర్పించారు. అయితే అధిక జ్వరంతో మెదడుకు ఇన్‌ఫెక్షన్ చేరిందని, లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆర్థిక స్తోమత లేక విద్యార్థి తల్లిదండ్రులు తల్లడిల్లారు. సమస్య తెలుసుకున్న పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గనిపిశెట్టి గోవిందరావు, వాట్సప్ గ్రూపు ద్వారా ఆర్థికసాయం కోరారు. రూ.2.5 లక్షల సేకరించారు. లక్షలు ఖర్చుపెట్టి వైద్యం చేయించినా, ఫలితం లేకుండా పోయింది. పదిరోజులపాటు మృత్యువుతో పోరాడిన బాలుడు మృతిచెందారు. ఈ ఘటన గ్రామస్థులను కలచివేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న మండల సేవా పక్వాడ్ ఇన్‌చార్జి రామరాజు

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలి

చినగంజాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా నిర్వహించే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని మండల సేవా పక్వాడ్ ఇన్‌చార్జ్ అడపాల రామరాజు అన్నారు. స్థానిక సోపిరాల రైల్వేగేటు కూడలిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉలిచి రాజేష్‌కుమార్ అధ్యక్షతన సేవా పక్షోత్సవాలపై శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు సేవా పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు రామరాజు తెలిపారు. గ్రామస్థాయిలో సేవా కార్యక్రమాలను నిర్వహించి, పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోనికి తీసుకొని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఉలిచి ఏసుబాబు, మెట్టు వెంకటసుబ్బారావు, అనుమాలశెట్టి శ్రీనివాసరావు, కోలా సుబ్బారావు, మోటుమర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వర్షాలకు నీరు చేరి నిండుగా ఉన్న చెక్‌డ్యాం

చెక్‌డ్యాంలలకు జలకళ

గతంలో వాటర్‌షెడ్ కార్యక్రమం ద్వారా నిర్మించిన చెక్‌డ్యాంలు శిథిలమవడం, పూడికతో నిండిపోయేవి. ఇటీవల పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో చేపట్టిన మరమ్మతుల కారణంగా ప్రస్తుతం ఆ చెక్‌డ్యాంలన్నీ జలకళను సంతరించుకుంటున్నాయి. రెండు రోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి పుల్లలచెరువు మండలం ఎండ్రపల్లి, పీఆర్సీ తాండా ప్రాంతాల్లోని చెక్‌డ్యాంలు నిండి ప్రవహిస్తున్నాయి. టాటా ట్రస్ట్ సహకారంతో విజయవాడకు చెందిన విజయవాహినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ చెక్‌డ్యాంల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టారు. ఇవి ఇప్పుడు మంచి ఫలితాలిస్తున్నాయి.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

జగన్ మట్టిముంత ఇచ్చి రాగిచెంబు లాక్కునే రకం

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- 13 మందికి రూ. 22 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

టంగుటూరు/కొండపి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ ప్రజలకు మట్టిముంత ఇచ్చి రాగి చెంబు లాక్కునే స్వభావం గల వ్యక్తి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఎద్దేవాచేశారు. శనివారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి 13 మంది అనారోగ్య బాధితులకు 22 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్ ఆటో డ్రైవర్లకు పది వేలిచ్చి, జరిమానాల పేరుతో వారి నుంచి 30 వేల రూపాయలు లాగేసుకున్నాడని విమర్శించారు. సంక్షేమం పేరుతో జగన్ పేదలను అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. జగన్ ఏపని చేసినా అందులో మోసం, దోపిడీ ఉందని చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపిస్తున్నాడన్నారు. ఆటో డ్రైవర్లకు రాబోయే దసరా పండుగ కానుకగా 15 వేల రూపాయలు ఆర్థిక సాయం చంద్రబాబు అందించనున్నాడన్నారు.



పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

ప్రశాంతంగా ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

- 100 మందికి 92 మంది హాజరు
- రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇచ్చే అవకాశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-5 పంచాయతీకార్యదర్శులు, బిల్‌కలెక్టర్లకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శనివారం మధ్యాహ్నం జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈకౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 100 మంది గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు సీనియారిటి జాబితాలు ప్రకటించారు. ఆ జాబితాల ప్రకారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని జిల్లా పంచాయతీకార్యాలయంనుంచి ఆదేశాలు ఇచ్చారు. అయితే శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 92 మంది హాజరు కాగా 8 మంది హాజరు కాలేదు. శనివారం హాజరుకాని 8 మంది పంచాయతీ కార్యదర్శులకు సోమవారం వారి వద్దనుంచి ఆప్షన్లు తీసుకోనున్నారు. కాగా బదిలీల కౌన్సెలింగ్‌లో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్ల వద్ద నుంచి ఉద్యోగోన్నతి పొందేందుకు ఆప్షన్లు కూడా తీసుకున్నారు. ఆ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు మూడు రోజుల్లో ఉద్యోగోన్నతులు పొందిన పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు డీపీవో వెంకటేశ్వరరావు తెలిపారు.

కలెక్టరేట్‌కు లిఫ్ట్ సౌకర్యం

- ఎంపీలాడ్స్ నుంచి రూ. 27 లక్షల కేటాయింపు
- అధికారులు, ఉద్యోగులు, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిపాలనభవన్(కలెక్టరేట్)కు లిఫ్ట్ సౌకర్యంకల్పించేందుకు చర్యలు చేపట్టారు. కలెక్టరేట్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు మెట్ల ద్వారానే ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో కలెక్టరేట్ ఆధునీకరణ పనులను కొంత మేర నిర్వహించారు. అయితే కలెక్టరేట్‌లో జరిగే సమావేశాలకు రాష్ట్రమంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి అధికారులు కూడా నిరంతరం వస్తున్నారు. అయితే మూడో అంతస్తులో ఉన్న సమావేశపు హాలులోకి వెళ్లేందుకు కొంత ఇబ్బందికరంగా మారింది.ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో అన్నిశాఖల కార్యాలయాలకు ఉపయోగపడే విధంగా లిఫ్ట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు తాజా మాజీ కలెక్టర్ తమీమ్ అన్సారియా శ్రీకారం చుట్టారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను అదేశించారు. దీంతో లిఫ్ట్ నిర్మాణం చేపట్టేందుకు ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ. 27 లక్షలు కేటాయించినట్లుసమాచారం. ప్రస్తుతం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చాంబర్లకు వెళ్లే మెట్ల వద్ద ఈ లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉంటుందని ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనలు ఒక కొలిక్కి రావడంతో లిఫ్ట్ సౌకర్యం పనులు కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు సమాచారం.

ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పీ రాజాబాబు సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు కృషి చేయాలన్నారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా వివిధ శాఖల అధికారులను పరిచయం చేసుకుంటూ ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు జవాబుదారీతనంతో పాటు నిజాయితీ. బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వ్యక్తిగతంగా బాధ్యత తీసుకొని అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఉందన్నారు. పరిష్కారం కాని సమస్య అంటూ ఏమి ఉండదని, ఆ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా పరిశీలన చేసి పరిష్కరించే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఆయాశాఖలకు సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ రాజాబాబుకు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డితో పాటు ఆయాశాఖల అధికారులు ఉన్నారు.



జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రేపటి నుంచి నుంచి గాలికుంటువ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం

జిల్లాలో ఈనెల 15నుంచి వచ్చేనెల 15వతేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పోషకులు తమ పశువులకు వేయించుకోవాలని కలెక్టర్ రాజాబాబు కోరారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో శనివారం పశుసంవర్ధకశాఖ ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ముందుగా జిల్లాలో గేదెలకు, ఆవులు, ఎద్దులు, గేదెదూడలు, ఆవుదూడలకు గాలికుంటు వ్యాధి సోకుండా వ్యాధినిరోధక టీకాలను నెలరోజుల పాటు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు పశసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రవి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అందుకోసం జిల్లాలో 6.02 లక్షల డోసులు ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయక సంచాలకులు డి. సురేంద్రప్రసాద్, ఏడీ డాక్టర్ పారా శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్ భరత్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



కలెక్టర్ రాజాబాబుకు బొకే అందజేస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీ రాజాబాబుకు జిల్లా అధికారులు, వివిధ ఉద్యోగసంఘాల నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు కలెక్టర్ రాజాబాబును కలిసి బొకేలు, మొక్కలు ఇచ్చి అభినందించారు. అదే విధంగా వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ వర్గాల ప్రతినిధులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కలెక్టర్‌కు వివిధ శాఖల అధికారులు జోసఫ్‌కుమార్, చిరంజీవి, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, పద్మశ్రీ, వరలక్ష్మి, డాక్టర్ రవి, ఎస్.శ్రీనివాసులు, కట్టా వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వరరావు, కిరణ్‌కుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక మధుసూదన్, ఆర్.వాసుదేవరావు, కోశాధికారి ఊతకోలు శ్రీనివాసులు, తహసీల్దార్లు చిరంజీవి,రాజేష్‌తో పాటు పలువురు తహసీల్దార్లు, అసోసియేషన్ నాయకులు అభినందించారు. అదేవిధంగా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వైపీ రంగయ్య, ఏసీ ఆదిరెడ్డిల ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కలెక్టర్ రాజాబాబును కలిసి బొకేలు ఇచ్చి అభినందించారు. మరో వైపు పలుశాఖల ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌ను కలిశారు. ఒంగోలులోని పలు వర్గాలకు చెందిన ప్రతినిధులు కలెక్టర్ రాజాబాబును కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

విరిగిపడిన కొండచరియలు

నిలిచిపోయిన రంగనాయక స్వామి దర్శనాలు

రాచర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో లక్ష్మమ్మ వనం దాటిన తరువాత కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో శనివారం స్వామివారి దర్శనం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రత్యేక పూజలు. స్వామివారికి కైంకర్య సేవలు కార్యక్రమాలు ప్రారంభమైన కొద్ది సేపటికి లక్ష్మమ్మ వనం దాటిన తర్వాత ఒక్కసారిగా కొండ చరియలు విరిగి పడడంతో సమాచారం తెలుసుకున్న ఆలయ ఈవో మల్లవరపు నాగయ్య వెంటనే దర్శనాలను ఆపి, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని భక్తులను అప్రమత్తం చేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోయినప్పటికీ ముందు జాగ్రత్తగా భక్తులను ఆలయం నుంచి వెలుపలికి పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. దీనికి తోడు నల్లమల అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రంగస్వామి గుండానికి వరద నీరు భారీగా చేరుతోంది. దీంతో లక్ష్మమ్మ వనం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తూ భక్తులకు ఇబ్బంది తలెత్తే పరిస్థితి ఏర్పడింది. అప్రమత్తమైన ఈవో నాగయ్య వెంటనే ట్రాక్టర్ల సహాయంతో భక్తులను సురక్షితంగా వాగు దాటించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆలయం మూసివేసి, దర్శనాన్ని నిలిపివేశామని ఆయన తెలిపారు. భక్తులు తమకు సహకరించాలని ఆయన కోరారు.



రంగనాయకస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో అడ్డంగా విరిగిపడిన పెద్దపెద్ద కొండ చరియలు

విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతా

కాలేజీల యాజమాన్యాలతో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఫీజులపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులు కల్పించవద్దని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కాలేజీ యాజమాన్యాలకు సూచించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు కాలేజీ ఖాతాల్లో వేయనందున పరీక్షలు రాయాలంటే వార్షిక ఫీజులు తప్పక కట్టాల్సిందేనని కొన్ని రోజులుగా డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో భయాందోళనలకు గురైన పేద విద్యార్థులు ఇప్పటికే అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అయినా యాజమాన్యాలు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు శనివారం స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డిని జవహర్‌నగర్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కలిసి గోడును వెల్లబోసుకున్నారు. ఈ విషయమై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డిగ్రీ కాలేజీల యాజమాన్యాలను క్యాంపు కార్యాలయానికి పిలిపించారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ప్రవర్తించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ త్వరగా వచ్చేందుకు తాను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడుతానన్నారు. పరీక్ష ఫీజు వరకు విద్యార్థులతో కట్టించుకోవాలన్నారు. విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. అలా చేస్తే తాము కాలేజీలు నడుపుకోలేమని ఒకింత యాజమాన్యాలు నాన్పుడు ధోరణితో వ్యవహరించాయి. దీంతో ఎమ్మెల్యే నారాయణరెడ్డి గట్టిగా ఒత్తిడి చేయడంతో విద్యార్థులతో పరీక్ష ఫీజులు కట్టించుకుంటామని అంగీకరించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయానికి వచ్చిన దివ్యాంగురాలితో మాట్లాడారు. ప్రస్తుతం రూ.6వేలు వస్తున్న పింఛన్‌ను సంపూర్ణ పింఛన్‌గా మార్చు చేయాలని మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే కందుల మాట్లాడారు. కార్యక్రమంలో కాలేజీల యజమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాలేజీల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

అనుమానం పెనుభూతమై..

భార్యను చంపి భర్త ఆత్మహత్యాయత్నం

గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు

రేగలగడ్డలో దారుణం

కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు

మర్రిపూడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను హత్య చేశాడో భర్త.. ఆ తర్వాత తానూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని రేగలగడ్డ గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకెళ్తే... మండలంలోని రేగలగడ్డ గ్రామానికి చెందిన మర్రిపూడి నారాయణ, జయమ్మలకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇదివరకే ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా మూడునెలల క్రితం చిన్న కుమార్తెకు పెళ్లి అయింది. భర్త నారాయణ కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న భార్య తలపై రోకలిబండతో మోది.. ఆ తర్వాత కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం నారాయణ కూడా కత్తితో గొంతకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటివరండాలో ఇంత పెద్ద ఘాతుకం జరిగినప్పటికీ చుట్టుపక్కల వారికి ఎలాంటి అలికిడి కాకపోవడం గమనార్హం. శనివారం తెల్లవారాక చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న సీఐ సోమశేఖర్, ఎస్‌ఐ రమేష్‌బాబు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్, డాగ్ స్క్వాడ్ టీంలను రప్పించి సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. జాగిలం ఇంటి వరండాలోనే తిరిగి వెనుదిరిగిపోయింది. హతురాలి పుట్టింటికి చెందిన వారు ఒక దశలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న నారాయణను ఆసుపత్రికి సైతం తరలించేందుకు అడ్డం తిరిగారు. ఈ దశలో ఎస్ రమేష్‌బాబు జోక్యం చేసుకొని హతుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నందున సత్వర వైద్యసేవలు అందించాల్సి అవసరం ఉందని వారికి నచ్చజెప్పి అంబులెన్స్‌లో ఒంగోలు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లారు. పెద్దకుమార్తె వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్, ఎస్‌ఐ రమేష్‌బాబు

అడ్డగోలుగా గ్రానైట్ రవాణా



టిప్పర్‌లో ప్రమాదకరంగా జారేలా ఉన్న రాళ్లు

చీమకుర్తి సెంటర్‌లో కింద పడిన రాళ్లు ● తప్పిన ప్రమాదం ● చోద్యం చూస్తున్న యంత్రాంగం

చీమకుర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గెలాక్సీ గ్రానైట్ ముడిరాళ్ల రవాణాను నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా నిర్వహిస్తున్నారు. అదనపు లోడుతో ఇష్టారీతిన ప్రమాదభరితంగా నిర్వహిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. శనివారం సాయంత్రం రామతీర్థం వద్ద ఉన్న గ్రానైట్ క్వారీ నుంచి ముడిరాళ్లను గ్రానైట్ టిప్పర్ తీసుకెళుతుంది. ఈక్రమంలో చీమకుర్తి పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ఇసుకవాగు సెంటర్‌లో టిప్పర్ నుంచి రాళ్లు జారిపడ్డాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పిపోయింది. వెంటనే ఎక్స్‌కవేటర్ సహాయంతో రాళ్లను సరిచేసి తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం కలిగింది. సాయంత్రం వేళ రద్దీగా ఉన్న సమయంలో గ్రానైట్ రవాణాని పట్టణం నుంచి నిషేధించినా అక్రమార్కులు ఇవేం పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రమాదకరంగా మారుతోంది. గ్రానైట్ అడ్డగోలు రవాణకు అడ్డుకట్ట వేయటంతో పాటు పట్టణంనుంచి కాకుండా బైపాస్ నుంచి రాళ్లను రవాణా చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.



కిందపడిన రాళ్లను మరో టిప్పర్‌లోకి లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

స్పందించారు..సమస్య పరిష్కరించారు..!





పూలే విగ్రహం వద్ద పారిశుధ్య పనులు చేపట్టిన అధికారులు

ఒంగోలు నగరం కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద కార్పొరేషన్ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మహాత్మా మన్నించు' కథనంపై కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి మాట్లాడుతూ విగ్రహం పరిసరాల్లో ప్రతిరోజు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అలాగే ఆ ప్రాంతంలో వ్యాపారులు ఎవరైనా వ్యర్థాలను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాంతోపాటుగా ఆ ప్రాంతంలోని జాతీయ నాయకుల విగ్రహాల వద్ద ఎలాంటి చెత్త వేయకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పారిశుధ్యం మెరుగు కోసం శానిటరీ విభాగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరు అయిన చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పంపిణీ చేశారు. శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 33మంది లబ్ధిదారులకు రూ.27లక్షల 38వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

12వ వేతన సంఘాన్ని నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం 12వ వేతన సంఘాన్ని నియమించి వెంటనే 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్)ను ప్రకటించాలని బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం వీఐపీరోడ్డులోని ప్రధానోపాధ్యాయుల భవన్‌లో శనివారం బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు జిల్లా ప్రధానకార్యదర్శి వి.మాధవరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌ల భారం ఎక్కువైందని, దానివల్ల బోధన కుంటుపడుతోందని చెప్పారు. ఈ యాప్‌ల విధానాన్ని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.జాలరామయ్య, ఎం.శరత్‌చంద్రబాబు, జగన్నాథం ప్రసాదరావు, గుంటనపల్లి శ్రీనివాసులు, పల్లె కృష్ణమూర్తి, గాలిమోటు భాస్కరరావు, బొంత కళ్యాణ్, నూకతోటి కుమారస్వామి పాల్గొన్నారు.



వర్షంలో తడుస్తూ వెళుతున్న యువతులు

నగరంలో వర్షం

● బురదగా మారిన రోడ్లు



బురదతో ఇబ్బందిపడుతున్న మహిళలు

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఒంగోలులో చిన్నపాటి వర్షపు జల్లులు పడుతున్నాయి. దాంతోపాటు నగరంలోని పలు కాలనీలు బురదమయంగా మారాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన జల్లులకు ప్రజలకి పాట్లు తప్పలేదు. నగరంలోని పీవీఆర్ స్కూలు ఆవరణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కొప్పోలు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, ఇరిగేషన్ కార్యాలయం, మినీస్టేడియంలలో నీరు నిలిచింది. శివారు కాలనీలైన వెంకటేశ్వర కాలనీ, బలరాంకాలనీ, బిలాల్‌నగర్, కరుణామిలటరీ కాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రం జాషువా కాలనీ, మదర్‌థెరిస్సా కాలనీ, ప్రగతికాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణం, స్టేషన్ రోడ్ తదితర ప్రాంతాలలో నీరు నిలిచి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.



- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ వినతి



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన నిరసన వారంలో భాగంగా శనివారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు డీఏ, ఐఆర్, పీఆర్సీ, అరియర్స్‌ను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఆయా సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.శేషారావు, పి.హనుమంతరావు, కె.రవి, ఐ.విజయసారథి, పి.సుబ్బరావు, రామారావు, కె.వెంకటరావు, పీవీ.రాఘవులు, ఎం.సుబ్బయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దామచర్లకు ముస్లింల కృతజ్ఞతలు

ఒంగోలు కార్పొరేషన్: ఒంగోలు నగరం కేశవరాజు కుంటలో ముస్లింల కోసం మూడు ఎకరాలలో ఖబరస్తాన్ (శ్మశానవాటిక) ఏర్పాటుకు స్థలం కేటాయించడం పట్ల నగరంలోని ముస్లింలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సన్మానించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్లను కలిసిన వారు ముస్లింల కోసం చేస్తున్న కృషిని అభినందించారు. ముస్లింల పక్షపాతిగా దామచర్ల స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ హనీఫ్‌ఖాన్, షేక్ కపిల్‌బాషా, అజీమున్నీసా, సిలార్, మున్నా, కరిముల్లా, అల్లాభక్షు, మహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శనగ పంటకు బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలి

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన శనగ పంటకు బోనస్ చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కె.వీరారెడ్డి కోరారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో శనివారం రైతు సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండేళ్ళ నుంచి శనగ పంటకు ధరలు లేక రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేశారన్నారు. పంట పండించేందుకు అప్పులు తెచ్చి సాగు చేశారని, మరలా ఇప్పుడు వ్యవసాయం పనులు చేపట్టేందుకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నాలుగు నెలల క్రితం క్వింటా శనగలు రూ.10వేలకు వ్యాపారులు కొనుగోలు చేసేందుకు వచ్చారన్నారు. ఇప్పుడు క్వింటా రూ.6వేలకు పడిపోవడంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం శనగల దిగుమతిపై గతంలో ఉన్న 30శాతం సుంకం ఎత్తివేయడంతో ఇతర దేశాల నుంచి మన దేశంలోని లక్షల టన్నుల శనగలు దిగుమతి అవుతున్నాయని, దానివల్ల దేశీయ రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అందువల్ల రైతులకు బోనస్ ఇచ్చి శనగలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమారెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా క్వింటా శనగలను రూ10వేలకు కొనుగోలు చేస్తేనే రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. ఈమేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవరపల్లి సుబ్బారెడ్డి, బి.సుబ్బారావు, మహేష్, టీవీ.శేషయ్య, సీహెచ్.వాసు, ఆంజనేయులు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి



ఒంగోలులో కేసు వివరాలను ఆలకిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

ఒంగోలు రూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి పేర్కొన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో శనివారం లోక్‌అదాలత్‌లు నిర్వహించారు. ఒంగోలులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన లోక్‌అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా ఒక్కరోజు జిల్లాలో 167 సివిల్, 6,558 క్రిమినల్, 4 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. ప్రమాద బీమా, ఇతర కొన్నిరకాల కేసుల్లో సుమారు రూ.2కోట్ల పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 25 బెంచీలు ఏర్పాటు చేశామని, ఇందులో న్యాయాధికారులు, న్యాయవాదులు సమస్యలు పరిష్కారం కోసం పని చేశారని వెల్లడించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి సహకరించిన పోలీసులు, ఇతర అధికారులు, సంస్థల ప్రతినిధులకు న్యాయ సేవాధికార సంస్థ తరుపు నుంచి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో...

సింగరాయకొండ: కేసుల పరిష్కరానికి లోక్ అదాలత్ కార్యక్రమం ఒక సమర్థవంతమైన



మాట్లాడుతున్న న్యాయాధికారి లీలాశ్యామ్‌సుందరి

వేదిక అని సింగరాయకొండ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయాధికారి వి.లీలా శ్యామ్‌సుందరి చెప్పారు. సింగరాయకొండలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివాదాల పరిష్కారానికి రాజీ మార్గమే ఉత్తమమని సూచించారు. ఏడాదికి నాలుగుసార్లు నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొదించేలా, త్వరితగతిన న్యాయం చేకూర్చడానికి లోక్‌అదాలత్ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, కార్యదర్శి బక్కమంతుల వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నేలకు తగిన వరి రకాలను ఎంపిక చేసుకోవాలి

● శాస్త్రవేత్త రమేష్



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త రమేష్

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ వ్యవసాయ భూములకు తగిన వరి రకాలను ఎంపిక చేసుకోవాలని దర్శి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రమేష్‌బాబు సూచించారు. కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో వరి వంగడాల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు శనివారం కనపర్తిలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఎంసీహెచ్ 103 వరిరకం చౌడు భూములను తట్టుకొని దిగుబడులు వస్తాయని తెలిపారు. సన్న వరి రకాలను సాగుచేసుకోవడం ద్వారా త్వరగా అమ్ముకోవచ్చన్నారు. వరి పంటలో నిలిచిన నీటిని తొలగించి బురదలో యూరియా చల్లుకోవడం ద్వారా ఎక్కువ శాతం మొక్కకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఆఖరి దుక్కిలో 20 కేజీల జింక్ సల్ఫేట్ వాడాలని సూచించారు. కిలో వరి విత్తనాలకు 3 గ్రాముల కార్బన్‌డిజమ్‌తో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా అగ్గితెగులు నివారించుకోవచ్చని పేర్కొన్నారు. ఉల్లికోడు సోకకుండా నారుమడిలో కిలో కార్బోఫ్యూరాన్ త్రీజి గుళికలను వాడాలని చెప్పారు. యూరియాకి బదులు నానో యూరియాను ఉపయోగించాలని ఏవో వెంకట్రావు తెలిపారు. ప్రతి రైతు ఈ-పంటలో సాగు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు, కార్యదర్శి నడిపినేని శేషగిరి, రైతులు పాల్గొన్నారు.

ఎక్కడి మురుగు అక్కడే!

కాలువలు సక్రమంగా లేక కొత్తసింగరబొట్ల పాలెం ప్రజల అవస్థలు

పొన్నలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తసింగరబొట్లపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సైడు కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. కొన్నిచోట్ల రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఒకటి రెండు బజార్లకు మాత్రమే గతంలో కాలువలు నిర్మించారు. అవి కూడా శిథిలావస్థకు చేరి మురుగు ముందుకు వెళ్లడం లేదు. మిగతా బజార్లకు కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినప్పుడు రోడ్లపైన ఇరువైపులా నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నదని ప్రజలు వాపోతున్నారు. దీనికితోడు దోమలు విపరీతంగా పెరగడంతో అల్లాడిపోతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో సైడు కాలువల నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువలో నిలిచిన మురుగు

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్



కలెక్టర్ రాజాబాబుకు పూల మొక్కను అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న రాజాబాబును నగర కమిషనర్ కె. వెంకటేశ్వరరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కను అందజేసిన కమిషనర్, నగర అభివృద్ధి తదితర అంశాలను వివరించారు.

శాంతిరథం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల మహాప్రస్థానంలో ఫ్రీజర్ బాక్సులు, శాంతిరథం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని మానవత స్వచ్ఛంద సంస్థ కమిటీ ప్రతినిధులు కోరారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఒంగోలులో గల మూడు హిందూ శ్మశాన వాటికలలో పారిశుధ్యం మెరుగు పరచాలని, పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మారెళ్ళ సుబ్బారావు, తమటం రామిరెడ్డి, శరభలింగాచారి, ఎం.భోజిరెడ్డి వడ్డెంపు సుజాతరావ్, కోసూరి శ్రీదేవి, చెరుకూరి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు ఈపోస్ మిషన్ల అందజేత



డీలర్లకు ఈపోస్ మిషన్లు అందజేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కాశి

సింగరాయకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో శనివారం సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు ఐదు మండలాల పరిధిలోని 162 మంది డీలర్లకు కొత్త ఈపోస్ మిషన్లను అధికారులు అందజేశారు. వారి నుంచి పాతవి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె.కాశి మాట్లాడుతూ కార్డుదారులకు పటిష్టంగా రేషన్ పంపిణీ చేయడానికి ప్రభుత్వం కొత్త ఈ పోస్ మిషన్లను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాటా అంజనేయులు, డీలర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



ఆహారం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొండపి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వంద మంది వృద్ధులకు అన్నదానం చేశారు. కొండపికి చెందిన దాత పరిటాల శేషయ్య తన మనుమరాలు హంసిక పుట్టిన రోజు సందర్భంగా కొండపిలో వంద మందికి అన్నదానం చేయడంతోపాటు, ఒంగోలులోని అన్న క్యాంటీన్‌కు వంద మంది పేదలకు అన్నం టోకెన్లు అందజేశారు. అదేవిధంగా కొండపిలోని సీహెచ్‌సీలో రోగులకు పండ్లు అందజేశారు.

మాదాల నరసయ్య, కోటయ్యలకు నివాళి



స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): భూమి కోసం భుక్తి కోసం, విముక్తి కోసం తెలంగాణ సాయుధపోరాటంలో మైనంపాడు గుండ్లవాగు వద్ద అమరులైన మాదాల నరసయ్య, మాదాల కోటయ్య జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మాదాలనరసయ్య, మాదాలకోటయ్య 75వ వర్థంతి సందర్భంగా మైనంపాడురోడ్డులోని గుండ్లవాగు వద్ద వారి స్థూపాలకు వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1950 సెప్టెంబరు 13న మాదాల కోటయ్య, మాదాల నరసయ్యలను మైనంపాడు గుండ్లవాగు దగ్గర పట్టుకుని మలబారు పోలీసులు కాల్చి చంపారన్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలు వేసి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాలం సుబ్బారావు, షేక్ మాబు, కె.హనుమంతరావు బి.సుబ్బారావు, భగత్‌సింగ్, సుబ్బారావు, కమల్ పాల్గొన్నారు.

15 నుంచి గాలికుంటు నివారణ టీకాలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 15వ తేదీ నుంచి గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి అనురాధ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు మద్దులూరు, రుద్రవరం, ఎండ్లూరు, 18, 19న చిలకపాడు, లక్ష్మీపురం, మంగమూరు, 20న బొడ్డువారిపాలెం, చంద్రపాలెం, 22, 23న గంగవరం, కొనగానివారిపాలెం, 24నుంచి 26 వరకు గుమ్మళంపాడు, గుడిపాడు, చలప్పాలెం, 27 నుంచి 30వ తేదీ వరకు ఎనికపాడు, మైనంపాడు, గుర్వారెడ్డిపాలెం, అలాగే అక్టోబరు 1నుంచి 4వరకు పి.తక్కెళపాడు, 6 నుంచి 9 వరకు సంతనూతలపాడు, 10 నుంచి 13వరకు వేములపాడు, మట్టిపాడు, 14, 15వ తేదీన కామేపల్లి గ్రామాల్లో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశుపోషకుల ఇంటివద్దకు వచ్చి వేస్తారని పశువైద్యాధికారి తెలిపారు. 4 నెలల వయస్సున్న దూడలు దగ్గర నుంచి అన్ని గేదెలకు ఈ టీకాలు వేయించాలని ఆమె కోరారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు శనివారం సంతనూతలపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధామయి ఆధ్వర్యంలో పారామెడికల్ సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి పలురకాల పరీక్షలను చేసి మందులను అందజేశారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలైన సంఘటన ఇనమెనమెళ్లూరులో శనివారం జరిగింది. మద్దిరాలపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడిపోయాడు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని స్థానికులు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మద్దిపాడు, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఇనమనమెళ్లూరులో యెనుముల బాలకోటిరెడ్డి వర్థంతి సందర్భంగా ఈనెల 14వ తేదీన ఒంగోలు ఉపాస్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు యెనుముల సుధాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎక్సైజ్‌శాఖ అధికారుల విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

చీమకుర్తి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు శనివారం మంచికలపాడులో విచారణ జరిపారు. గ్రామంలోని బెల్టుషాపులపై స్థానిక మహిళలు భగ్గుమని వాటిని ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం జరగటం, ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురణ కావటంతో జిల్లా, చీమకుర్తి సర్కిల్ ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించారు. గ్రామంలో విచారణ జరిపారు. బెల్టుషాపులు ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని మహిళలకు భరోసా ఇచ్చారు.



బురద నీటితో ఉన్న ఇందిరానగర్ కాలనీ

వానొస్తే వీధులన్నీ బురదమయం

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వానొస్తే ఎర్రగొండపాలెంలో పలు వీధులు బురదమయంగా మారుతాయి. రెండ్రోజులుగా కురిసిన వానలతో 16 వార్డు వీధి రోడ్డు బురద నీటితో నిండి స్థానికుల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా వీధిలో కాలువలు లేకపోవడంతో ప్రతి సారీ ఈ సమస్య ఏర్పడుతోందని ఇందిరానగర్ కాలనీవాసులు చెప్తున్నా రు. వెంటనే చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

స్కాలర్‌షిప్ ఎలాగైనా సాధించాలి

» ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

» ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెరిట్ స్కాలర్‌షిప్‌ను ఎలాగైనా సాధించాలని విద్యార్థులు పట్టుదలతో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కం మెరిట్ సర్టిఫికెట్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ఏర్పాటు చేసింది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలలో ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తియ్యే వరకు ఏటా రూ.12వేలు వంతున నాలుగేళ్లపాటు రూ.48వేలు అందజేస్తారు. మం డల వ్యాప్తంగా జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలో 600 నుంచి 700 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రత్యేక శిక్షణ

ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు పేద విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మండల విద్యాశాఖ అధ్వర్యంలో ఆయా పాఠశాలలోని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సాయంత్రం వేళ ప్రత్యేక శిక్షణ తరగతులు ఇస్తున్నారు. 2008-09లో ప్రవేశపెట్టిన ఈ పథకం పేద విద్యార్థుల విద్యకు భరోసా ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తుంటారు. ఈ పథకంపై విద్యార్థులకు అవగిహన కల్పించడంతో పాటు వారిని ప్రోత్సహిస్తున్నారు.



వైపాలెంలో ప్రత్యేక శిక్షణను పరిశీలిస్తున్న ఎంఈవో

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభం

ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభించారు. ఈ నెల 30 చివరి తేదీ కావడంతో ఇప్పటి నుండే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేస్తున్నారు. డిసెంబర్‌లో ఈ పరీక్ష ఉంటుందని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

పేద విద్యార్థులకు వరం

పేద విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పథకం వరం. మండలంలోని అన్ని పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన, శిక్షణ తరగతులు ఇస్తున్నాం. అర్హత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

- ఆంజనేయులు, ఎంఈవో

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

పెద్ద దోర్నాల, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు మండ్ల శ్రీనివాసులు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం సన్మానించారు. మండలంలోని చిన్నదోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాసులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. ఈ క్రమంలో గూడూరి ఎరిక్షన్ బాబు శాలువా కప్పి సత్కరించారు. శ్రీను మాస్టారు ఉత్తమ అవార్డు అందుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూఎస్ డివిజన్ బాధ్యులు షేక్ హెచ్ రహమాన్, బాలగురువులు, ప్రసాద్, ముర్తుజా, సుధాకర్ రెడ్డి, బురానీ పీరా పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు శ్రీనును సన్మానిస్తున్న ఎరిక్షన్‌బాబు



ఆహ్వాన పత్రికలను అందిస్తున్న బీజేపీ నాయకులు

సృష్టి సభను జయప్రదం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని శంకుస్థాపన జరిగిన స్థలం ఉద్దండరాయునిపాలెంలో జరిగే సృష్టి సభను జయప్రదం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మార్కాపురం పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులను కలిసి ఆహ్వానాలు, కరపత్రాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ మాట్లాడుతూ.. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని సృష్టి విశ్వకర్మ యజ్ఞోత్సవ సభ నిర్వహిస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాసనాల సరోజిని, కృష్ణారావు, జీవీ రెడ్డి, సుబ్బారావు, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న యువత

బేస్తవారపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుని కుటుంబానికి గ్రామ యుస్థులు, యువత శనివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని పందిళ్లపల్లె గ్రామంలో గత 40 సంవత్సరాలుగా ప్రైవేటు ఉపాధ్యాయునిగా స్థిర పడి గ్రామంలోని పిల్లలకు ట్యూషన్ చేప్పుతూ, గ్రామంలోని దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తూ పూజారిగా ఉంటున్న జాగర్లమూడి గురునాథశర్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న గ్రామస్థులు, యువత రూ.5లక్షల పోగు చేసి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు గ్రామస్థులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌కు స్వాగతం



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న వీఆర్వోల సంఘ నేతలు

గిద్దలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతన కలెక్టర్‌గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన రాజాబాబును వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.పి.రంగయ్య ఒంగోలు కలెక్టరేట్‌లో స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందచేశారు. కార్యక్రమంలో వీఆర్‌వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి, కోశాధికారి జానయ్య పాల్గొన్నారు.

బాబా మందిరంలో నూకసాని పూజలు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి) : సాయిబాబా మందిరంలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ కుటుంబ సభ్యులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకసాని బాలాజీ శ్రీశైలం వెళ్తుండగా దోర్నాలలో నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సాయిబాబా మందిరంలో ఆలయ పూజారులతో శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

కులగణన సర్వే నిర్వహించాలి

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జనాబా సర్వేతో పాటు కులగణన నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కేవీ కృష్ణగౌడ్, నియోజకవర్గ కార్యదర్శి బీ రామయ్య శనివారం సీపీఐ సమావేశంలో మాట్లాడారు. కులగణన సర్వే విషయమై 14వ తేదీన 10 గంటలకు ఏపీ సీపీఐ సమితి విజయవాడలోని ఐలాపురం పక్కన శ్రీరామ్ పంక్షన్ హాలో సమావేశం ఉన్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులు యోగయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

సైనిక కాలనీలను ఏర్పాటు చేయాలి



మేజర్ రాంబాబును సన్మానిస్తున్న మజీ సైనికులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో మాజీ సైనికుల కోసం ప్రభుత్వం స్థలం కేటాయించి సైనిక కాలనీని ఏర్పాటు చేయాలని హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఛైర్మన్ చిన్నయ్య అన్నారు. మాజీ సైనికోద్యోగుల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలో మాజీ సైనికులు వేల సంఖ్యలో ఉన్నారని, వారి కోసం సైనిక కాలనీలను ఏర్పాటు చేయాలన్నారు. హౌసింగ్ బోర్డు సొసైటీలుగా ఏర్పడడానికి అవసరమైన వివరాలు వెల్లడించారు. ముఖ్య అతిథి మేజర్ రాంబాబును సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, రామకృష్ణ, అలీ, శ్రీనివాసన్, కృష్ణయ్య, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు సెల్‌ఫోన్ల రికవరీ

పుల్లలచెరువు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. సాంకేతికతను ఉపయోగించి ఫోన్లను గుర్తించారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో బాధితులు నాయుడుపాలెంకు చెందిన కటారు వెంకట్రావు, ముటుకులకు చెందిన గ్రంధిశీల చంద్రశేఖర్‌కు ఎస్ఐ సంపత్‌కుమార్ ఫోన్లను అందజేశారు. సెల్‌ఫోన్‌లు పోయిన వెంటనే సంచయ యాప్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు.

ఉద్యోగులుగా నియమించాలి

గిద్దలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్మశానంలో వృత్తిని నిర్వహించే కాటి కాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి నియమించాలని కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ ఆనంద్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. యుటీఎఫ్ కార్యాలయంలో కాటికాపరుల సంఘం ప్రకాశం జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆనంద్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో కాటికాపరుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్, స్థానిక నాయకులు పెద్దన్న, సురేష్, విజయభాస్కర్ తదితరులతోపాటు సీఐటీయూ నాయకులు ఆవులయ్య, రాజశేఖర్ పాల్గొని ప్రసంగించారు.



హిందీ భాషా దినోత్సవంలో వివిధ వేషధారణలతో విద్యార్థులు

ఘనంగా హిందీ భాషా దివస్

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ హిందీ కవుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. హిందీ అధ్యాపకులు షేక్ కరిముల్లా హిందీ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ హిందీ భాషపై పట్టు సాధించాలన్నారు. వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆదినారాయణ బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాసులు, ఏఓ కృష్ణారెడ్డి, ఏజీఎం అంజయ్య, సాయి సురేంద్ర, కోఆర్డినేటర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : హిందీ భాషా మన దేశానికి అధికారిక భాష అని, విద్యార్థులు హిందీ నేర్చుకోవడం ద్వారా దేశంలోని ఏ ప్రాంతంలోనైనా సులభంగా జీవించగలరని, ఉపాధిలో కూడా అవకాశాలు రాగలవని విశ్వభారతి పాఠశాల ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మి అన్నారు. శనివారం హిందీభాషా దినోత్సవాన్ని విశ్వభారతి పాఠశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంగ్లిషుతోపాటు హిందీ భాషలోనూ ప్రావీణ్యం సాధించడం ప్రతి విద్యార్థికి భవిష్యత్తులో ఎంతో ఉపయోగమని తెలిపారు. విద్యార్థులు కవితలు, పద్యాలు, గేయాలు, పాటలు, నృత్యాలతో హిందీ భాష ఔన్యత్యాన్ని చూపించారు. ఈకార్యక్రమంలో తులసిదాస్, కబీర్, సూరదాస్ వంటి ఉద్యమ కవుల వేషధారణలో అలరించారు.

హనుమంతరెడ్డికి 'ప్రజా సేవారత్న' అవార్డ్

గిద్దలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరుకు చెందిన యోగివేమన తపోవనం ఆధ్యాత్మిక ఆశ్రమం అధ్యక్షుడు పి.హనుమంతరెడ్డికి ప్రజా సేవారత్న అవార్డు లభించింది. చిలకలూరిపేటకు చెందిన జయజయసాయి ట్రస్టు ఆధ్వర్యంలో దత్తసాయి అన్నదాన సమాజం వార్షికోత్సవ కార్యక్రమంలో ఈసంస్థ హనుమంతరెడ్డికి ప్రజా సేవారత్న అవార్డును ముఖ్య అతిథుల సమక్షంలో ప్రదానం చేశారు. హనుమంతరెడ్డి నిరంతరం ఆధ్యాత్మిక సేవలో, సామాజిక సేవ చేస్తున్నారని పలువురు కొనియాడారు.



ప్రజారత్న అవార్డు స్వీకరిస్తున్న హనుమంతరెడ్డి

సమస్యలను పరిష్కరించాలి

గిద్దలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, 11వ పీఆర్సీ అరియర్స్‌ను ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. గిద్దలూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఏపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కన్వీనర్ శోభన్‌బాబు మాట్లాడుతూ డీఎస్సీ వారికి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని, జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లుగా పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. గిద్దలూరు మండల శాఖ అధ్యక్షులుగా పి.జగజీవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నారాయణరావు, రాచర్ల మండలశాఖ అధ్యక్షులుగా రమణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌బాబు, కొమరోలు మండలశాఖ అధ్యక్షుడిగా నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీధరశర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, యోహాన్‌రెడ్డి, సుబ్బరాయుడు, మల్లికార్జునరావు, శోభన్‌బాబు, తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని వినతిపత్రం అందచేశారు.

ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం

రాచర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల నాటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించిందని టీడీపీ యువనాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని అనుములవీడు గ్రామంలో శనివారం ఆయన ఆర్‌డీఎస్ఎస్ (రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) పనుల ప్రారంభానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ ద్వారా ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న ససమ్యకు ప్రస్తుత ప్రభుత్వం పరిష్కారం చూపిందన్నారు. పాత విద్యుత్ సర్వీస్‌లన్నింటినీ తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారని, గృహాలపై ప్రమాదకరంగా ఉన్న సర్వీసులు తొలగించి గ్రామ వెలుపల నుంచి వేస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చప్పిడి శ్రీనివాసరావు, డీవీ రమణారెడ్డి, వీ శివరామిరెడ్డి, రఘురామిరెడ్డి, యామ సంజయ్, తలపాటి దివాకర్, పీ ఆంజనేయులు, విద్యుత్ శాఖ ఏఈ బాలగురవయ్య, జేఎల్ఎం రహమత్ బాషా, షిఫ్ట్ ఆపరేటర్ నారాయణ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి

హెల్మెట్లు ధరించడం అందరి బాధ్యత

» ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

» అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీసులకు పంపిణీ



పోలీస్ అధికారులకు హెల్మెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్లు ధరించడం ప్రాణాలకు రక్షణ అని, ఇది అందరి బాధ్యత అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిద్దలూరు సర్కిల్ పరిధిలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు పోలీసులకు వ్యవస్థాపకులు బోనేని వెంకటేశ్వర్లు సమకూర్చిన హెల్మెట్లు, వాటర్‌బాటిల్స్ క్యాప్‌లను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదం జరిగితే కుటుంబం అనాథ అవుతుందని, యువత మోటార్ వాహనాలపై అతివేగంగా వెళ్లడం చాలా ప్రమాదమని తెలిపారు. తల్లిదండ్రులు తమపిల్లల పట్ల జాగ్రత్తలు వహిస్తూ వారిని హెచ్చరిస్తూ ఉండాలని సూచించారు. కంభం సీఐ మల్లికార్జున మాట్లాడుతూ ఇటీవల ఓ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదానికి గురై తలకు బలమైన గాయం కావడంతో మంచానికి పరిమితం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వాటిని దృష్టిలో పెట్టుకుని సంస్థ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు స్పందించి పోలీసులకు హెల్మెట్లు అందించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. సమావేశంలో గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని, ప్రజలకు కూడా హెల్మెట్లు ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకోటయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ షానేషావలి, మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ ఛైర్మన్ గోడి ఓబులరెడ్డి, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, బిజ్జం రవీంద్రరెడ్డి, రాష్ట్ర ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ డైరెక్టర్ గోన చెన్నకేశవులు, టీడీపీ నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

మురుగు తొలగింపు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి ప్రాంగణంలో మురుగు శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం వచ్చిన కథనంపై వైద్యశాల కమిటీ సభ్యులు, సిబ్బంది, మలేరియా అధికారులు స్పందించారు. ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేపట్టి మురుగును తొలగించారు. దీంతో రోగులు వారి బంధువులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి కమిటీ సభ్యులు మహేష్‌నాయుడు, మలేరియా యూనిట్ అధికారి విజయ భాస్కర్ పర్యవేక్షించారు.

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ప్రధాన కార్యదర్శిగా రవిచంద్రకుమార్



రవిచంద్రకుమార్ సంపత్ కృష్ణ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మార్కాపురం పట్టణానికి చెందిన తెలుగు పండితులు ఎం.రవిచంద్రకుమార్ ఎన్నికయ్యారు. గుంటూరులో జరిగిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పర్యవేక్షకులుగా లక్ష్మీకాంత్, ఎంఎస్ఎన్ ప్రసాద్ వ్యవహరించారు. 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరు జిల్లాకు చెందిన ఎన్.సంపత్ కృష్ణ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి జోత్స్నదేవి

నల్లబర్లీ పొగాకు సాగు చేయొద్దు

తర్లుపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు నల్లబర్లీ పొగాకును సాగు చేయొద్దని వ్యవసాయాధికారి జోత్స్నదేవి సూచించారు. వద్దన్నా బర్లీ పొగాకు సాగు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వ్తాపై ఆమె స్పందించి తర్లుపాడు, సీతానాగులవరం, తాడివారిపల్లెలో రైతులకు బర్లీ పొగాపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు నిషేధించిందని, దీనిని సాగు చేయవద్దని సూచించారు. ఐటీసీ కంపెనీ వారు వైట్ బర్లీ మాత్రమే సాగు చేయాలని రైతులకు బాండ్లు ఇచ్చారన్నారు. కంపెనీ అనుమతి పొందిన వారు మాత్రమే వైట్ బర్లీ సాగు చేయాలన్నారు. లేనివారు ఎలాంటి బర్లీ పొగాకు సాగు చేయొద్దని జోత్స్నదేవి సూచించారు. కార్యక్రమంలో ఏఈవో దేవేంద్ర గౌడ్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 231 కేసులు పరిష్కారం

మార్కాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 231 కేసులు పరిష్కారమయ్యాయి. ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి పర్యవేక్షణలో మూడు బెంచీల్లో లోక్ అదాలత్ నిర్వహించారు. ముందుగా కక్షిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లోక్ అదాలత్‌ల వలన కలిగే ప్రయోజనాలను న్యాయాధికారులు వారికి వివరించారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి జె.కిషోర్‌కుమార్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు. బెంచ్ సభ్యులుగా పలువురు న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

బలిజ సేవా సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్

కంభం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల కమిటీ నూతన అధ్యక్షులుగా మాజీ సైనికోద్యోగి సూరె ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో శనివారం సంఘ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు పాత అధ్యక్షుడు తోట కోటేశ్వరరావు, సూరే ప్రసాద్‌ను దుశ్శాలవాతో సత్కరించి, బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ పెద్దలు ప్రసాద్‌ను అభినందించారు. వచ్చే నెల 26న కంభం చెరువు కట్టమీద జరగనున్న బలిజ కార్తీక వన భోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అందరూ సహకరించాలని ప్రసాద్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



బలిజ సేవా సంఘ అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

చెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా మార్చాలి

కనిగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి పట్టణంలోని పెద్దచెరువు, నాగులచెరువులను సమ్మర్ స్టోరేజి ట్యాంకులుగా మార్చాలని సీపీఎం జిల్లా నాయకుడు పీవీ శేషయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. భవిష్యత్తులో కనిగిరి ప్రాంత ప్రజలకు నీటికష్టాలు రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా చెరువులుగా స్టోరేజి ట్యాంకులుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా ట్యాంకుల నుంచి పట్టణంలో కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఒంగోలు నగరంలో ఐదు చెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా మార్చి సాగర్ నీటి సరఫరా లైన్లతో అనుసంధానించేలా ప్రయత్నిస్తుండటం శుభపరిణామమన్నారు. కనిగిరి ప్రాంత పాలకులు ఆదిశగా ముందడుగా వేస్తే ప్రజలకు భవిష్యత్తులో నీటి కష్టాలు తప్పుతాయన్నారు. కనిగిరి పెద్దచెరువు, నాగులచెరువులో ఆక్రమణలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏచూరి సీతారాంకు నివాళి

పీసీపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):పేదల కోసం, కులమత రహిత సమాజం కోసం సీపీఎం నేత సీతారాం ఏచూరి కృషిచేశారని వ్యవసాయ సంఘం నాయకులు అన్నారు .మండలంలోని పెదయిర్లపాడు ఆది ఆంధ్రకాలనీలో శనివారం సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఏలియా, మోసే, ఏసుదాసు, అచ్చయ్య, రమేష్, ఇజ్రాయెల్, రంగయ్య, స్టీఫెన్, పి.మహేష్, సలోమి తదితరులు పాల్గొన్నారు.

12వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం 12వ వేతన సంఘాన్ని నియమించి వెంటనే 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్)ను ప్రకటించాలని బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం వీఐపీరోడ్డులోని ప్రధానోపాధ్యాయుల భవన్‌లో శనివారం బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు జిల్లా ప్రధానకార్యదర్శి వి.మాధవరావు మాట్లాడుతూ ఉపధ్యాయులకు యాప్‌ల భారం ఎక్కువైందని, దానివల్ల బోధన కుంటుపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పి.జాలరామయ్య, ఎం.శరత్‌చంద్రబాబు, జగన్నాథం ప్రసాదరావు, గుంటనపల్లి శ్రీనివాసులు, పల్లె కృష్ణమూర్తి, గాలిమోటు భాస్కరరావు, బొంత కళ్యాణ్, నూకతోటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా గ్రానైట్ రాళ్ల రవాణా

చీమకుర్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గెలాక్సీ గ్రానైట్ ముడిరాళ్ల రవాణాను నిబంధనలకు విరు ద్ధంగా అడ్డగోలుగా నిర్వహిస్తున్నారు. అదనపు లోడుతో ఇష్టారీతిన ప్రమాదభరితంగా నిర్వహిస్తూ ప్రజ లను బెంబేలెత్తిస్తున్నారు. శనివారం సాయంత్రం రామతీర్థం వద్ద ఉన్న గ్రానైట్ క్వారీ నుంచి ముడి రాళ్లను గ్రానైట్ టిప్పర్ తీసుకెళుతుంది. ఈక్రమంలో చీమకుర్తి పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ఇసుకవాగు సెంటర్‌లో టిప్పర్ నుంచి రాళ్లు జారిపడ్డాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఆసమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. వెంటనే ఎక్స్‌కవే టర్ సహాయంతో రాళ్లను సరిచేసి తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు కొంత సేపు అంతరాయం కలిగింది. సాయంత్రం వేళ రద్దీగా ఉన్న సమయంలో గ్రానైట్ రవాణాని పట్టణం నుంచి నిషేధించినా అక్రమార్కులు ఇవేం పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రమాదకరంగా మారుతోంది. గ్రానైట్ అడ్డగోలు రవాణకు అడ్డుకట్ట వేయటంతో పాటు పట్టణంనుంచి కాకుండా బైపాస్ నుంచి రాళ్లను రవాణా చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి

ఒంగోలు రూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి పేర్కొన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో శనివారం లోక్‌అదాలత్‌లు నిర్వహించారు. ఒంగోలులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన లోక్‌అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా ఒక్కరోజు జిల్లాలో 167 సివిల్, 6,558 క్రిమినల్, 4 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. ప్రమాద బీమా, ఇతర కొన్నిరకాల కేసుల్లో సుమారు రూ.2కోట్ల పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వెలిగండ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం వెలిగండ్లలోని టీడీపీ కార్యాలయంలో కుటుంబ సాధికార సారథులు, మండల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి కుటుంబ సాధికార సారథులే కీలకమన్నారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. గత ఐదేళ్లలో పార్టీ అధికారంలో లేనప్పటికీ కార్యకర్తలు కష్టపడి పనిచేశారన్నారు. అలాంటి వాళ్ళకి పార్టీ తగిన గుర్తింపు ఇచ్చి అండగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా సాధికార సభ్యులు గ్రామాల్లో తమకు కేటాయించిన కుటుంబాలను సందర్శించి సమస్యలను తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్య ఉంటే సొంత నిధులతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డాక్టర్ ఉగ్ర చెప్పారు. మండలంలోని పద్మాపురం, బల్లవరం, గన్నవరం, గట్లోపల్లి, చెన్నంపల్లి గ్రామాలకు త్వరలో రోడ్లు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన టీడీపీ మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే, నాయకులు ఘనంగా సన్మానించారు.

గన్నవరం బ్రిడ్జి పరిశీలన

గత 12 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గన్నవరం బ్రిడ్జిని పూర్తిచేయిస్తానని ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.రెండు కోట్ల 20 లక్షలు నిధులు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేయించారు. శనివారం గన్నవరం బ్రిడ్జిని పరిశీలించిని ఆయన త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి, గవదకట్ల హరి, ఏఎంసీ చైర్మన్ యారవ రమాశ్రీనివాస్, కొండు భాస్కర్ రెడ్డి, ఒంగోలు శ్రీను, భాస్కర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

» కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రూపశ్రీ



కనిగిరిలో జరిగిన లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేస్తున్న న్యాయాధికారి రూపశ్రీ

కనిగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో 809 కేసులు పరిష్కారమైనట్లు కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.రూపశ్రీ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జరిగిన లోక్ అదాలత్ అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవించా లన్నారు. లేనిపోని ఆవేశాలకు లోనై కక్షలతో కేసులు పెట్టుకుని విలువైన జీవితకాలాన్ని వృధా చేసుకోవద్దన్నారు. లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారమైందంటే ఎవరూ తగ్గినట్లు కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇరువర్గాల గెలుపే లోక్ అదాలత్‌లో పరిష్కారంగా భావించాలని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు.

కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు షేక్ అబ్దుల్ గఫార్, మహమ్మద్ వలి, పాశం పిచ్చయ్య, సుబ్రహ్మ ణ్యం, పోలీసులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శిలో 301 కేసులు పరిష్కారం

దర్శి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దర్శి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 301 కేసులు పరిష్కారమయ్యాయి. అత్యధికంగా ఎస్టీ కేసులు 220, క్రిమినల్ కేసులు 59, ఎక్సైజ్ కేసులు 20, మిగిలిన మరో ఐదు కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి జె.సీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆదేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించిన తరువాత మళ్లీ ఆక్రమణలు జరగకుండా పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలన్నారు. చిరువ్యాపారులు రోడ్లపైనే బండ్లు పెట్టి వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. ప్రధానంగా మమ్మీడాడి సెంటర్, సీఎస్‌పురం రోడ్డు, విరువూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని పెట్టి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టి స్వచ్ఛ పామూరుగా తీర్చిదిద్దాలన్నారు.

సమావేశంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, సీఐ ఎం.భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు, పంచాయతి కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, పందిటి హరీష్, మెంటా నరసింహారావు, పిడుగు శ్రీను మోషే, బండ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పామూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పామూరు నాయకులు శనివారం సాయంత్రం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులుగా నియమితులైన బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, కనిగిరి ఏఎంసీ చైర్మన్‌గా తన సతీమణి యారవ రమాదేవి నియమించి నందుకు శ్రీను, పామూరు సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు డాక్టర్ ఉగ్రను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అంధకారంలో బాలవెంకటాపురం

» వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వీధిలైట్లు లేక చీకట్లో బాలవెంకటాపురం

కనిగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలవెంకటాపురం గ్రామం అంధకారంలో మగ్గుతోంది. రాత్రి అయిందంటే ప్రజలు బయటకురావడానికి భయపడుతున్నారు. వీధిలైట్లులేక చిమ్మిచీకట్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొంది. ఈగ్రామంలో 200 గృహాలకు పైగా ఉన్నాయి. దాదాపు 600 జనాభా ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి చుట్టపుచూపుగా వస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వీధి లైట్లు వెలగటంలేదని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన చెందుతున్నారు. రాత్రి వేళల్లో శివారు నుంచి గ్రామంలోకి వెళ్ళాలంటే ఇబ్బందులు పడుతున్నారు. విషసర్పాలు, అడవి పందులతో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయేమోనని ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో గ్రామంలో కొన్నిచోట్ల టీడీపీ నేతల సొంత ఖర్చుతో వీధి లైట్లు వేయిస్తే అవికూడా పాడైపోయాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు గ్రామంలో పర్యటించి తమ ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పక్కాగృహాల కోసం ఎదురుచూపులు

» మంజూరు కాని నిధులు

» సర్వేలతోనే కాలయాపన

పామూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పీఎంఏవై 2.0 గృహాల మంజూరు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకొన్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం ఈపథకం కింద మండలానికి సుమారు 12 వందల పక్కా గృహాలు మంజూరు చేసింది. సొంత ఇంటి స్థలంఉండి పక్కా గృహం నిర్మించుకొనేవారు దరఖాస్తు చేసుకోవాలని గృహనిర్మాణశాఖ అధికారులు ప్రకటించారు. ఈపథకం కింద యూనిట్ విలువ రూ.2లక్షల 25 వేలుగా ప్రకటించారు. ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.లక్ష, ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.75 వేలు, ఓసీ లబ్ధిదారులకు రూ.25 వేలు అదనంగా మంజూరవుతాయని అధికారులు పేర్కొన్నారు. దాంతో పట్టణంలో సొంతింటి స్థలం కలిగినవారు తమ సొంతింటి కళను నేరవేరుతుందనే ఆశతో పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారుల ఆదేశాలతో లబ్ధిదారులకు సంబంధించి ఇంటి పత్రాలు, ఇంటి స్థలం కొలతలు తీసుకొని సర్వే నిర్వహించి గృహనిర్మాణ శాఖ అధికారులకు అందజేశారు. లబ్ధిదారుల వివరాలను కంప్యూటర్‌లో భద్రపరిచారు. సర్వేలు పూర్తిచేసి పది నెలలు గడుస్తున్నా ఎటువంటి అనుమతులు రాలేదు. దీంతో రెవెన్యూ శాఖ నుంచి పొజిషన్ సర్టిఫికెట్లు పొంది ఇంటి పునాదులు నిర్మించుకొన్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఈవిషయమై గృహనిర్మాణ శాఖ అధికారులను వివరణ కోరగా.. లబ్ధిదారులు ఇంకా ఎవరైన ఉంటే దరఖాస్తులు తీసుకొంటున్నామని తెలిపారు. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించమని ఎవరికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

పెరిగిన నగదు రహిత లావాదేవీలు

» చిన్న దుకాణాల్లోనూ క్యూఆర్ కోడ్‌తో ఏర్పాట్లు



దొనకొండలో టీస్టాల్‌లో స్కానర్ ద్వారా చెల్లిస్తున్న వ్యక్తి

దొనకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోనే కాక గ్రామాల్లోనూ నగదు రహిత లావాదేవీలు ఇటీవల కాలంలో పెరిగాయి. గతంలో ఎటువంటి దుకాణాల్లోనైనా నగదు లావాదేవీలు మాత్రమే జరిగేవి. డిజిటల్ పేమెంట్స్‌పై ప్రజల్లో అవగాహన పెరగటంతో స్మార్ట్ ఫోన్‌ల ద్వారా ఆర్థిక లావాదేవీలకు ప్రజలు పూర్తిగా అలవాటు పడుతున్నారు. కేంద్రప్రభుత్వం ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నగదు రహిత లావాదేవీలను ప్రజలకు చేరువ చేసింది. గతంలో ఆర్టీసీ బస్సుల్లో, రైళ్లల్లో ఎక్కడకు ప్రయాణించాలన్నా సరిపడా చిల్లర తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం బ్యాంక్‌తో అనుసంధానమైన స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆ పరిస్థితికి తెరపడింది.

మారుతున్న కాలానికి అనుగుణంగా చిన్నపాటి తోపుడు బండ్ల నుంచి పెద్దపెద్ద వ్యాపార దుకాణాలు, రైళ్లు, బస్సులు, ఆసుపత్రులు, ఎక్కడికెళ్లినా క్యూఆర్‌కోడ్ అందుబాటులోకి రావటంతో స్మార్ట్ ఫోన్ల ద్వారా వేల రూపాయల నగదు రహిత లావాదేవీలు నిర్వహించుకుంటున్నారు. స్మార్ట్ ఫోన్‌ల్లో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం లాంటి యాప్‌లతో డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. యాప్‌ల నిర్వాహకులు వ్యాపారుల సౌకర్యార్థం దుకాణాల్లో క్యూఆర్‌కోడ్‌తో పాటు సౌండ్ బాక్స్‌లు కూడా అందిస్తున్నారు. రోజువారీ లావాదేవీలకు అనుగుణంగా వ్యాపారస్తులకు యాప్‌ల నిర్వాహకులు రుణాలు సహితం మంజూరు చేస్తుండటంతో ప్రతి వ్యాపారస్తుడు క్యూఆర్‌కోడ్ ఏర్పాటుపట్ల ఆసక్తి చూపుతున్నారు.

చిల్లర ఇబ్బందులు తప్పాయి

- బొందల రాజు, కూరగాయల వ్యాపారి, దొనకొండ

దుకాణాలకు వచ్చే వారిలో ఎక్కువ మంది స్మార్ట్ ఫోన్ల ద్వారా చెల్లింపులు జరుపుతుండటంతో డిజిటల్ పేమెంట్స్ రోజురోజుకు పెరుగుతున్నాయి. మాకు చిల్లర కష్టాలు తగ్గాయి.



రమణయ్య కుమార్తె మానసకు డిపాజిట్ బాండ్ అందజేస్తున్న సహచర విద్యార్థులు

పూర్వ విద్యార్థి కుటుంబానికి చేయూత

పీసీపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థి కుటుంబానికి సహచరులు చేయూతనిచ్చారు. మండలంలోని పడమటిపల్లి గ్రామానికి చెందిన తూమాటి రమణయ్య పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000సంవత్సరంలో పదో తరగతి చదివాడు. అనంతరం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమారులు ఒక కుమార్తె కలరు. అనారోగ్యానికి గురైన అతను గతనెల 31న మృతిచెందాడు. ఈవిషయాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ద్వారా పూర్వ విద్యార్థులు తెలుసుకున్నారు. ఆకుటుంబానికి అండగా ఉండాలని భావించిన స్నేహితులు తలా కొంత నగదు జమచేశారు. సేకరించిన రూ.50 వేల నగదును మృతుడు రమణయ్య కుమార్తె మానస పేరున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్‌కు సంబంధించిన బాండ్‌ను శనివారం రమణయ్య భార్య శ్రీలక్ష్మి, కుమార్తె మానసకు అందజేశారు. కార్యక్రమంలో చందలూరి రమేష్, గోగాడ రమేష్, వేణుగోపాల్‌రెడ్డి, పవన్‌రెడ్డితో పాటు పూర్వ విద్యార్థులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



శ్రీనివాసులును సన్మానించిన ఎరిక్షన్‌బాబు

దొనకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మార్కాపురం, కనిగిరి డివిజన్ల ప్రధాన కార్యదర్శి మండ్ల శ్రీనివాసులును టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు శనివారం సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘానికి చెందిన ఉపాధ్యాయుడు ఉత్తమ అవార్డు అందుకోవటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో రెహమాన్, బాలగురువులు, ప్రసాద్, ముర్తుజా, సుధాకర్ రెడ్డి, బురానీ పీరా తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆధునిక బౌద్ధుడు



మాట్లాడుతున్న ఇంగిలాల రామచంద్రరావు

కనిగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆధునిక బౌద్ధుడని అంబేడ్కర్ ధర్మపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇంగిలాల రామచంద్రరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అంబేడ్కర్ సిద్ధాంతాల అధ్యయన తరగతులు జరిగాయి. రామచంద్రరావు మాట్లాడుతూ అణగారిన వర్గాల రిజర్వేషన్‌ల కోసం కృషి చేసిన వ్యక్తిగానే అంబేడ్కర్‌ను ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన భారతదేశ విముక్తి తత్వవేత్త అని చెప్పారు. ఆయన మహారాష్ట్రలోని నాగపూర్‌లో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారన్నారు. అనంతరం ఇంగిలాల రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దేపూరి వెంకటేశ్వర్లు, పి.మోహన్, నారయ్య, రవీంద్రబాబు, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన నిరసన వారంలో భాగంగా శనివారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు డీఏ, ఐఆర్, పీఆర్సీ అరియర్స్‌ను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఆయా సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.శేషారావు, పి.హనుమంతరావు, కె.రవి, ఐ.విజయసారథి, పి.సుబ్బారావు, రామారావు, కె.వెంకటరావు, పీవీ రాఘవులు, ఎం. సుబ్బయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శనగ పంటకు బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన శనగ పంటకు బోనస్ చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కె.వీరారెడ్డి కోరారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో శనివారం రైతు సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండేళ్ళ నుంచి శనగ పంటకు ధరలు లేక రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేశారన్నారు. పంట పండించేందుకు అప్పులు తెచ్చి సాగు చేశారని, మరలా ఇప్పుడు వ్యవసాయం పనులు చేపట్టేందుకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నాలుగు నెలల క్రితం క్వింటా శనగలు రూ.10వేలకు వ్యాపారులు కొనుగోలు చేసేందుకు వచ్చారన్నారు. ఇప్పుడు క్వింటా రూ.6వేలకు పడిపోవడంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం శనగల దిగుమతిపై గతంలో ఉన్న 30శాతం సుంకం ఎత్తివేయడంతో ఇతర దేశాల నుంచి మన దేశంలోని లక్షల టన్నుల శనగలు దిగుమతి అవుతున్నాయని, దానివల్ల దేశీయ రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అందువల్ల రైతులకు బోనస్ ఇచ్చి శనగలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమారెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా క్వింటా శనగలను రూ10వేలకు కొనుగోలు చేస్తేనే రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. ఈమేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవరపల్లి సుబ్బారెడ్డి, బి.సుబ్బారావు, మహేష్, టీవీ.శేషయ్య, సీహెచ్.వాసు, ఆంజనేయులు .లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

సృష్టి సభను జయప్రదం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని శంకుస్థాపన జరిగిన స్థలం ఉద్దండరాయునిపాలెంలో జరిగే సృష్టి సభను జయప్రదం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మార్కాపురం పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులను కలిసి ఆహ్వానాలు, కరపత్రాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ మాట్లాడుతూ.. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని సృష్టి విశ్వకర్మ యజ్ఞోత్సవ సభ నిర్వహిస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాసనాల సరోజిని, కృష్ణారావు, జీవీ రెడ్డి, సుబ్బారావు, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



..గుర్తుకు రావడం లేదు



• ఇలా నివారించుకుందాం

- రోజూ నిద్రకు 8 గంటలకు కేటాయించాలి.
- డిజిటల్ స్క్రీన్ వినియోగం తగ్గించాలి.
- సుదీర్ఘంగా స్క్రీన్‌పై ఉండాల్సి వచ్చినప్పుడు మధ్యమధ్యలో విరామం తీసుకోవాలి.
- జ్ఞాపకశక్తి, మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపేలా వ్యాయామాలు చేయాలి.
- వాకింగ్, జాగింగ్, ఏరోబిక్స్ వంటి వ్యాయామాలు మెదుడులోని హిప్పా క్యాంపస్ భాగం వృద్ధికి తోడ్పడుతాయి.
- గ్రీన్ టీ, తాజా ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

బంధువుల పేర్లు.. వారి వరసులు గుర్తుకు రావడంలేదు. స్నేహితుల ఫోన్ నెంబర్లు, ఏ పేర్లతో సేవ్ చేసుకున్నారో వెంటనే తెలుసు కోలేకపోతున్నాం. దగ్గరి బంధువులు, సన్నిహితులతో పాటు కొన్నిసార్లు కుటుంబసభ్యుల పుట్టిన రోజు, పెళ్లి రోజులపైనా తడబాటు. చిన్నచిన్న నోటి లెక్కలను కూడా స్వయంగా చేయలేక తికమకపడుతున్నాం. ఒక్కోసారి సొంత ఫోన్ నంబరును కూడా తప్పుగానే చెబుతున్నాం. ఇదీ నేటి సెల్‌తరంలో చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సోకి న డిజిటల్ జబ్బు. ప్రస్తుతం ఇలాంటి సమస్యలు చాలామందిని వేధిస్తు న్నాయి. సెల్ ఫోన్‌ను ఓ పరికరంగా కాకుండా అదో వ్యసనంగా మారడం తోనే తలెత్తిన మానసిక సమస్యగా పలువురు చెప్తున్నారు. గుర్తుకురాక పోవడం.. మతి మరుపు.. తికమక.. గజిబిజి.. తదితర లక్షణాలన్నీ గతంలో వృద్ధులో ఉండేవి. అయితే ప్రస్తుతం ఆ లక్షణాలన్నీ కూడా సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారిన విద్యార్థుల నుంచి పెద్దల వరకు కనిపిస్తున్నాయి. ఈ లక్షణాలు తరుచుగా ఉంటే మాత్రం డిజిటల్ డిమెన్షియా అయి ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు.

పేర్లు, ఫోన్ నెంబర్లపైనా తడబాటు

- రోజురోజుకు పెరిగిపోతోన్న మతిమరుపు
- సెల్‌ఫోన్ల అతి వినియోగంతోనే ఈ ప్రమాదం
- విజ్ఞానం, సృజనాత్మకతను దెబ్బతీస్తోన్న స్క్రీన్లు
- విద్యార్థుల నుంచి యువతరం వరకూ సమస్య
- చాపకింద నీరులా విస్తరిస్తోన్న డిజిటల్ డిమెన్షియా సమస్య

2022లో గుర్తింపు

సాంకేతికను అతిగా వినియోగించుకునే వారిలో జ్ఞాపకశక్తిలో వచ్చే సమస్యలను డిజిటల్ డిమెన్షియాగా 2022లో వైద్యులు గుర్తించారు. దీన్ని డిమెన్షియాకు ప్రారంభంలో వచ్చే మైల్డ్ కాగ్నిటివ్ ఇంపైర్ మెంట్‌గా కూడా పిలుస్తారు. ప్రస్తుతం దీనిపై పరిశోధనలు జరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ సమ యాన్ని స్క్రీన్‌కు కేటాయించడంతో జ్ఞాపకశక్తిపై ప్రభావం పడుతుం దంటున్నారు.

8 లో..



అర్హుల చెంతకు సంక్షేమం



కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

- కలెక్టర్‌గా వినోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ
- ఆ వెంటనే ఎరువుల ఇక్కట్లపై క్షేత్రస్థాయి పరిశీలన

బాపట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారుల చెంతకు చేరుస్తామని డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టర్‌గా డాక్టర్ వి.వినోద్‌కుమార్ శనివారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్‌తో పాటు కలెక్టరేట్‌లోని అధికారులు కలెక్టర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన జోరువానలోనే కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్ని పరిశీలించారు. ఆయా విభాగాల సిబ్బంది పనితీరుపై కొన్ని సూచనలు చేశారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వ ప్రాధమ్యాలకు అనుగుణంగానే పనితీరు ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే వినోద్‌కుమార్ యూరియా పంపిణీపై దృష్టి పెట్టారు. బాపట్ల మార్కెట్ యార్డులోని యూరియా నిల్వలను తనిఖీ చేశారు. జిల్లాకు ఇప్పటి వరకు ఎంత యూరియా వచ్చింది, రైతు సేవాకేంద్రాలకు, పీఏసీఎస్, డీసీఎంఎస్‌లకు ఎంత పంపించారు, గత ఏడాది కన్న ఎక్కువ వచ్చిందా, తక్కువ వచ్చిందా, ఎంతనిల్వ ఉంది, పంపిణీలో సమస్యల వివరాలను వ్యవసాయాధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా అధిక ధరకు అమ్మితే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. ఎరువుల కోసం వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఆర్డీవోలు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంఏవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వ్యవసాయాధికారులు, తహసీల్దార్లు యూరియా పంపిణీ కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. ఎరువుల కొరత, అధిక ధరలపై కంట్రోల్‌రూమ్ 8247040131 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కంట్రోల్‌రూమ్ నెంబరు గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ఎన్ని ఎకరాలలో పంటలు వేశారో అన్ని ఎకరాలకు మాత్రమే యూరియా పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో పి.గ్లోరియా, ఏడీఏ అన్నపూర్ణ, మార్క్‌ఫెడ్ డీఎమ్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో యూరియా స్టాక్ పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

మంచం పట్టిన పల్లెలు

- జ్వరపీడితులతో ఆస్పత్రులు కిటకిట

పర్చూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విష జ్వరాలు, టైఫాయిడ్, డెంగ్యూలతో పల్లెలు మంచం పట్టాయి. జ్వర పీడితులు అల్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో కిక్కిరిసిపోయాయి. గ్రామాల్లో ఇంటికి ఒకరు చొప్పున జ్వరపీడితులు ఉంటున్నారంటే సమస్య ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. వర్షాలతో అపరిశుభ్ర వాతావరణం, కలుషిత నీరు, దోమలతో జ్వరాల తీవ్రత రోజురోజుకు అధికమవుతుంది. రోజుల తరబడి జ్వరం తగ్గక పోవడం, ప్లేట్‌లెట్స్ పడిపోతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బాధితుల్లో అధిక భాగం టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతుండటం వైద్యవర్గాలను ఆందోళనకు గురిచేస్తుంది. దీనికి తోడు అక్కడక్కడ డెంగ్యూ కేసులు కూడా నమోదు అవుతున్నట్లు సమాచారం. పర్చూరు సీహెచ్‌సీలో రోజుకు 120 నుంచి 150కి పైగా ఓపీలు నమోదు అవుతుండగా అందులో సగానికి పైగా జ్వరపీడితులు ఉంటున్నాయి. గతంలో పర్చూరు అంబేద్కర్‌కాలనీ, ఇందిరాకాలనీలో డెంగ్యూ బారిన పడి మృతి చెందిన సంఘటనలు ఉండటంతో ప్రజలు ప్రస్తుతం విజృంభిస్తున్న జ్వరాలతో కలవరానికి గురవుతున్నారు. గ్రామాల్లో కనీసం ఎబెట్ ద్రావణం కానీ, బ్లీచింగ్ కానీ చల్లిన దాఖలాలు లేవు. నేతలు, ఉన్నతాధికారుల పర్యటనల సమయంలో మాత్రం సున్నంతో సరిపెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులు

ఎస్పీలు బదిలీ

- గుంటూరు జిల్లా ఎస్పీగా వకుల్‌జిందాల్
- బాపట్లకు ఉమామహేశ్వర్, పల్నాడుకు కృష్ణారావు
- శ్రీ సత్యసాయి, చిత్తూరు జిల్లాలకు సతీష్‌కుమార్, తుషార్ డూడి



ఎస్పీ వకుల్‌జిందాల్



ఎస్పీ కృష్ణారావు



ఎస్పీ ఉమామహేశ్వర్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తం గా శనివారం జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ఎస్పీలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేసి ఇక్కడ విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్‌ను నియమించారు. బాపట్ల ఎస్పీ తుషార్‌డూడిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేయగా, ఆ స్థానంలో సీఐడీలో విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర్‌ని నియమించారు. పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావును బదిలీ చేసి ప్రస్తుతం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న డీ కృష్ణారావును నియమించారు. గుంటూరు, బాపట్ల ఎస్పీలకు పోస్టింగ్ ఇవ్వగా కంచి శ్రీనివాసరావుకు మాత్రం పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా సతీష్‌కుమార్, తుషార్‌డూడి, శ్రీనివాసరావు గత ఏడాది జూలైలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులకు ఎస్పీలుగా ఆయా జిల్లాల్లో నియమితులయ్యారు. కాగా గుంటూరు జిల్లా ఎస్పీగా నియమితులైన వకుల్ జిందాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

పంజాబ్‌వాసి.. గుంటూరుకు

గుంటూరు ఎస్పీగా నియమితులైన వకుల్‌జిందాల్ పంజాబ్ రాష్ట్రానికి చెందినవారు. పంజాబ్‌లోనే ఇంటర్ వరకు చదివారు. తదనంతరం ఐఐటీ ఢిల్లీలో బీటెక్ కంప్యూటర్స్ పూర్తి చేశారు. ఐపీఎస్ 2016 బ్యాచ్‌కు చెందిన జిందాల్ ఆంధ్రా కేడర్‌కు ఎంపికయ్యారు. ఏఎస్పీగా రంపచోడవరంలో, కృష్ణాజిల్లా ఎస్ఈబీలో ఆ తర్వాత ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది నాటి సీఎం జగన్ సెక్యూరిటీ విభాగంలో పని చేశారు. 2022లో బాపట్ల జిల్లాగా ఏర్పాటయ్యాక తొలి ఎస్పీగా జిందాల్ నియమితులయ్యారు. గత ఎన్నికల సమయంలో ఆయన బాపట్ల ఎస్పీగా పనిచేశారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయనను విజయనగరం ఎస్పీగా బదిలీ చేసింది.

పల్నాడు జిల్లాకు ఐదో ఎస్పీగా..

పల్నాడు జిల్లాకు ఐదో ఎస్పీగా బీ కృష్ణారావు నియమితులయ్యారు. 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కృష్ణారావు 2020లో విశాఖపట్నం రూరల్ ఎస్పీగా పనిచేశారు. ఆ సమయంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతకుముందు విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ ఓఎస్డీగా పని చేశారు. ఏసీబీలో కొంతకాలం ఎస్పీగా పని చేశారు. పులివెందుల ఏఎస్పీగా, అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేశారు. మంగళగిరి, నర్సీపట్నం బెటాలియన్లలో విధులు నిర్వహించారు. కాగా 17 నెలల వ్యవధిలో నలుగురు ఎస్పీలు జిల్లా నుంచి బదిలీ కావడం గమనార్హం.

గ్రూప్-1 నుంచి ఎస్పీగా ఉమామహేశ్వర్

బాపట్ల జిల్లా ఎస్పీగా నియమితులైన ఉమామహేశ్వర్ గ్రూప్ వన్‌కు ఎంపికై డీఎస్పీగా పోలీస్ శాఖలో చేరారు. 2024లో ఆయన ఐపీఎస్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అంతకు ముందు ఆయన గురజాల, కడప డివిజన్లలో డీఎస్పీగా, అదిలాబాద్, వరంగల్ అర్బన్‌లో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించారు. ఇంటిలిజెన్స్, విజిలెన్స్‌తో పాటు సీఐడీ విభాగంలో ఎస్పీగా పనిచేశారు. ఉమామహేశ్వర్ ఆదివారమే బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం. గతేడాది జూలై 17న బాపట్ల జిల్లా ఎస్పీగా తుషార్‌డూడీ బాధ్యతలు తీసుకోగా దాదాపు 14 నెలల పాటు ఇక్కడ సేవలందించారు. సైబర్ నేరాల ఛేదనలో ప్రత్యేక మార్కు కనబరిచారు.

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ బదిలీ

గేదెల కొనుగోళ్లలో ఒత్తిడి నేపథ్యంలో మంత్రికి ఫిర్యాదు.. 24 గంటల్లో వేటు

అద్దంకి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ ధరకు బలవంతంగా గేదెలు కొనుగోలు చేయమని ఒత్తిడి చేయడంపై మహిళలు మండిపడుతున్న నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌ని ప్రభుత్వం బదిలీ చేసింది. గేదెల యూనిట్లకు సంబంధించి అధికారుల తీరుపై వారం రోజులుగా ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అదే సమయంలో మంత్రి రవికుమార్‌ను కలిసిన మహిళలు అధికారుల ఒత్తిడిపై ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మహిళల అభీష్టం మేరకు స్థానికంగా గేదెలు కొనుగోలు చేయించే విధంగా చర్యలు చేపట్టాలని రెండు మూడు సార్లు పీడీ శ్రీనివాస్‌కు మంత్రి ఫోన్ చేసి చెప్పారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం మరోసారి మంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన గొట్టిపాటి వెంటనే ఉన్నతాధికారులు, మంత్రి శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజులలో సమస్య పరిష్కారం అవుతుందని మంత్రి మహిళలకు హామీ ఇచ్చారు. అయితే 24 గంటలు తిరగకుండానే శనివారం పీడీ శ్రీనివాస్‌ను సెర్ప్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అదే సమయంలో ఇన్‌చార్జి పీడీగా ఎస్‌డీసీ లవన్నను నియమించారు.

కరకట్ట అభివృద్ధికి రూ.300 కోట్లు?

రేపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది కరకట్ట అభివృద్ధికి రూ.300 కోట్లతో ప్రణాళికలను సిద్ధం చేశారు. అధ్వానంగా మారిన కరకట్టను పటిష్ఠతపై మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. కరకట్టకు కోతలు - ఎవరికీ పట్టని కరకట్ట.. అంటూ ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన వరుస కథనాలకు మంత్రి అనగాని స్పందించారు. కరకట్టను అభివృద్ధి చేయాలని రూపొందించిన ప్రణాళికలను సంబంధిత అధికారులకు పంపించారు. త్వరలో నిధులు మంజూరు అవుతాయని సమాచారం. ఆ వెంటనే పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మూడు మండలాల పరిధిలోని కరకట్టను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆర్సీ అధికారులు తెలిపారు.

పిడుగుల వాన

- పిడుగుపాటుకు ఐదుగురు మృతి
- బాపట్లలో ఎడతెరిపి లేకుండా వర్షం
- రోడ్లపై నీరు.. రాకపోకలకు అంతరాయం



దాసరి రాణి



సౌరమ్మ



తన్నీరు నాగేంద్రం



దేవరపల్లి సామ్రాజ్యం

బాపట్ల, పెదకాకాని, పెదనందిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై చీకట్లు కమ్ముకువచ్చాయి. అంతలోనే ఉరుములు, మెరుపులతో పెద్దపెట్టున పిడుగులు విరుచుకుపడ్డాయి. బాపట్లతో పాటు గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షం పడింది. కాగా పిడుగుల కారణంగా పల్నాడు జిల్లాలో ఒకరు, గుంటూరు జిల్లాలో నలుగురు మృతి చెందారు. కాగా భారీ వర్షంతో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. బాపట్ల జిల్లాలో శనివారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షపుజల్లులు పడ్డాయి దీంతో లోతట్టుప్రాంతాలలో నీరు నిలిచింది. ప్రధాన రహదార్లపై కూడా వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

పొలం పనుల్లోనే ప్రాణాలు పోయాయి..

శనివారం పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. వర్షాలతో సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు పిడుగుల ధాటికి బెంబేలెత్తిపోయారు. పెదకాకాని మండలం నంబూరు, పెదనందిపాడు మండలం అన్నపర్రులో పొలం పనులు చేస్తున్న నలుగురు కూలీలు పిడుగు పాటుకు మృతి చెందారు.



వెంకటేశ్వర్లు

- పెదకాకాని మండలం నంబూరులోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన దాసరి సౌరమ్మ (39), దాసరి రాణి(41), పాముల మణి, ఎర్రమోతు మరియమ్మ, దాసరి ప్రేమావతి తదితరులు శనివారం గ్రామ శివారులోని పొలంలో కలుపు తీస్తున్నారు. వర్షం పడటంతో చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడింది. దీంతో సౌరమ్మ, రాణి అక్కడికక్కడే మృతి చెందారు. మణి, మరియమ్మ, ప్రేమావతిలకు తీవ్రగాయాలు కాగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులు సౌరమ్మ, రాణిలు వరసకు తోడికోడళ్లు అవుతారు. ఒకే బజారులో పక్కపక్క ఇళ్లు కావటంతో అంబేద్కర్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.
- పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన తన్నీరు నాగేంద్రం(49), దేవరపల్లి సామ్రాజ్యమ్మ(61) గ్రామ శివారులోని పొలాల్లో కూలి పనులకు వెళ్లారు. వర్షంతో ఇంటికి వస్తుండగా చాకలి చెరువు సమీపంలో వారిపై పిడుగు పడింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పరిశీలించిన ఇన్‌చార్జి ఎస్ఐ పృధ్వీపక్‌నాథ్, డీటీ కరిముల్లా వారి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.
- పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన దాసుపాటి వెంకటేశ్వర్లు (63) గేదెలతో పొలం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో అతడి సమీపంలో పిడుగు పడింది. దీంతో అపస్మారక స్థితికి వెళ్లిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారులు ఉన్నారు.



కర్లపాలెం వెళ్ళే రోడ్డుపై నిలిచిన నీరు


మ్యాజిక్ డ్రైన్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల

అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం

● ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌతవరం గ్రామానికి రూ.23.75తో మంజూరైన మ్యాజిక్ కాల్వల నిర్మాణానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఆయనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ఎస్ భాస్కరరావు, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, ఏపీవో ఆర్ మహాలక్ష్మి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, రామాపురం సొసైటీ ఛైర్మన్ భవనం పుల్లారెడ్డి, గిద్దలూరు ఏఎంసీ ఛైర్మన్ బైలడుగు బాలయ్య, నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి, పఠాన్ సనావుల్లా ఖాన్, ఎస్ కళ్యాణ్ రెడ్డి, దప్పిలి కాశిరెడ్డి, ముత్తుముల రాజశేఖర్ రెడ్డి, సయ్యద్ మియా, పాపిశెట్టి శ్రీనివాసులు, సూర్నేని రామకోటయ్య, శిరిగిరి వెంకటపతి, బత్తిని రామకృష్ణ, యానం లక్ష్మీరెడ్డి, ఉలావు శంకర్ నాయుడు, పుట్ట బాలకృష్ణ, సర్పంచ్ మార్తోట లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరాజేశ్వరి పాల్గొన్నారు.


విద్యుత్ దీపాల వెలుగుల మధ్య నాగులపాడు తెలుగుయువత ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలిపోతున్న గణనాథుడు

ఉత్సాహంగా నాగులపాడు వినాయక నిమజ్జనం

అద్దంకి,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపాడులో తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం శనివారం వైభవంగా నిర్వహించారు. నాగులపాడులో తెలుగుయువత నేత పెంట్యాల రామాంజనేయులు, టీడీపీ నేతల ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిమజ్జనోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రానికి అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీ వరకు వినాయక విగ్రహం చేరింది. అనంతరం విద్యుత్ దీపాల వెలుగులు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య రాత్రి 7.30 గంటలకు నిమజ్జనోత్సవం ప్రారంభమైంది. రామ్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, భవానీసెంటర్ మీదుగా ఉత్సవం సాగింది. అనంతరం అర్ధరాత్రి సమయంలో గుండ్లకమ్మనదిలో గణనాథుని నిమజ్జనం చేశారు. అద్దంకి పట్టణంలో నిమజ్జనోత్సవం సాగినంత సేపు ఆయా ప్రాంతాలలో మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి తిలకించారు. అద్దంకి పట్టణంతోపాటు సమీప మండలాలలోని పలు గ్రామాల నుంచి కూడా ప్రజలు, పెద్దసంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు నిమజ్జనోత్సవం చూసేందుకు తరలివచ్చారు. ఎన్‌టీఆర్ విగ్రహం, పలువురు దేవతామూర్తుల విగ్రహాల అలంకరణ, విద్యుత్ దీపాల వెలుగులతో జరిగిన నిమజ్జనోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అడ్డగోలుగా గ్రానైట్ రవాణా

● చీమకుర్తి సెంటర్‌లో కింద పడిన రాళ్లు

● తప్పిన ప్రమాదం ● చోద్యం చూస్తున్న యంత్రాంగం

చీమకుర్తి, సెప్టెంబరు 13, (ఆంధ్రజ్యోతి): గెలాక్సీ గ్రానైట్ ముడిరాళ్ల రవాణాను నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా నిర్వహిస్తున్నారు. అదనపు లోడుతో ఇష్టారీతిన ప్రమాదభరితంగా నిర్వహిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. శనివారం సాయంత్రం రామతీర్థం


టిప్పర్‌లో ప్రమాదకరంగా జారేలా ఉన్న రాళ్లు

వద్ద ఉన్న గ్రానైట్ క్వారీ నుంచి ముడి రాళ్లను గ్రానైట్ టిప్పర్ తీసుకెళుతుంది. ఈక్రమంలో చీమకుర్తి పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ఇసు కవాగు సెంటర్‌లో టిప్పర్ నుంచి రాళ్లు జారిపడ్డాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. అ దృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పిపోయింది. వెంటనే ఎక్స్‌కవే టర్ సహాయంతో రాళ్లను సరిచేసి తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు కొంత సేపు అంతరాయం కలిగింది. సాయంత్రం వేళ రద్దీగా ఉన్న సమయంలో గ్రానైట్ రవాణాని పట్టణం నుంచి నిషేధించినా అక్రమార్కులు ఇవేం పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రమాదకరంగా మారుతోంది. గ్రానైట్ అడ్డగోలు రవాణకు అడ్డుకట్ట వేయటంతో పాటు పట్టణంనుంచి కాకుండా బైపాస్ నుంచి రాళ్లను రవాణా చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.


కిందపడిన రాళ్లను లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

అన్నదాన పథకం అమలుకు ప్రతిపాదనలు

అద్దంకి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అన్నదాన పథకం అమలుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈవో మద్దినేని శ్రీనివాసరావు తెలిపారు. లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం శనివారం దేవస్థానం ఆవరణలో ఛైర్మన్ గుంజి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా నవరాత్రులు ఏర్పాట్లపై చర్చించారు. దేవస్థానం వద్ద ఆర్‌వో ప్లాంట్ మరమ్మతులు, మహామండపం అసంపూర్తి పనులు, అన్నదాన మండపం అసంపూర్తి పనులను దాతల సహకారంతో నిర్దిష్ట సమయంలో పూర్తి చేయించాలని నిర్ణయించారు. నక్షత్ర వనం మొక్కలు నాటే ముందు డ్రిప్, ట్రీ గార్డులను ముందుగా సమకూర్చాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఈవో మద్దినేని శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

శింగరకొండలో భక్తుల రద్దీ

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులరద్దీ ఎక్కువగా ఉంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగల్లు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆకుపూజలు, వాహనపూజలు, అర్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణ లో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి

సాగర్ నీరందక గగ్గోలు

కాలువలకు తగ్గిన నీటి పరిమాణం

మేజర్లు, మైనర్లకు అందక నాట్లకు ఇబ్బందులు

అధికనీరు వాడుకుంటున్న ఎగువ ప్రాంత రైతులు

దర్శి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలకు నీటి పరిమాణం తగ్గిపోయింది. ప్రధాన కాలువతో పాటు బ్రాంచ్ కాలువలకు నీటి సరఫరా తక్కువగా జరుగుతుండటంతో మేజర్లు, మైనర్లకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. ముమ్మరంగా వరినాట్లు సాగుచేస్తున్న తరుణంలో సాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా మారటంతో ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల ఒకటో తేదీనుంచి వరిసాగుకు అధికారికంగా నీరు విడుదల చేస్తున్నారు. దీంతో అన్నిప్రాంతాల్లో ఆయకట్టు రైతులు వరినార్లు పోసుకొని నాట్లు వేసుకుంటున్నారు. ఈపరిస్థితుల్లో సాగర్ కాలువలకు నీటి పరిమాణం తగ్గించటంతో ఏంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు.

ఓబీసీకి అంతంతమాత్రంగా..

సాగర్ డ్యామ్ నుంచి కుడి కాలువలకు గరిష్ఠ స్థాయిలో నీరు విడుదల చేస్తున్నప్పటికీ చివర్లో ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువ(ఓబీసీ)కు వచ్చేసరికి నామమాత్రంగా నీరు సరఫరా అవుతుంది. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం విడుదలవుతున్న నీటి పరిమాణం పరిశీలిస్తే ఈవిషయం స్పష్టమవుతుంది. నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి సాగర్ కుడి కాలువకు పదివేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఆ నీరు బుగ్గవాగుకు చేరుతుంది. బుగ్గవాగు నుంచి సాగర్ ప్రధాన కాలువకు 9390 క్యూసెక్కుల నీరు పంపిణీ చేస్తున్నారు. ఆనీటిని గుంటూరు బ్రాంచ్



దర్శి బ్రాంచ్ కాలువలో తక్కువగా వస్తున్న నీరు (ఇన్‌సెట్లో) ఓబీసీలో పడిపోయిన నీటి పరిమాణం

కాలువకు రెండు వేల క్యూసెక్కులు, అద్దంకి బ్రాంచ్ కాలువకు 1350 క్యూసెక్కులు, సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు(ప్రకాశం బార్డర్) 2406 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. జిల్లా బార్డర్ నుంచి విడుదల అవుతున్న నీటిని పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 445 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు కేవలం 536 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు. సుమారు లక్షా 70వేల ఆయకట్టు ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు అతితక్కువగా నీరు విడుదల చేస్తుండటంతో మేజర్లకు, మైనర్లకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీటిని వాటా ప్రకారం ఒంగోలు బ్రాంచ్ కాలువకు 1200 క్యూసెక్కుల నీరు సరఫరా చేయాలి. ప్రస్తుతం అందులో 50శాతం నీటిని కూడా విడుదల చేయటం లేదు. ఇప్పటివరకు ఎగువన ఉన్న గుంటూరు జిల్లా రైతులు వరి నాట్లు వేస్తున్నారన్న సాకుతో అధిక నీరు వాడుతున్నారు. ఇక్కడ వరినాట్లు ప్రారంభమైన తర్వాత కూడా అదే తంతు కొనసాగుతుంది.

అధికారుల అంకెల గారడీ..

జిల్లాకు వాటా ప్రకారం నీరు విడుదల చేయటంలో వివక్ష చూపుతున్నారు. అంకెల గారడీతో అధికారులు చేస్తున్న మాయతో చివరి ఆయకట్టు భూముల రైతులకు తీరని అన్యాయం జరుగుతుంది. ఓబీసీలోని మేజర్లు, మైనర్లకు నీరందక ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు నిలిచిపోయాయి. లేత వరిపైరుకు సక్రమంగా నీరందక వాడుముఖం పడుతుంది. గత కొద్దిరోజులుగా జిల్లాకు అతితక్కువగా నీరు విడుదలవుతుండటంతో కాలువలపైకి వెళ్లిన అధికారులను రైతులు ప్రశ్నిస్తుండటంతో ఏమి సమాధానం చెప్పాలో అర్థంకాక సతమతమవుతున్నారు. చివరి ఆయకట్టు భూముల రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఉన్నతాధికారుల గుర్తించి సాగునీరు అన్నిప్రాంతాలకు సక్రమంగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ద్రోణాదులలో పశువైద్యం కరువు

డాక్టరు లేక పశుపోషకులకు ఇక్కట్లు

మార్టూరు,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోనే పశుపోషకులు ఎక్కువగా ఉన్న గ్రామం ద్రోణాదుల. ఈ గ్రామంలో గేదెలు,ఆవులు,గొర్రెలు, మేకలు ఎ క్కువగానే ఉన్నాయి.అయితే అవి అనారోగ్యానికి గురయిన సమయంలో వాటికి వైద్యం చేయడానికి పశుపోషకులు నానా ఇబ్బందులు పడుతున్నారు.గ్రామంలో పశువుల ఆస్పత్రి ఉన్నప్పటికీ అక్కడ డాక్టరు లేరు. వారానికి ఒకసారి బొబ్బేపల్లి పశువైద్యశాల నుంచి డాక్టరు వస్తారని,అది కూడా ఆయన సక్రమంగా రారని, ఎపుడు వస్తారో కూడా తెలియదని పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాంతో పశువులకు చిన్న అనారోగ్యం సోకినా ప్రయివేటు వ్యక్తుల పైనే ఆధారపడవలసివస్తున్నదని పశుపోషకులు అంటున్నారు.పశువుల ఆస్పత్రిలో సిబ్బంది ఒకరు ఉన్నపటికీ వైద్యం చేయడానికి మందులు మాత్రం లేవు.ఈ కారణంగా గ్రామంలోని రెండు ప్రయివేటు మెడికల్‌షా


గేట్ లేకుండా ఉన్న ద్రోణాదుల పశువైద్యశాల

పులలో విక్రయించే మందులపైనే ఆధారపడవలసి వస్తున్నదని పశుపోషకులు అంటున్నారు.వాటి ధర కూడా అధికంగా ఉంటున్నదని, గ్రామంలో పశువుల ఆస్పత్రి ఉన్నా ఉపయోగం లేదని వాపోతున్నారు.

మందుబాబులకు నిలయంగా పశువైద్యశాల ప్రాంగణం

గ్రామంలో పశు వైద్యశాల పక్కనే మద్యం దుకాణం ఉంది.పగలు పశు వైద్యశాల వైపు మందు బాబులు చూడకపోయినా, సాయంత్రం 4 గంటలు దాటిన తర్వాత మద్యం సేవించాలనుకున్న వ్యక్తులు సరంజామాతో పశువైద్యశాల ప్రాంగణాన్ని రెస్టారెంట్ లాగా వినియోగించుకుంటున్నారు. వారిని అదేమిటని అడిగేవారు లేరు. అక్కడకు వెళ్ల వద్దని చేప్పేవారు కూడా లేరు. దాంతో పశువైద్యశాల ప్రాంగణంలో ఖా ళీ మద్యం సీసాలు,గ్లాసులు మన కు కనిపిస్తుంటాయి. దానికి తోడు వైద్యశాల ప్రాంగణం లోపలకు వెళ్లడానికి ఎలాంటి గేట్ లేకపోవడం, మరియు వైద్యశాలకు తూర్పు వైపున ప్రహరీ గోడ లేకపోవడంతో మందుబాబులకు ప్రాంగణం అడ్డాగా మారింది.

ఈ విషయమై అటు అధికారులు గాని, ఇటు గ్రామంలోని ప్రజా ప్రతినిదులు గాని, గ్రామంలోపెత్తనం చేసే నాయకులు గాని పట్టించుకోపోవడం బాధాకరంగా ఉందని పశుపోషకులు వాపోతున్నారు.

శనగ పంటకు బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలి

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన శనగ పంటకు బోనస్ చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కె.వీరారెడ్డి కోరారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో శనివారం రైతు సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండేళ్ళ నుంచి శనగ పంటకు ధరలు లేక రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేశారన్నారు. పంట పండించేందుకు అప్పులు తెచ్చి సాగు చేశారని, మరలా ఇప్పుడు వ్యవసాయం పనులు చేపట్టేందుకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నాలుగు నెలల క్రితం క్వింటా శనగలు రూ.10వేలకు వ్యాపారులు కొనుగోలు చేసేందుకు వచ్చారన్నారు. ఇప్పుడు క్వింటా రూ.6వేలకు పడిపోవడంతో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం శనగల దిగుమతిపై గతంలో ఉన్న 30శాతం సుంకం ఎత్తివేయడంతో ఇతర దేశాల నుంచి మన దేశంలోని లక్షల టన్నుల శనగలు దిగుమతి అవుతున్నాయని, దానివల్ల దేశీయ రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అందువల్ల రైతులకు బోనస్ ఇచ్చి శనగలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమారెడ్డి మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా క్వింటా శనగలను రూ10వేలకు కొనుగోలు చేస్తేనే రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. ఈమేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవరపల్లి సుబ్బారెడ్డి, బి.సుబ్బారావు, మహేష్, టీవీ.శేషయ్య, సీహెచ్.వాసు, అంజనేయులు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

మాదాల నరసయ్య, కోటయ్యలకు నివాళి

సంతనూతలపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం భుక్తి కోసం, విముక్తి కోసం తెలంగాణ సాయుధపోరాటంలో మైనంపాడు గుండ్లవాగు వద్ద అమరులైన మాదాల నరస య్య, మాదాల కోటయ్య జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మాదాల నరసయ్య, మాదాలకోటయ్య 75వ వర్ధంతి సందర్భంగా మైనంపాడురోడ్డులోని గుండ్లవాగు వద్ద వారి స్థూపాలకు వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1950 సెప్టెంబరు 13న మాదాల కోటయ్య, మాదాల నరసయ్య లను మైనంపాడు గుండ్లవాగు దగ్గర పట్టుకుని మలబారు పోలీసులు కాల్చి చంపారన్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలు వేసి సేవల ను కొనియాడారు. కార్యక్రమంలో కాలం సుబ్బారావు, షేక్ మాబు, కె.హనుమం తరావు బి.సుబ్బారావు, భగత్‌సింగ్, సుబ్బారావు, కమల్ పాల్గొన్నారు.

గుర్తుకు రావడంలేదు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోను.. సొల్లుఫోనుగానే కాకుండా రకరకాల మానసిక, శారీరక వ్యాధులకు కారణంగా మారుతోంది. సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారిన వారిలో అనేక వ్యాధులు కనిపిస్తున్నాయి. వాటిలో డిజిటల్ డిమెన్షియా ఒకటి. సన్నిహితులు, ఫోన్ నెంబర్లు, కుటుంబసభ్యులు, దగ్గరి బంధువుల వివరాలు చెప్పలేని పరిస్థితి, మెదడు గజిబిజితో చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా ఇబ్బందులు పడటం సర్వసాధారణంగా మారింది. సాంకేతిక ఆధిపత్య యుగంలో మొబైల్ ఫోను, ట్యాబ్, కంప్యూటర్, టీవీ ఇతర సాంకేతిక పరికరాలు వినియోగం పెరిగింది. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వీటితో కాలక్షేపం చేసున్నారు. దీంతో గతంలో వృద్ధులలో సాధారణంగా కనిపించే డిమెన్షియా(చిత్త వైకల్యం) బారిన ఇప్పుడు చిన్న పిల్లలు, యువత పడుతున్నారు. నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు విజ్ఞానం, సృజనాత్మకతను దెబ్బతీస్తుంది. దీంతో చిన్న చిన్న విషయాలను కూడా మరిచిపోతున్నారు. ఈ సమస్య ఎక్కువగా మహిళలో కంటే మగవారిలో కనిపిస్తుంది.

మెదడుపై ప్రతికూల ప్రభావం

సాధారణంగా చదవడం, రాయడం ఇతర పనుల్లో మెదడు క్రియాశీలకంగా పనిచేస్తుంది. ఆదే మొబైల్ ఫోనులో వీడియోలు, గేమ్స్ సినిమాలు చూడటం చేస్తున్నప్పుడు చుట్టూ ఏం జరుగుతుందో కూడా గ్రహించలేకపోతున్నారు. డిజిటల్ తరగతుల రూపంలో విద్యార్థుల్లో స్క్రీన్ వినియోగం గణనీయంగా పెరిగింది. పాఠశాల, కళాశాలల్లో సైతం ప్రాజెక్ట్ వర్క్‌ల పేరుతో ఈ వినియోగం మరితంగా పెరిగింది. ఇంటర్‌నెట్‌లో శోధించడంతో మెదడుకు పని చెప్పడం లేదు. దీంతో జ్ఞాపకశక్తి మీద ప్రభావం చూపుతోంది. దీంతో మెదడు డీయాక్టివ్ అవుతుంది. చిన్నపిల్లలో అయితే ఆటిజం వంటి తీవ్ర దుష్ప్రభావాలు తలెత్తున్నాయి.

పెరుగుతున్న డిజిటల్ డిమెన్షియా

డిజిటల్ డిమెన్షియా బాధితులు రోజురోజు కు పెరుగుతున్నారు. మొబైల్ అతివినియోగంతో ఈ సమస్యలు ఎదురవుతున్నాయి. సాధా రణంగా చిన్నపిల్లల్లో ఆరేళ్ల వరకు మెదడు ఎదుగుతుంది. కాని చాలామంది తల్లిదండ్రు లు పిల్లలకు సెల్‌ఫోన్లు అలవాటు చేస్తున్నా రు. దీంతో మెదడు ఎదుగుదల ఆగిపోతుంది. పిల్లలను ఫోన్లుకు కాకుండా మైదానపు క్రీడల కు అలవాటు చేయాలి. డిమెన్షియాను తొలి దశలో గుర్తించి వైద్యులను, మానసిక నిపుణులను సంప్రదించాలి. -డాక్టర్ వెంకట కిరణ్, మానసిక వైద్య నిపుణుడు, జీ జీహెచ్, గుంటూరు


దర్శి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌లు

వచ్చే ఫిబ్రవరికి నడికుడి నుంచి కనిగిరికి రైళ్లు

● డీఆర్‌ఎం సుదేన్షసేన్ స్పష్టీకరణ

దర్శి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నడికుడి నుంచి కనిగిరి వరకు వచ్చే ఫిబ్రవరి నాటికి రైళ్లు నడిపే విధంగా చర్యలు తీసుకుంటామని గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేన్షసేన్ స్పష్టం చేశారు. దర్శి రైల్వేస్టేషన్‌ను, రైల్వే లైన్ నిర్మాణం పనులను ఆమె పలువురు అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా డీఆర్‌ఎం సుదేన్షసేన్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ హజ్‌మీరా మత్రీయ విలేకరులతో మాట్లాడుతూ నడికుడి నుంచి కనిగిరి వరకు 90 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయన్నారు. కనిగిరి వద్ద కేవలం 300 మీటర్లు మాత్రమే రైల్వే ట్రాక్ వేయాల్సి ఉందన్నారు. దర్శి రైల్వేస్టేషన్ పనులతో పాటు అక్కడక్కడా మిగిలిన పనులను డిసెంబరు నెలాఖరులోపు పూర్తిచేస్తామని చెప్పారు. అనంతరం ఉన్నతాధికారుల పరిశీలన జరిగిన తర్వాత రైళ్ల రాకపోకలు ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతం ఒకే రైలు కనిగిరి వరకు వెళ్లి తిరిగి వస్తుందన్నారు. ప్రస్తుతం సింగిల్ రైల్వేలైన్ మాత్రమే పూర్తయినందున కొంతకాలం ఇదేవిధంగా రైళ్లు నడపటం జరుగుతుందన్నారు. అనంతరం వారు పొదిలి మండలం మల్లవరం వరకు రైల్వేలైన్ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వే శాఖ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, సీనియర్ డీఈఎన్ శ్రీనివాసరావు, డీఎస్‌టీ రత్నాకర్, కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి.. తుదిశ్వాస విడిచి

అంతుచిక్కని వ్యాధితో చిన్నారి సాత్విక్ మృతి

తొలుత అధిక జ్వరం.. ఆపై మెదడుకు ఇన్‌ఫెక్షన్

దాతలు ఆదుకున్నా నిలవని పసిప్రాణం


గుంటూరులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన సాత్విక్


చెన్నుంబొట్ల అగ్రహారం (పర్చూరు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల వయస్సులోనే చిన్నారికి నిండు నూరేళ్లు నిండిపోయాయి. పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారం గ్రామానికి చెందిన విద్యార్థి పేర్లి స్వాతిక్(10) శుక్రవారం మృతి చెందాడు. శనివారం గ్రామంలో విద్యార్థికి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సాత్విక్‌కు పదిరోజుల క్రితం తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో గుంటూరులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చేర్పించారు. అయితే అధిక జ్వరంతో మెదడుకు ఇన్‌ఫెక్షన్ చేరిందని, లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆర్థిక స్తోమత లేక విద్యార్థి తల్లిదండ్రులు తల్లడిల్లారు. సమస్య తెలుసుకున్న పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు గనిపిశెట్టి గోవిందరావు, వాట్సప్ గ్రూపు ద్వారా ఆర్థికసాయం కోరారు. రూ.2.5 లక్షల సేకరించారు. లక్షలు ఖర్చుపెట్టి వైద్యం చేయించినా, ఫలితం లేకుండా పోయింది. పదిరోజులపాటు మృత్యువుతో పోరాడిన బాలుడు మృతిచెందారు. ఈ ఘటన గ్రామస్థులను కలచివేసింది.


సమావేశంలో మాట్లాడుతున్న మండల సేవా పక్వాడ్ ఇన్‌చార్జి రామరాజు

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలి

చినగంజాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా నిర్వహించే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని మండల సేవా పక్వాడ్ ఇన్‌చార్జ్ అడపాల రామరాజు అన్నారు. స్థానిక సోపిరాల రైల్వేగేటు కూడలిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉలిచి రాజేష్‌కుమార్ అధ్యక్షతన సేవా పక్షోత్సవాలపై శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు సేవా పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు రామరాజు తెలిపారు. గ్రామస్థాయిలో సేవా కార్యక్రమాలను నిర్వహించి, పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోనికి తీసుకొని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఉలిచి ఏసుబాబు, మెట్టు వెంకటసుబ్బారావు, అనుమాలశెట్టి శ్రీనివాసరావు, కోలా సుబ్బారావు, మోటుమర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేలకు తగిన వరి రకాలను ఎంపిక చేసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రమేష్

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): రైతులు తమ వ్యవసాయ భూముల కు తగిన వరి రకాలను ఎంపిక చేసుకోవాలని దర్శి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రమేష్‌బా బు సూచించారు. కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో వరి వంగడాల ఎంపిక, యాజ మాన్య పద్ధతులపై అవగాహన సదస్సు శని వారం కనపర్తిలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఎంటీయూ 1061, బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048, ఎంసీహెచ్ 103 వరిరకం చౌడు భూములను తట్టుకొని ది గుబడులు వస్తాయని తెలిపారు. సన్న వరి ర కాలను సాగుచేసుకోవడం ద్వారా త్వరగా అ మ్ముకోవచ్చన్నారు. వరి పంటలో నిలిచిన నీటి ని తొలగించి బురదలో యూరియా చల్లుకోవ డం ద్వారా ఎక్కువ శాతం మొక్కకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఆఖరి దుక్కిలో 20 కేజీల జింక్ సల్ఫేట్ వాడాలని సూచించారు. కిలో వరి విత్తనాలకు 3 గ్రాముల కార్బన్‌డిజ మ్‌తో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా అగ్గితె గులు నివారించుకోవచ్చని పేర్కొన్నారు. ఉల్లికో డు సోకకుండా నారుమడిలో కిలో కార్బోఫ్యూ రాన్ త్రీజి గుళికలను వాడాలని చెప్పారు. యూరియాకి బదులు నానో యూరియాను ఉ పయోగించాలని ఏవో వెంకట్రావు తెలిపారు. ప్రతి రైతు ఈ-పంటలో సాగు వివరాలు న మోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు, కార్యదర్శి నడిపినేని శేషగిరి, రైతులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

17న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండల పరిషత్ కార్యాలయ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. ఈ సమావేశంలో మూడు నెలల కాలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి రానున్న మూడు మాసాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చ చేపడతామన్నారు. అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి తప్పని సరిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం

యద్దనపూడి, (మార్టూరు)సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మద్దు మాల పోలేశ్వరరావుకు హెల్పింగ్ హాండ్స్ సంస్థ వారు శనివారం రూ.7 వేల నగదు, 25 కిలోలు బియ్యం, నిత్యావసర వస్తువులను అందచేశారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్ వలి,కేబుల్ భాషా,పుట్టా అయ్యప్పస్వామి,ఉపాధ్యాయులు సునిల్,పఠాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ హనుమంతరావు మృతి


మద్దినేని హనుమంతరావు(ఫైల్)

ఇంకొల్లు, సెప్టెంబరు 13, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రొటేరియన్ మద్దినేని హనుమంతరావు (87) శనివారం మృతి చెందారు. మద్దినేని హనుమంతరావు పర్చూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా, ఇంకొల్లు మండల ఎంపీపీగా గతంలో పదవీ బాధ్యతలు నిర్వహించారు. గాదె వెంకటరెడ్డి ప్రధాన అనుచరుడుగా ఆయనకు గుర్తింపు ఉంది. మద్దినేని మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తంపరిచారు. రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో కుటుంబసభ్యుల సహకారంతో శంకర్ కంటి వైద్యశాల వైద్యులు మద్దినేని నేత్రాలను సేకరించారు.

నేడు ఇంకొల్లులో మెగా కంటి వైద్యశిబిరం

ఇంకొల్లు, సెప్టెంబరు 13,(ఆంధ్రజ్యోతి) : ఏలూరి చారిటబుల్ ట్రస్టు, శంకర్ కంటి వైద్యశాల గుంటూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి వైద్యసేవలందిస్తారన్నారు. ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా : సీఐ

● తప్పుచేస్తే జైలు శిక్ష తప్పదు

చీరాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించిందని, తప్పు చేస్తే జైలుశిక్ష తప్పదని, రూరల్ సీఐ పంతగాని శేషగిరిరావు హెచ్చరించారు. శనివారం ఈపూరుపాలెం, వేటపాలెంల స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్‌లకు ఎస్సైలు చంద్రశేఖర్, జనార్ధన్‌లతో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. ప్రతిఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వివరించారు. నేరాలకు దూరంగా ఉండి కుటుంబాలతో సంతోషంగా జీవించాలన్నారు. భిన్నంగా వ్యవహరిస్తే పీడీ యాక్టుల నమోదుకు వెనుకాడమని హెచ్చరించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

చీరాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15నుంచి అక్టోబరు 15 వరకు పశువులకు గాలికుంట వ్యాధులకు సంబంధించి నిరోధక టీకాలు అందిస్తున్నట్లు పశువైద్యులు సజ్జా చిట్టిబాబు తెలిపారు. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాలకు సంబంధించిన నాలుగు నెలల దూడల నుంచి అన్నిరకాల పశువులకు టీకాలు పొందాలని ఒక ప్రకటనలో తెలిపారు.

పశుసంవర్థకశాఖ సహాయకులతో సమావేశం

సంతమాగులూరు : జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 15వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు సంతమాగులూరు, బల్లికురవ మండలాలలోని అన్ని గ్రామాల్లో ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశుసంవర్థక సహాయకులు చేస్తారని పశుసంవర్థక ఏడీఏ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం సంతమాగులూరులోని పశువుల ఆసుపత్రి వద్ద రెండు మండలాల పశుసంవర్థక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వలన పశువులలో పాల ఉత్పత్తి, సామర్థ్యం గణనీయంగా తగ్గడం వలన పశుపోషకులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. పాలుతాగే దూడలలో మరణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. గాలికుంటు వ్యాధి టీకాల వలన పాడిపశువుల్లో వ్యాధిని నిరోధించి, పాల ఉత్పత్తి తగ్గకుండా క్రమబద్ధీకరించవచ్చని తెలిపారు. అలాగే మగ పశువుల్లో పనిసామర్థ్యం తగ్గకుండా కాపాడవచ్చన్నారు. దూడలలో మరణాలను నివారించి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగ పడుతుందన్నారు. పశుపోషకులు తమ పశువులకు సకాలంలో టీకాలు వేయించి కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక సహాయకులు, సబ్ సెంటర్ల సిబ్బంది పాల్గొన్నారు.

కారంచేడులో ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని ఎస్సీకాలనీలో ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా అధ్యక్షులు బుడంగుట్ల లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కారంచేడు పోరాట ఉద్యమ స్ఫూర్తితో మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీయస్ నాయకులు రమేష్ మాదిగ, వేల్పుల శ్యామ్ సుందర్, తేళ్ల ఏరువాక, పుల్లరాజు, తేళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో... పుట్టగొడుగులు

● కిలో పుట్టగొడుగులు రూ. 5 వేలు


భవాని సెంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుట్టగొడుగులు

అద్దంకి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చి పుట్టగొడుగులు వస్తున్నా.., సామాన్యులు, మధ్యతరగతి వారు కొనలేని పరిస్థితి ఉంది. పుట్టగొడుగులపై ఆశతో తిందామనుకున్నా.., ధరలు చూసి నిర్ఘాంత పోవాల్సిన పరిస్థితి వస్తోంది. అద్దంకి పట్టణంలో భవానిసెంటర్‌లో శనివారం ఉదయం నుండి పలువురు మహిళలు కూర్చొని పుట్టగొడుగులు అమ్మకాలు చేస్తున్నారు. ఎంతో ఆశ గా కొనుగోలు చేద్దామని వెళ్ళిన వ్యక్తులకు ధరలు విని వారి నోట మాట రావడం లేదు. ఒక్కో కట్ట (సుమారు 10 చిన్న పుట్టగొడుగులు) 200 నుండి 250 రూపాయలకు అమ్మకాలు చేస్తున్నారు. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం ఒక పూట పుట్టగొడుగుల కూర రుచి చూడాలంటే కనీసం 20 కట్టల పుట్టగొడుగులు కావాలి. అంటే రూ.5 వేలు చెల్లించి కొనుగోలు చేయాల్సిందే. దీంతో ధర అడగడం విని నిర్ఘాంత పోవడం సామన్యుడి వంతైంది. ఒకరో ఎంతైనా వెచ్చించి కూర తినాలనుకున్న వారు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.

కొప్పెరపాడుకు వైద్యశాల ఉన్నా.. లేనట్టే..!

● కాగితాలకే పరిమితమైన పీహెచ్‌సీ ● వైద్యసేవల కోసం తొమ్మిది గ్రామాల ప్రజల ఎదురుచూపులు

బల్లికురవ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండల జనాభా క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలోనే రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు మండలానికి మరో పీహెచ్‌సీని మంజురు చేసింది. గుంటుపల్లి గ్రామంలో ప్రాథమిక అరోగ్య కేంద్రం ఉండగా కొప్పెరపాడు గ్రామానికి పీహెచ్‌సీ మంజూరు చేసి ఇద్దరు వైద్యులను కేటాయించారు. కానీ రెండేళ్ల నుంచి అక్కడ భవనం లేక పోవడం, నూతన భవనాల కోసం స్థలం ఎంపిక చేయకపోవడంతో గుంటుపల్లి పీహెచ్‌సీలోనే నూతనంగా మంజూరైన పీహెచ్‌సీ పనిచేస్తోంది. దీంతో తమకు కేటాయించిన వైద్యశాల కాగితాలకే పరిమితం అయ్యిందని పలు గ్రామాల ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

బల్లికురవ మండలంలో సుమారు ఆరవై వేల జనాభా ఉన్నారు. వీరికి వైద్య సేవలు అందించాలంటే గుంటుపల్లిలోని ఒకేఒక్క ప్రాథమిక ఆరోగ్యకేంద్రమే దిక్కయ్యింది. దీంతో ప్రభుత్వం 2023 మే నెలలో కొప్పెరపాడు గ్రామానికి రెండో పీహెచ్‌సీని మంజురు చేసింది. ఈ పీహెచ్‌సీ ద్వారా కొప్పెరపాడు, గుడిపాడు, కూకట్లపల్లి, గొర్రెపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, కొమ్మినేనివారిపాలెం, వైదన వల్లాపల్లి గ్రామాలకు వైద్య సేవలు అందాల్సి ఉంది. కాని ఇంతవరకు నూతన పీహెచ్‌సీని కొప్పెర పాడులో ప్రారంభించలేదు. పీహెచ్‌సీకి ఇరువు రు వైద్యులు, సిబ్బందిని, 104 వాహనాన్ని కేటాయించారు. అక్కడ భవనం లేక వారు గుంటుపల్లి పీహెచ్‌సీలోనే విధులు నిర్వరిస్తున్నారు. జీతాలు కొప్పెరపాడు పీహెచ్‌సీ పేరుపైనే తీసుకుంటున్నా.., ఇంత వరకు అక్కడ నూతనభవనంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో ఉన్నతాధికార్లు వెంటనే జోక్యం చేసుకొని తాత్కలికంగా అయిన నిరుపయెగంగా ఉన్న ప్రభుత్వ భవనాలలో ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి రోగులకు వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని తొమ్మిది గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




కొప్పెరపాడుకు పీహెచ్‌సీ మంజూరు చేస్తూ ఇచ్చిన జీవో, గుంటుపల్లెకు 20 కిలోమీటర్ల దూరంలోని వెలమవారిపాలెం

సీజనల్ వ్యాధులు అరికట్టడంలో జాప్యం

కొప్పెరపాడు గ్రామంలో పీహెచ్‌సీ ఉంటే సమీపంలోని గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉండేది. ఇక్కడ పీహెచ్‌సీ లేకపోవడంతో చిన్నపాటి జ్వరం వచ్చినా, గ్రామాల ప్రజలు పదిహేను కిలోమీటర్ల దూరంలోని గుంటుపల్లి పీహెచ్‌సీకి వెళ్లలేక తీవ్రఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులు వస్తే ప్రజలు పట్టణ ప్రాంతాలకు పరుగులు పెడుతు న్నారు. వైద్యులు ఉండి, సిబ్బంది ఉండి కొప్పెరపాడు లో నూతన ప్రాథమిక అరోగ్య కేంద్రం ఏర్పాటు గురించి అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో వివిధ భవనాలు నిర్మాణంలో ఉన్నాయని వాటిలో తాత్కాలికంగానైనా పీహెచ్‌సీని ప్రారంభిం చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగితే క్షత గాత్రులు పరుగులు

కొప్పెరపాడు గ్రామపరిధిలోని రాష్ట్రీయ రహదారిలో నిత్యం ఏవో ఒక గ్రామ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల బారినపడిన క్షత గాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. సమీపంలో వైద్యశాల ఉంటే ప్రదమ చికిత్స అందించే వీలు ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు ప్రమాదాల బారిన పడి వైద్యం కోసం అద్దంకి, సంతమాగులూరు, గుంటుపల్లి, వైద్యశాలలకు వెళ్లే లోపే ప్రాణాలను విడిచి పెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా అశోక్‌కుమార్

● అశోక్‌కుమార్ పూర్తికులది మామిళ్లపల్లి ● ఎన్నికల ముందు పల్నాడు నుంచి వచ్చిన హనిమిరెడ్డి మార్పు


అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న స్థానిక నేతలు

అద్దంకి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ నియమితులయ్యారు. అశోక్‌కుమార్ పూర్వికులు నియోకవర్గంలోని సంతమాగులూరు మండలం మామిళ్లపల్లి నుంచి జానపాడు వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. ఇటీవల మామిళ్ల పల్లిలో జరిగిన దేవర ఉత్సవాలకు కూడా అశోక్‌కుమార్‌తో పాటు పలువురు చింతలపూడి కుటుంబీకులు జానపాడు నుండి వచ్చారు. ఇలా అద్దంకి నియోజకవర్గంతో అనుబంధం ఉన్న అశోక్‌కుమార్ ఆ పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించుకొని నియోజకవర్గానికి సమన్వయకర్తగా వచ్చినట్లు తెలుస్తోంది. అయితే కొత్తగా సమన్వయకర్తను నియమించే ముందు అధిష్ఠానం అద్దంకి నియోజకవర్గంలోని నేతలతో ఎలాంటి సమావేశం ఏర్పాటు చేయకపోవడం, కనీసం అభిప్రాయ సేకరణ కూడా చేయకుండానే నేరుగా నియామకం చేపట్టడంపై వైసీపీ నేతలు, కేడర్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. సమపన్వయకర్తగా అశోక్‌కుమార్‌ను నియమించిన విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గంలోని పలువురు నేతలు పిడుగు రాళ్లకు వెళ్లి కలిసి అభినందనలు తెలిపారు. అయితే కేడర్‌లో అత్యధికశాతం మందిలో అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ అధిష్ఠానం ఒంటెత్తు పోకడలతో అద్దంకి నియోజకవర్గంలో వైసీపీ మరింత ఇబ్బంది పడే పరిస్తితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో సమన్వయకర్తగా నియమితుడైన డాక్టర్ అశోక్ కుమార్ నియోజకవర్గ వైసీపీ కేడర్‌కు ఎలాంటి చికిత్స చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

నియోజవర్గంలో 2019 ఎన్నికల అనంతరం వైసీపీ ఇన్‌చార్జ్‌గా బాచిన కృష్ణ చైతన్యను నియమించారు. 2023 వరకు సుమారు 4 సంవత్సరాల పాటు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఎన్నికల సమయంలో ఆయన్ను మార్చి పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన పాణెం చిన్నహనిమిరెడ్డిని 2023 డిసెంబరులో నియమించారు. 2024 ఎన్నికలలో హనిమిరెడ్డి పోటీ చేసి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్‌పై సుమారు 25 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం ఏడాదిన్నరగా హనిమిరెడ్డి ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అయితే చుట్టపు చూపుగా వచ్చిపోవడం మినహా కేడర్‌కు అందుబాటులో లేడన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధిష్ఠానం హనిమిరెడ్డిని తప్పించి పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల మండలం జానపాడుకు చెందిన డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌ను నియమించారు. అశోక్‌కుమార్ పిడుగురాళ్లలో వైద్యుడిగా స్థిరపడ్డారు.

చేతి పంపు వద్ద నిలిచిన మురుగు నీరు

● పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు


ఎస్సీ కాలనీలోని చేతిపంపు
ఆ పంపు నుంచి వెళ్లే కాలువపై ఆక్రమణ

బల్లికురవ, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కొప్పెరపాడు ఎస్సీ కాలనీలో పది మంది వినియోగించే చేతి పంపు వద్ద నీరునిలిచి అపరిశుభ్రంగా ఉంటోంది. దీంతో అంటువ్యాధులు ప్రబలే ముంపు ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సీ కాలనీలోని ఓ వీధిలో చేతిపంపు ఉండగా చేతి పంపు ద్వారా వెళ్లే నీటి కాలువను ఒక వ్యక్తి ఆక్రమించుకొని నీటిని వెళ్లకుండా అడ్డు కట్ట వేశారు. దీంతో చేతి పంపు ద్వారా వచ్చే వ్యర్థ నీరు అక్కడే నిలుస్తోంది. దీంతో పెద్దఎత్తున మురుగు చేరుతోంది. దీంతో పగలే దోమలు పెరిగాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే చేతి పంపు నీరు కాలువ ద్వారా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన తహసీల్దార్


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న తహసీల్దార్

చినగంజాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్‌ను చినగంజాం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు తహసీల్దార్ మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డువేసిన నెలరోజుల్లోనే ఆక్రమణ


సూరేపల్లి- వైదన మధ్య బీటీ రోడ్డు అంచులపై వేసిన వ్యర్థాలు

బల్లికురవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి- వైదన బీటీ రోడ్డును ప్రజా కూటమి ప్రభుత్వం నెలరోజుల క్రితం అభివృద్ధి పరిచింది. రూ.3 కోట్ల నిధులతో రోడ్డువేసి అంచులకు ఎర్రమట్టిని తోలింది. గతంలో దెబ్బతిన్న రోడ్డు ఇప్పుడు అద్దంలా మారింది. అయితే సూరేపల్లి పవర్‌ప్లాంట్ సమీపంలో వారం రోజుల క్రితం రోడ్డు అంచులో వ్యర్థాలను వేశారు. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు అంచులు బురదమయం అవుతున్నాయి. రూ. కోట్ల నిధులతో రోడ్డును అభివృద్ధి పరిచిన కొందరు రోడ్డుపైకి వ్యర్థాలను పడవేయడంతో పాటు దమ్ము చక్రాలను తిప్పుతున్నారు. దీంతో రోడ్డు దెబ్బతింటోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు ప్రారంభమై, నెలలు కూడా గడవక ముందే అంచులు ధ్వంసం అయ్యాయని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే రోడ్డు అంచులను తొలగించాలని కోరుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌కు విశేషస్పందన

586 కేసులు పరిష్కారం


పర్చూరు కోర్టులో లోక్‌అదాలత్ కేసులు పరిష్కరిస్తున్న న్యాయాధికారి

పర్చూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 586 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. అందులో 13 సివిల్ కేసులు, 4 వివాహ సంబంధ కేసులు, 31 క్రిమినల్, 13 ఎక్సైజ్ కేసులు, మిగిలిన 525 పెట్టీ కేసులన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణిలు మాట్లాడుతూ ఇరువురి సమ్మతితో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ చక్కని మార్గమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారిణి కె.ప్రశాంతి, జూనియర్ సివిల్ న్యాయాధికారిణి పి.శాంతి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

అద్దంకిలో 739 కేసుల పరిష్కారం

అద్దంకి): అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 739 కేసులు పరిష్కారం అయ్యాయి. సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అఖిల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 27 సివిల్ కేసులు, 176 క్రిమినల్ కేసులు, 2 చెక్ బౌన్స్ కేసులు, 534 పెట్టీకేసులు(న్యూసెన్స్) రాజీ ద్వారా పరిష్కరించారు. మొత్తం 739 కేసులకు సంబంధించి రూ.56,74,900ల లావాదేవిలు జరిగినట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మీ తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు రామకృష్ణారావు, ఎం. శ్రీనివాసరావు, హైగ్రీవాచారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నాన్పుడు వర్షంతో అధ్వానంగా రహదారులు

● కోతకు గురౌతున్న వంతెనలు
● తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కోతకు గురైన కావూరివారిపాలెం - వెదుళ్లపల్లి మధ్య వంతెన



ఆంధ్రకేసరినగర్‌లో అధ్వానంగా రహదారి

చీరాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న నాన్పుడు వర్షంతో నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లు పూర్తిగా జలమయమై, బురదతో దర్శనమిస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన వంతెనలు ప్రమాద భరితంగా ఉన్నాయి. ఇప్పటికే మండల పరిధిలోని కావూరివారిపాలెం - వెదుళ్లపల్లి ప్రధాన వంతెన ఒకపైపు దెబ్బతింది. నిత్యం వందల సంఖ్యలో ఈ మార్గంలో వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పైగా అటు వైపు విద్యుత్ సౌకర్యం కూడా అంతంత మాత్రం గానే ఉంది. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భీతిల్లుతున్నారు. పంచాయతీల్లో నిధులు లేక పారిశుద్య నిర్వహణ సక్రమంగా నిర్వహించడం లేదు. మరోవైపు విజృంబిస్తున్న జ్వరాలతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కోరుకుంటున్నారు.

వర్షపు జల్లులతో ఖరీఫ్ పైర్లకు జీవం

మినుము, మొక్కజొన్నకు మేలు


సాగులో ఉన్న మొక్కజొన్న, మినుము

పంగులూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మూడురోజులుగా పడుతున్న వర్షపు జల్లులు ఖరీఫ్ పంటలకు కొంత ఊపిరి పోసింది. మండలంలో వివిధ దశలలో ఉన్న మినుము, మొక్కజొన్న, పత్తి, మిరపలకు వర్షపు జల్లులు ఉపకరిస్తాయని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో ఖరీఫ్ పంటగా పలు గ్రామాలలో మినుము సాగు చేస్తున్నారు. మండలంలోని ఒక్క కొండమూరు గ్రామంలో 1200 ఎకరాలలో మినుము సాగు చేస్తుండగా, కోటపాడు, అలవలపాడు, రేణంగివరం, ముప్పవరం, బైటమంజులూరు, తూర్పు తక్కెళ్ళపాడు, కొండమంజులూరు గ్రామాలలో 50 నుంచి వంద ఎకరాలకు పైగా మినుము పంటసాగు చేస్తున్నారు. తూర్పుకొప్పెరపాడు, తక్కెళ్ళపాడు, రేణంగివరం, అలవలపాడు, చందలూరు గ్రామాలలో రెండువందల ఎకరాలలో మొక్కజొన్న, తూర్పుకొప్పెరపాడు, పంగులూరు, చందలూరు పరిసర గ్రామాలలో 250 ఎకరాలలో పత్తి, 60 ఎకరాలలో మిరప సాగవుతున్నట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. కొద్దిరోజులక్రితం వరకు అధిక ఎండలతో తల్లడిల్లిన పైరులు గురు, శుక్ర, శనివారాలల్లో కురిసిన వర్షాలు జీవం పోశాయి. మొక్కదశ నుండి పూత, పిందెదశకు చేరుకుంటున్న మినుము, కళ్లెకొచ్చిన మొక్కజొన్నతోపాటు పైర్లకు ప్రస్తుత వర్షం జీవం పోసింది.


చిరు జల్లులతో చల్లబడిన వాతావరణం

బల్లికురవ : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వారం ఎండ వేడిమితో ప్రజలు విలవిలలాడిపోయారు. వాతావరణంలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో గ్రామాలలో రోడ్లు అన్ని చిత్తడి చిత్తడిగా మారాయి. శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. చిరుజల్లుకు తోడు సాగర్ కాలువల నీరు రావడంతో వరి సాగు చేసే రైతులు పనులను ముమ్మరం చేశారు. మెట్ట పంటలకు వర్షం ఉపయోగమని రైతులు పేర్కొంటున్నారు.

అరకు కాఫీ పాయింట్ ఏర్పాటుకు సన్నాహాలు


పాయింట్ వద్ద ఎంపీఎం సురేంద్రతో బ్యాంకు ప్రతినిధులు

మార్టూరు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మార్టూరు నుంచి రాజుపాలెం రోడ్డు వరకు వెళ్లే సర్వీసు రోడ్డులో, శ్రీదుర్గా మల్లీశ్వరి దేవస్థానం దాటిన తర్వాత కాఫీ ప్రియులకు అత్యంత ప్రియమైన అరకు కాఫీ పాయింట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో పీఎంఎఫ్‌ఎంఈ కేంద్ర పథకం ద్వారా మార్టూరు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ షేక్ షాజియాభానుకు, అ రకు కాఫీ పాయింట్ ఏర్పాటుకు ముందుకు వచ్చారు. దీంతో ఆమెకు ఇండియన్ బ్యాంక్ వారు రూ.5.90 లక్షల రుణం మంజూరు చేశారు. దీనిలో 35 శాతం రాయితీ కాగా, 10 శాతం మార్జిన్ మనీగా షాజియా భాను చెల్లించాలి. అనంతరం బ్యాంక్ నుంచి పొందిన రుణం మొత్తాన్ని రాష్ట్రంలో అరుకు కాఫీ సీఈవో వర్మకు లబ్ధిదారులు పంపించాలి. అనంతరం వర్మ పర్యవేక్షణలో పూర్తిస్థాయి అరకు కాఫీ పాయింట్‌ను అందంగా వారే సెట్ చేస్తారు. ఈ విషయమై వెలుగు ఏపీఎం సురేంద్ర మాట్లాడుతూ దాదాపుగా నెలాఖరు నాటికి కాఫీ పాయింట్ ఏర్పాటు పూర్తవుతుందన్నారు. పేద కుటుంబాలకు చెందిన డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్ధేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అరకు కాఫీ పాయింట్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న మహిళలకు అవకాశం కల్పిస్తోందన్నారు. ఇంకా ఆసక్తి గలిగినవారు డ్వాక్రా మహిళలు కాఫీ పాయింట్ల ఏర్పాటుకు వెలుగు కార్యాలయాన్ని సంప్రదించవచ్చునన్నారు.



నేడు సోమశిల నీటి విడుదల

అనంతసాగరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం సోమశిల జలాశయాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆయన జలహారతి ఇచ్చి క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీరు విడుదల చేయనున్నారని జలాశయం ఇంజనీర్లు తెలిపారు. కాగా సోమశిల జలాశయానికి శనివారం ఎగువ నుంచి 23,227 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుండగా, 73.130 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు వరద కాలువ ద్వారా 10,000, ఉత్తర కాలువకు 400, డెల్టాకు 2,350 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.



వైద్య వ్యర్థాలపై శ్రద్ధేది?



నెల్లూరులో రైల్వేట్రాక్ పక్కనే ఉన్న ఆసుపత్రి వ్యర్థాలు

- బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై నిర్లక్ష్యం
- పారిశుధ్యంలో కలిసి కొత్త రోగాలకు అవకాశం
- నిబంధనలు పాటించని ఎన్నో ఆసుపత్రులు
- వైద్యులను హెచ్చరిస్తున్నామన్న ఐఎంఏ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మానవ వ్యర్థాల(బయోమెడికల్ వేస్ట్) నిర్వహణపై అడగడుగునా నిర్లక్ష్యం తాండవిస్తోంది. నగరంలోని సూపర్‌స్పెషాలిటీ, స్పెషాలిటీ ఆసుపత్రుల్లో బయోమెడికల్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా జరుగుతున్నా, చిన్నచిన్న ఆసుపత్రులలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కొన్ని ఆసుపత్రుల నిర్లక్ష్యం కారణంగా వైద్య వ్యర్థాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. నిత్యం ప్రజలు తిరిగే ప్రాంతాల్లో ఈ వ్యర్థాలు ఉండడంతో పలు అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. జిల్లాలోని 1700లకుపైగా ఆసుపత్రులు ఉండగా, ఇందులో ఎక్కువ శాతం ఆసుపత్రుల్లో వాడిపడేసిన సిరంజీలు, మానవవ్యర్థాలపై నిర్లక్ష్యం కనిపిస్తున్నది. ఇక 1000కి పైగా ఉన్న ల్యాబ్‌ల్లో రక్త పరీక్షలకు వినియోగించే దూది, సిరంజీ వంటి వాటిని నిర్వీర్యం చేయకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. నెల్లూరు నగరంలోని పొగతోటలో ఉన్న పలుఆసుపత్రులు, ల్యాబ్‌లు ఆసుపత్రుల వ్యర్థాలను రోడ్ల పక్కనే వేయడం వల్ల రోగాలు సంక్రమిస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది ఆయా వ్యర్థాల తరలింపు కారణంగా అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.

వ్యర్థాల సేకరణ ఇలా..

- నర్సింగ్ సిబ్బంది వ్యర్థ పదార్థాల డబ్బా, కవర్లు 3/4వ వంతు నిండిన తరువాత గట్టిగా కట్టేటట్లు చర్యలు తీసుకోవాలి.
- వ్యర్థాలు ఉత్పత్తి అయ్యే ప్రదేశాల్లో ఎక్కువ వ్యర్థాలు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలి.
- డబ్బాలలోని వ్యర్థాలను పారవేసిన తరువాత తిరిగి అదే రంగు గల కవర్లను డబ్బాలకు అమర్చుకోవాలి.

నిర్వీర్యం ఇలా...

- శరీర సంబంధ వ్యర్థాలను జాగ్రత్తగా బూడిద చేసి నాశనం చేయాలి. లేదంటే రెండు మీటర్ల గోయి తవ్వి పూడ్చివేయాలి.
- ప్లాస్టిక్ వ్యర్థాలకు సంబంధించి వాటిని ముక్కలు చేసి సోడియం హైపోక్లోరైట్ ద్రావణంలో గంట సేపు ఉంచి ఆటోక్లేవ్‌లో నిర్వీర్యం చేయాలి.
- పదునైన వ్యర్థాలు, బ్లేడ్‌లు, సూదులు, సిరంజీలు, గాజులను సోడియం హైపోక్లోరైట్ ద్రావణంలో ఉంచి శుద్ధి చేసే యంత్రాలకు పంపాలి.
- పాదరస వ్యర్థాలను కొంత నీరు కలిగిన సీసాలో ఉంచాలి. చేతులతో తాకరాదు. అట్టముక్కల సాయంతో పాదరస బిందువులను సేకరించాలి.



ప్రతి ఆసుపత్రిలో ఉండాల్సిన డబ్బాలు

ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నాం..

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సమావేశ మందిరంలో నిర్వహించే వైద్యుల సదస్సులో ప్రత్యేకంగా బయోమెడికల్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా నిర్వహించాలని పదే పదే హెచ్చరిస్తున్నాం. ఎస్ఎస్ బయోమెడికల్ సంస్థ ద్వారా ఆయా ఆసుపత్రుల వ్యర్థాలను నిర్వీర్యం చేస్తున్నారు. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులకు చెబుతున్నాం. ఆసుపత్రి వ్యర్థాలను 48 గంటలలోపు నిర్వీర్యం చేయాలి. అలా నిర్వీర్యం చేయకపోతే పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.



- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ వైద్యులు

వ్యర్థాల నిర్వహణ ఎలా..?

మానవ వ్యర్థాల నిర్వహణలో ఎరుపు, పసుపు బులుగు రంగుల డబ్బాలు, పీపీసీ బిన్ వంటి కవర్లను వాడాలి. ఎరుపు డబ్బాలో వేసే మందపాటి ఎర్రకవర్‌లో డిస్పోజబుల్ సిరంజీలు, వీవీట్యూబ్స్, కెథెటర్స్, ఇతర ట్యూబ్‌లు, బ్లడ్‌బ్యాగ్స్ యూరిన్‌బ్యాగ్ వంటివి వేయాలి. పసుపురంగు డబ్బాకవర్‌లో కణజాలాలు, శరీర భాగాలు, ప్లసెంటా, ఎంబాస్టర్ పిండాలు, అంగాలు, నెత్తురు, చీము, డ్రస్సింగ్ వేస్ట్ వంటివి వేయాలి. బులుగు డబ్బా కవర్‌లో గాజు సీసాలు, పీపీపీ బిన్‌లోని కవర్‌లో బ్లేడ్‌లు, ఇంజక్షన్ మందు ఉండే పగిలిన వయల్స్, వెయిల్స్, రోగికి ఉపయోగించే పదునైన వస్తువులు వేయాలి. వీటి నిర్వహణ బాధ్యతను నర్సులు చేపట్టాలి. వీటిపై పర్యవేక్షణను అధికారులు చేపట్టాలి. పైగా ఎస్ఎస్ బయోకేర్ ద్వారా ఈ వ్యర్థాలను తరలిస్తుండటం వల్ల ఇక్కడకు వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.



కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టిన హిమాన్షు శుక్లా

కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా

- కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయన శ్రీమతి పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనకు తొలుత జేసీ కే. కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో విజయకుమార్ పుష్పగుచ్ఛం అందచేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు పూర్ణకుంభం స్వాగతం పలకగా వేద మంత్రోచ్ఛరణ మధ్య బాధ్యతలు స్వీకరించారు. సమాచార పౌరసంబంధాలశాఖలో డైరెక్టర్‌గా పనిచేస్తూ ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం



అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనిచ్చి పనిచేస్తానని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. బాధ్యతలు స్వీకరించాక తిక్కన భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు పేరుమీద ఏర్పాటైన జిల్లాకు కలెక్టర్‌గా రావటం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఎంతో మంది కలెక్టర్లు గొప్పగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. వారి స్ఫూర్తితో పనిచేసి అభివృద్ధిని కొనసాగిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరుల సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా గణనీయమైన పాత్ర పోషించాలని, ప్రభుత్వం చేసే మంచి పనులను అందరికీ తెలియ చేయాలన్నారు.

ఎస్పీగా అజిత


- జిల్లా పోలీసులకు తొలి మహిళా బాస్
- ఇంటర్ విద్య నెల్లూరులో...



నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా అజిత వేజండ్ల నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాకు తొలి మహిళ ఎస్పీగా ఆమెను నియమించారు. గుంటూరు జిల్లాకు చెందిన అజిత తల్లిదండ్రులు బ్యాంకు ఉద్యోగులు. ఆమె హైదరాబాద్‌లోని సెయింటాన్స్‌లో ప్రాథమిక స్థాయి నుంచి పదోతరగతి వరకు చదువుకున్నారు. నెల్లూరు నారాయణ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి, మద్రాస్ ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం స్కాలర్‌షిప్‌తో యూఎస్‌లో ఎంఎస్ ఫైనాన్స్ కోర్సు పూర్తి చేసి అక్కడే ఫైనాన్స్ విభాగాల్లో బాధ్యతలు నిర్వహించారు. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో తిరిగి స్వదేశానికి వచ్చారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎకనమిక్స్‌లో పీహెచ్‌డీ చేస్తూనే సివిల్స్‌లో విజయం సాధించారు. 2015 బ్యాచ్‌కి చెందిన అజిత తొలుత అనంతపురం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేశారు. తదుపరి విశాఖపట్నంలో సెబ్ ఏఎస్పీగా, ప్రస్తుతం విశాఖపట్నం డీసీపీగా పనిచేస్తూ బదిలీపై జిల్లా ఎస్పీగా రానున్నారు.

ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు బదిలీ

- ఆయన స్థానంలో నంద్యాల పీడీ సత్యనారాయణ



శ్రీనివాసులు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటిపారుదల ప్రాజెక్టు(ఏపీఎంఐపీ) జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు బీ.శ్రీనివాసులు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ రానున్నారు. జిల్లాలో దాదాపు రెండేళ్లుగా ఏపీఎం శ్రీనివాసులు విధులు నిర్వహిస్తూనే, పలు శాఖలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. డ్వామా పీడీగా, సోషల్ వెల్ఫేర్ డీడీగా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఏపీఎంఐపీ పీడీతోపాటుగా జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

రాజీయే రాజమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి
- జిల్లా వ్యాప్తంగా 8920 కేసుల పరిష్కారం

నెల్లూరు (లీగల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏ కేసులోనైనా ఇరువర్గాలు సుహృద్భావ వాతావరణంలో రాజీ చేసుకుంటే, అది రాజమార్గం వంటిదని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ అన్నారు. శనివారం నెల్లూరు నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి ఈ లోక్ అదాలత్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీకి యోగ్యమైన సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాలు, లేబర్‌కోర్టు కేసులు, బ్యాంకు కేసులు, నెల్లూరు మున్సిపాలిటీకి సంబంధించిన కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమవుతాయని తెలిపారు. ఆయన జిల్లా కోర్టు ప్రాంగణమంతా తిరుగుతూ కేసుల పరిష్కారానికి కృషి చేశారు. నెల్లూరు మున్సిపాలిటీకి సంబంధించి వివిధ కేసుల్లో పరిహారం కింద రూ.1,11,96,783 చెల్లించేలా రాజీ కుదిర్చారు. అలాగే విద్యుత్‌శాఖకు సంబంధించి రూ.33,69,500, జిల్లా పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.1,65,76,000లు పరిహారం కింద వచ్చేలా కేసులు పరిష్కరించారు. కాగా జిల్లా వ్యాప్తంగా అన్నీ కేసులకు సంబంధించి రూ.7,86,44,647లు పరిహారం కింద చెల్లించేలా పలు కేసులను పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8920 కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఒకటవ, మూడవ, నాలుగవ, ఆరవ, 8వ అదనపు జిల్లా జడ్జీలు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే.వాణి, నెల్లూరు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వేలూరు రంగారావు, విద్యుత్ సీఏ. ఇల్లూరి అంజనేయరెడ్డి, డీపీవో శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్



నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ దాష్టీకం

- విద్యార్థిని చితకబాదడంతో తలకు తీవ్రగాయాలు

మర్రిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలోని విద్యార్థులు కొంతకాలంగా నరక యాతన అనుభవిస్తున్నారు. తల్లిదండ్రులకు కూడా చెప్పుకోలేక, మనసులో దాచుకోలేక, వేదనను భరించలేక నలిగిపోతున్నారు. ఈ పరిస్థితికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పెత్తనస్వామి కర్కశత్వమే కారణం. బాధిత విద్యార్థి పలకాయల మహేష్‌బాబు కథన మేరకు వివరాలు... శనివారం రాత్రి భోజన సమయంలో గమనించుకోకుండా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కి ఎదురుగా తోటి విద్యార్థులతో కలిసి మహేష్‌బాబు వేగంగా వెళ్లాడు. నేనంటే కొంచం కూడా భయం లేదా..? అంటూ వారందరినీ ఇంగ్లిష్‌లో దుర్భాషలాడాడు. భోజనం అనంతరం వారు స్టడీకి కూర్చున సమయంలో టాయిలెట్‌కు అంటూ మహేష్‌బాబు వెళ్లాడు. ఆ విద్యార్థి వెనకాలే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెళ్లి బాత్‌రూమ్ డోరు వేసి విద్యార్థి తలను గోడకు వేసి కొట్టాడు. ఇంకా చిత్రహింసలు పెట్టడంతో ఆ విద్యార్థి తలకు బలమైన గాయం అయింది. రక్తం కారుకుంటూ ఏడుస్తున్న విద్యార్థిని ఆ బాత్‌రూమ్ లోనే ఉంచి సుమారు 20నుంచి 30నిమిషాలపాటు గడిపెట్టాడు. ఆ విద్యార్థి అరుపులు విని ఓ ఉపాధ్యాయుడు వచ్చి గడియ తీయబోయాడు. అంతలో పెత్తనస్వామి ఆ ఉపాధ్యాయుడిపై కూడా కేకలు వేస్తూ 'నాట్ ఓపెన్ ద డోర్.. ఐయామ్ ఓపెన్ టుమారో మార్నింగ్... అంటూ అరిచాడు. చివరకు స్కూలులోని ఉపాధ్యాయులంతా అక్కడికి చేరుకొని తలుపు తీసి కారులో ఆ విద్యార్థిని మర్రిపాడు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొనివచ్చారు. డాక్టర్ గోపీనాథ్ ఆ విద్యార్థి తలకు కుట్లు వేసి చికిత్స చేశారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పీఆర్ ఎస్ఈ కోటేశ్వరరావు

ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదం

- పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ కోటేశ్వరరావు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదం చేస్తాయని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వై.కోటేశ్వరరావు తెలిపారు. ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం, డిప్లమో ఇంజనీర్ల సంఘం సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఆటల్లో ప్రతిభ చూపాలన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఒత్తిడిని అధిగమించి, ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పనిచేయాలని తెలిపారు. అనంతరం క్రికెట్‌ను ఆడి, పోటీలను లాంఛనం గా ప్రారంభించారు. క్రికెట్‌తోపాటు షటిల్, వాలీబాల్, క్యారమ్, చెస్, రింగ్‌బాల్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 15న జడ్పీలో ఇంజనీర్స్‌డేలో బహుమతులు అందచేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు బీ.సత్యనారాయణరెడ్డి, కేజేఎస్.చంద్రారెడ్డి, బీ.సుబ్బరాజు, బీ.రమణయ్య, సీ.సుమన, పీఆర్ డిప్లమో ఇంజనీర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్‌కే.రియాజ్ అహ్మద్, పీఆర్ ఇంజనీర్ల సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా..

- నేనున్నానంటూ విశ్రాంత ఉద్యోగి భరోసా
- భారత్ సేవా ఫౌండేషన్ స్థాపన
- అన్న క్యాంటీన్‌కు నెలనెలా విరాళం
- జాఘువా గ్రంథాలయ నిర్మాణానికి పోరాటం

కొంతమంది సంపాదనే ధ్యేయంగా పనిచేస్తుంటారు... అలాంటివారు ఎంత సంపాదించినా తృప్తి లేకుండా బతుకుతుంటారు... అయితే మరికొంత మంది తమకు ఉన్నంతలో ఇతరులకు దానం చేస్తూ చరిత్రలో నిలిచిపోతుంటారు... ఈ కోవకు చెందిన వారే నెల్లూరు నగరంలోని సావిత్రీ నగర్‌కి చెందిన విశ్రాంత సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఖాసీం. ఉద్యోగం చేస్తూనే సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారాయన. ఉద్యోగ విరమణ తరువాత కూడా వాటిని కొనసాగిస్తున్నారు.

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) షేక్ ఖాసీం 1974లో సాంఘిక సంక్షేమశాఖలో అధికారిగా ఉద్యోగంలో చేరారు. 2005లో ఏఎస్‌డబ్ల్యూవోగా ప్రకాశం జిల్లా అద్దంకిలో పదవీ విరమణ చేశారు. నెల్లూరులో పనిచేసేటప్పుడు పదోతరగతి ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులకు సొంత నిధులతో ట్యూటర్‌ను ఏర్పాటు చేశారు. వారిలో సామాజిక చైతన్యం తెచ్చేందుకు అంబేద్కర్ జయంతి రోజున వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, నృత్య, పాటలు పోటీలు నిర్వహిస్తూ బహుమతులు అందచేసేవారు. హాస్టళ్ల శుభ్రతకు సొంత నిధులు ఖర్చు చేశారు. ఆయన సేవలను మెచ్చుకున్న అప్పటి కలెక్టర్లు సుజాతరావు, టీ. గోపాల్‌రావు, కే రాజు, ప్రకాశం కలెక్టర్ ఉదయలక్ష్మి తదితరులు ఆయనకు ఉత్తమ అధికారిగా అవార్డులు అందచేశారు.

నెలనెలా విరాళం



అన్నక్యాంటీన్ స్థాపన నుంచి ప్రతినెలా తన పెన్షన్ నుంచి రూ.5వేల విరాళం అంచేస్తున్నారు. ఇప్పటివరకు రూ.70వేలు అందచేశారు. దీంతో సీఎం చంద్రబాబు, ఐటీశాఖామంత్రి నారాలోకేష్ ఆయనను ప్రశంసిస్తూ లేఖలు పంపారు. అంతేకాక ఆయన ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉంటూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. పెన్షనర్ల భవన నిర్మాణానికి రూ. 80వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రజాసేవ కోసం భారత సేవా ఫౌండేషన్‌ను స్థాపించారు. ఆర్డీవో కార్యాలయానికి సోమవారం వచ్చే అర్జీదారులకు అన్న సంతర్పణ చేస్తున్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విశ్రాంత లెక్చరర్ కాటూరు కుసుమకుమారితో కలిసి పోరాటాలు చేస్తున్నారు. గుడ్డ సంచులనే వాడాలని సూచిస్తూ వందలాది మందికి ఉచితంగా వాటిని పంచి పెడుతున్నారు. భారత సేవా ఫౌండేషన్ ద్వారా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛభారత్ నినాదంతో పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. రూ. 60 వేల సొంత నిధులు వెచ్చించి పాఠశాలలు, నగరంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటించి, వాటి సంరక్షణ చూస్తున్నారు. ప్రగతి చారిటీస్‌లోని అనాథలకు నిత్యావసర సరకులు అందించారు. ప్రజలకు ఓటు విలువలను తెలయచేస్తూ వారు హక్కును వినియోగించుకునేలా చేస్తున్నారు. ప్రజల్లో అక్షరాస్యతశాతం పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి..

నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలో గుర్రం జాఘువా గ్రంథాలయ నిర్మాణం అర్థంతరంగా ఆగింది. దాని నిర్మాణానికి రూ.2.50 లక్షల సొంత నిధులను అందచేశారు. నిర్మాణం తరువాత, కంప్యూటర్లు ఇతర పరికరాలు సమకూర్చి నిరుద్యోగుకు ఉపయోగపడేలా శిక్షణ ఇప్పిస్తున్నారు. పీ-4 విధానంలో గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. జాఘువా గ్రంథాలయం ఉండే వీధికి గుర్రం జాఘువా వీధిగా నామకరణం చేయాలని పోరాడారు. కౌన్సిల్‌లో అందుకు ఆమోదం లభించింది. దీంతో నామకరణ జరిగింది. ఆయన సేవలను గుర్తించిన దయాడాట్ ఫౌండేషన్ విశిష్ట సామాజిక సేవా అవార్డు-2025ను ప్రకటించింది. వయసు పైబడుతున్నా ఏ మాత్రం వెనుకడుగు వేయక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరిగినన్ని రోజులు ప్రజా సేవకే అంకితమవుతానని

Sunday SPECIAL



మహిళకు గుడ్డ సంచులు అందచేస్తున్న ఖాసీం తదితరులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	148
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	286

కోడిగుడ్ల ధర (100): 550

రోడ్డు పక్కన పేరుకుపోతున్న చెత్త

వలేటివారిపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని లింగసముద్రం రోడ్డు పక్కనే చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంతంలో ఉండే ప్రజలు, అంగన్‌వాడీ చిన్నారులు, అటు వైపు వెళ్లే వాహనదారులు, పాదచారులు దుర్వాసన భరించలేకపోతున్నారు. అయినప్పటికీ చెత్త తొలగించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, తమ ఆరోగ్యాలను కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



న్యూస్ బాక్స్

జమునకు 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అవార్డు



పురస్కారం అందుకుంటున్న జమున

కావలి, (టౌన్) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) ఆర్ట్ ఆఫ్ లర్నింగ్ సంస్థ హైద్రాబాద్‌లో శనివారం 'తెలుగు కీర్తి కిరీటాలు' అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని మొగిలిశెట్టి జమునకు కళా రంగంలో 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అవార్డును ప్రదానం చేశారు. యువత సాహిత్య, కళా రంగాల్లో రాణించాలని, కళా రంగానికి పూర్వ వైభవం తేవడానికి కృషి చేయాలని జమున పేర్కొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి



మాట్లాడుతున్న వీరాల శ్రీనివాసులు యాదవ్

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా నేతలు సీవీసీ సత్యం, నూకసాని శ్రీనివాసులు యాదవ్, మామిడి వేంకటేశ్వర్లు హాజరయ్యారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలోకి తీసుకుపోవాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖ మంత్రి సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు గోపికృష్ణయాదవ్, జీ వేంకటేశ్వర్లు, ఏకే మైఖేల్‌రాజ్, పీ సూర్యం, ఆర్ కిశోర్, గోవిందరాజులు, సుధాకర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీవై సమావేశానికి 100 మందికే అనుమతి

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరేడు రైతులకు సంఘీభావంగా ఆదివారం బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ కరేడులో నిర్వహించే సమావేశాన్ని కోర్టు ఉత్తర్వులకు లోబడి మాత్రమే జరుపుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు మాత్రమే ఆయనకు కరేడులో ఉండేందుకు అనుమతి ఉందని, అలాగే కరేడుకు చెందిన రైతులు 100 మందికి మించకుండా ఆయన సమావేశం జరుపుకోవాల్సి ఉంటుందన్నారు. బయటి గ్రామాలవారెవ్వరూ ఈ సమావేశంలో పాల్గొనేందుకు కోర్టు అనుమతించలేదని, అతిక్రమించి బయటి వ్యక్తులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కందుకూరు సీఐ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిలకపాటి

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కందుకూరు పట్టణానికి చెందిన టీడీపీ నేత చిలకపాటి మధుబాబు నియమితులయ్యారు. మధుబాబుకు డైరెక్టర్ పదవి రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

నేత్రదానం



లలిత నేత్రాలను సేకరిస్తున్న వైద్యులు సునీల్

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈఎన్‌టీ వైద్యుడు డాక్టరు పూర్ణచంద్రరావు సతీమణి లలిత అనారోగ్యంతో శనివారం మృతిచెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నెల్లూరు ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల కార్నియా నిపుణులు సునీల్ ఆమె నేత్రాలను సేకరించారు. ఈసందర్భంగా సక్షమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చన్నా వెంకటరామాంజనేయులు మాట్లాడుతూ నేత్రదానం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి అంధత్వ నిర్మూలనకు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు.



రోడ్డు మధ్యన దెబ్బతిన్న తూములు చుట్టూ నిల్వ చేరిన మురుగునీరు

ఈ తూములు దాటేదెలా?

● గ్రావెల్ కొట్టుకుపోయి ధ్వంసమైన తూములు ● బాలకృష్ణారెడ్డినగర్ వాసులకు తప్పని కష్టాలు ● పట్టించుకోని అధికారులు, పాలకులు

కావలిరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం బాలకృష్ణారెడ్డినగర్‌లో రోడ్డు మధ్యన మురుగు నీరు ప్రవహించేందుకు ఏర్పాటు చేసిన సిమెంటు తూములపై గ్రావెల్ కొట్టుకుపోయి తూములు ధ్వంసమయ్యాయి. తూములకు రెండు వైపుల మట్టి లేకపోవడం, పైపులు అడ్డదిడ్డంగా ఉండడంతో వాహనాలు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో మురుగునీరు మొత్తం అక్కడే నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతూ పందులకు నిలయంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో కార్లు, అంబులెన్సులు, ఆటోలు, ఇతర వాహనాలు ఆ ప్రాంతానికి వచ్చే అవకాశం లేదు. దీంతో నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాలకృష్ణారెడ్డి నగర్ వాసులు ఈ విషయాన్ని అనేకమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రెండు తూములు వేసి ట్రిక్ మట్టి తోలిస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు అంటున్నారు. ఎంత మొరపెట్టుకున్నా ఈ చిన్నపాటి పనులు కూడా చెయ్యడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ఈ సమస్యను పరిష్కారించి ప్రజల కష్టాలు తీర్చాలని ఆ ప్రాంత వాసులు కోరు తున్నారు.



డ్రాపౌట్స్ తగ్గించేందుకు కృషి

● కే.రవికుమార్, ఎంఈవో.

ముఖాముఖి

కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు 66 ఉన్నాయి. 70 మంది డ్రాపౌట్స్‌ను గుర్తించాం. 37 మందిని వివిధ పాఠశాలల్లో చేర్పించాం. 33 మంది పిల్లల తలిదండ్రులు జీవనోపాధికి దూర ప్రాంతాలకు వెళ్లారు. వీరందరినీ గుర్తించి అక్కడే ఉన్న పాఠశాలల్లో చేర్పించి డ్రాపౌట్స్ సంఖ్యను తగ్గించేందుకు కృషి చేస్తున్నానని కొండాపురం ఎంఈవో కే.రవికుమార్ తెలిపారు.

? మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.

! మండలంలో 52 ప్రాథమిక, 9 జడ్పీ ఉన్నత, ఒక ఆదర్శ, ఒక కేజీబీవీ, మూడు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది మూడు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదుకాకపోవడంతో మూసివేశాం. అన్ని పాఠశాలల్లో 3,500 మంది విద్యార్థులు ఉన్నారు.

? విద్యార్థులకు ఎస్ఆర్‌కే కిట్లు పూర్తిస్థాయిలో అందాయా.

! 47 మంది విద్యార్థుల తల్లిదండ్రుల ఆధార్‌కు ఫోన్ నెంబరు లింకుకాకపోవడం బయోమెట్రిక్ పూర్తికాలేదు. వారికి తప్ప మిగిలిన విద్యార్థులందరికీ ఎస్ఆర్‌కే కిట్లు అందాయి.

? మనబడి- మన భవిష్యత్తు పనులు జరుగుతున్నాయా.

! మనబడి- మన భవిష్యత్తు పథకం కింది 24 పాఠశాలలు ఎంపికయ్యాయి. అందులో 15 పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్లు తదితర పది రకాల పనులకు నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చాక పనులు మొదలు పెడుతాం.

? ఉపాధ్యాయుల కొరత ఉందా. దానిని ఎలా అధిగమిస్తున్నారు.

! మండలంలో 33 మంది ఎస్‌జీటీ, 7 ఫిజికల్ డైరెక్టర్లు, ఉన్నత పాఠశాలల్లో సుమారు 15 మంది వరకు స్కూల్ అసిస్టెంట్ల కొరత ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొరత ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాము.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కావలి(టౌన్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు.

లోక్ అదాలత్‌లో ఇరుపక్షాలకు సత్వర న్యాయం



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్‌పర్సన్ గీతావాణి

కావలి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఇరుపక్షాలకు సత్వరన్యాయం జరుగుతుందని కావలి సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఏ గీతావాణి పేర్కొన్నారు. కావలి పట్టణ సబ్ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ చైర్మన్ గీతావాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ సుధాకర్‌రావు, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి, కార్యదర్శి రుషి, లోక్ అదాలత్ బెంచ్ న్యాయవాదులు డీ శ్రీదేవి, ఐ సాయి ప్రసాద్‌లు వివిధ రకాల 111 కేసులతో పాటు సుమారు రూ. 43,34,500 నగదు వ్యాజ్యాలు పరిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ గీతావాణి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాలు రాజీ మార్గం ద్వారా సత్వర న్యాయం పొందాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవటం ద్వారా అప్పీలు లేని అంతిమ తీర్పు వస్తుందని, కక్షిదారులు లోక్ అదాలత్ సేవలు వినియోగించుకుని ప్రశాంతంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృదుల, న్యాయవాదులు, కక్షిదారులు, వివిధ బ్యాంకుల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో జనసేనను బలోపేతం చేయాలి

● టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్



జన సేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తదితరులు

కొండాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేమలపాటి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శనివారం పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. మారుమూల ప్రాంతంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం శుభపరిణామమన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సూచనలతో అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా పార్టీలోని వర్గ విభేదాలతో ఇటీవల జనసేన మండలాధ్యక్షుడు ఒక పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించగా, మరొక కార్యాలయాన్ని ఉపాధ్యక్షుడు ప్రారంభించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకుడు భోగినేని కాశీరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు కాకుటూరు రాఘవేంద్రరావు, మండలనాయకుడు తిప్పినేని రమేష్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కావలి (టౌన్)సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ విట్స్ ఇంజనీరింగ్ కళాశాల టెన్నిస్ క్రీడా ప్రాంగణంలో శనివారం ఉమ్మడి నెల్లూరు జిల్లాస్థాయి పులివర్తి రాఘవ నాయుడు మెమోరియల్ టెన్నిస్ (డబుల్) టోర్నమెంట్ ప్రారంభమైంది. జేబీ విశ్రాంత అధ్యాపకుడు భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు ప్రారంభించారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 70 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, తొలిరోజు పోటీల్లో విజేతలు సెమీఫైనల్స్‌లో ప్రవేశించారు. ఆదివారంతో టోర్నమెంట్ ముగుస్తుందని జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

సంస్కారహీనంగా మాట్లాడితే సహించం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ అర్థరహితంగా, సంస్కారహీనంగా మాట్లాడితే సహించేది లేదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో మీరు చేసిన నిర్వాకాల గురించి చెప్పాలంటే నాకు సంస్కారం అడ్డువస్తున్నదన్నారు. వైసీపీ రైతు పోరుబాట పేరుతో రైతులను వంచించటం సరి కాదని, నాడు జగన్ వరి రైతులకు ఇవ్వాల్సిన రూ. 1600 కోట్లు ఎగనామం పెట్టారని విమర్శించారు. యూరియా కొరత అనేది వైసీపీ అభూత కల్పనే తప్ప నిజం కాదని నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం, కంద్రా మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, తల్లపనేని రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

కందుకూరు నియోజకవర్గంలోని 53మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 31 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు.

లోక్ అదాలత్‌లో 95 కేసుల పరిష్కారం



ఇరుపక్షాలతో మాట్లాడి కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభ

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 95 కేసులు పరిష్కరించినట్లు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్‌నాయుడు తెలిపారు. సీనియర్ సివిల్‌జడ్జి ఎం శోభ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వి వెంకటేశ్వరరావు, అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌లతో మూడు బెంచ్‌లు ఏర్పాటుచేసి ఇరువర్గాల మధ్య రాజీమార్గంలో కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ కక్షిదారులు సులువైన మార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమని, రాజీపడదగిన కేసులన్నీ పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీపీ బెజవాడ కృష్ణయ్యచౌదరి, న్యాయవాదులు సాంబశివరావు, సీహెచ్ హరికృష్ణ, మస్తాన్‌వలి, మామిళ్లపల్లి మలికార్జున, షంషుద్దీన్, కేవీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వాన కురిస్తే దుర్గంధమే...!

● ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ



ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కలిగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చిన్నపాటి వర్షం పడితే చాలు .. ప్రధాన రహదారిపై పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉం టోంది. దీంతో ప్రజలు, దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కలిగిరమ్మ గుడి సెంటర్, ఆర్టీసీ బస్టాండు, హెచ్‌పీ పెట్రోల్ బంకు తదితర ప్రాంతాల్లో వర్షపునీరు వారం రోజులపాటు నిల్వ ఉంటోంది. మురుగుగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ప్ర దేశాలు వ్యాపారకేంద్రాలు కావడంతో నిత్యం రద్దీగా ఉంటాయి. ప్రధార రహదారిపై పడిన వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. కలిగిరి పట్టణంగుండా వెళ్ళే రహదారి జాతీయ రహదారిగా మారిందని పంచాయతీ పాలకులు, అధికారులు రోడ్డుపై నీటిని తొలగించడం లేదు. కాంట్రాక్టర్లు పట్టణంలో రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తుండంతో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారిపైన, పల్లపు ప్రాంతాలవద్ద వర్షపు నీరు నిలవకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



పాడి రైతులకు నగదు అందచేస్తున్న సంగం మేనేజర్ వినోద్

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సంగం డెయిరీ పనిచేస్తుందని జిల్లా జోనల్ మేనేజర్ డాక్టర్ వినోద్ అన్నారు. బోగోలు మండలం ఎస్వీపాలెం పంచాయతీ సిద్దనపాలెంలో మద్దూరుపాడు కావలి పాల సేకరణ కేంద్రం 2024-25 సంవత్సరానికిగాను శనివారం పాడి రైతులకు బోనస్ నగదు పంపిణీ చేశారు. దాదాపు 68 మంది పాడి రైతులకు 2 లక్షల 75 వేల 721 రూపాయల నగదును బోనస్‌గా అందచేశారు. ఈ సందర్భంగా సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు నియోజకవర్గ శాసన సభ్యుడు ధూళిపాల నరేంద్రకుమార్ పాడి రైతుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. మద్దూరుపాడు కావలి బీఎంసీ ఇన్‌చార్జి శ్రీనివాసులు మాట్లాడుతు సంగం డెయిరీ పాడి రైతులకు రాయితీపై దాణా, వరి, గడ్డి విత్తనాలు అందచేయడంతో పాటు పశు బీమా సదుపాయం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సూపర్‌వైజర్ వెంకయ్య, పాల సేకరణ కార్యదర్శి పీ శీనయ్య, పాడి రైతులు ఉన్నారు.

కర్మ క్రతువులకు నీళ్లు లేవు...

● శ్మశానంలో చేతి పంపునకు మరమ్మతులు చేయరూ..

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని శ్మశానవాటికలో చేతి పంపు మరమత్తులకు గురి కావడంతో శనివారం కర్మక్రతువులు చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాదవపాలెంకు చెందిన చిట్టిబోయిన రమణమ్మ (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించేందు శ్మశానవాటికకు తీసుకెళ్లగా, అక్కడి చేతి పంపు పనిచేయలేదు. దీంతో క్యాన్లతో నీళ్లు మోసుకొచ్చి కార్యక్రమం నిర్వహించుకున్నారు. చేతి పంపు మరమత్తులకు గురై ఐదు నెలలు కావస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ నేత దేవరాల తిరుపతి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

వానకు నేలకొరిగిన వరి.. రైతు కంట కన్నీరు



సీఎల్ పురంలో నేలకొరిగిన వరి పైరు

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో అల్పపీడన ప్రభావంతో పలు చోట్ల కోతకు వచ్చిన వరి పైరు నేలకొరిగింది. మొదటి కారు కన్నా దిగుబడి బాగా వచ్చిందని ఆనందంలో ఉన్న రైతన్నలకు శనివారం కురిసిన వర్షం శాపంగా మారింది. చెంచులక్ష్మీపురం, తదితర ప్రాంతాల్లో వరి భారీ వర్షానికి నేలకొరిగింది. చేతికి వచ్చిన పంట నేలపాలవుతుండటంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో మండలంలో దాదాపు 4 వేల ఎకరాలకు పైగా రెండో క్రాప్ వరి సాగు చేశారు. అందులో నాలుగు వందల ఎకరాల లోపు మాత్రమే వరి కోత జరిగింది. మగిలిన 3600 ఎకరాల్లో మరో 15 రోజుల్లో కోతలు పూర్తి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతలు ప్రారంభమై వారం రోజులవుతున్నా మండలంలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

చెక్కా కేశవ, రవ్వా శ్రీనివాసులుకు ప్రజా సేవారత్న పురస్కారాలు

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ద్వా రా కందుకూరు పటణంలో నిరుపేదల కోసం సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న రవ్వా శ్రీనివాసులు, చెక్కా వెంకటకేశవరావులకు శ్రీసాయి ప్రజాసేవారత్న పురస్కారాలు దక్కాయి. చిలకలూరిపేటలోని మెడికల్ హాలులో శనివారం జయజయ సాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు.

వర్షాలు లేక అడుగంటిన భూగర్భ జలాలు



చుక్క నీరు లేక ఎండిపోయిన మన్నేరు

లింగసముద్రం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ఎగువ భాగాన, అలాగే ప్రాజెక్టు దిగువ భాగాన ఉన్న మన్నేరు పరీవాహక ప్రాంతంతో చాలా కాలం నుండి వర్షాలు కురవక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో మన్నేరు పరీవాహక ప్రాంతంలోని రాళ్లపాడు, బీమలపెంట, తూనుగుంట, అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, అంగిరేకులపాడు గ్రామాల సమీపంలో మన్నేరుకు ఇరువైపులా పొలాల్లో పత్తి పైరు, జొన్నమేత సాగు చేసిన రైతులు, మన్నేరులోని బోర్లకు నీరందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పశువులకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నట్టు పశు పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో వర్షాలు కురవకపోతే నీటి కోసం ఇబ్బందులు పడక తప్పదని ప్రజలు వాపోతున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 22 నుంచి జరిగే దేవీనవరాత్రి ఉత్సవాల కరపత్రాలను శనివారం రాత్రి దేవస్థానం కమిటీ ఆవిష్కరించింది. కార్యక్రమంలో కోటగురుబ్రహ్మం, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం పెంచలస్వామి కల్యాణం



రాపూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో శనివారం శ్రీవారి కల్యాణం కమనీయంగా జరిగింది. పెంచల నరసింహ స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, అమృతాభిషేకాల అనంతరం చందనాలంకారం చేశారు. నిజరూప దర్శనంతో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఊంజల్ సేవ, తిరుచ్చి ఉత్సవం, క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదాల తోపాటు, అన్నప్రసాదం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

చెట్ల కిందే సమావేశాలు

● మీటింగు హాలు లేక వైద్యుల ఇక్కట్లు

లింగసముద్రం, సెప్టెంబరు 13: (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగసముద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మీటింగు హాలు లేక వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వారంలో మూడు నాలుగు సార్లు పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి, ఆశాలకు పలు అంశాలపై సమావేశాలు నిర్వహిస్తుంటారు. అంతేగాక ప్రభుత్వం చెప్పే సర్వేల గురించి, ఇతర విషయాలపై ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు వివరించాలంటే వైద్యశాల ఆవరణలోని చెట్ల కింద మాత్రమే సమావేశాలు నిర్వహించి వైద్యులు వివరిస్తుంటారు. కానీ వైద్యశాల లోపల ఎలాంటి సమావేశాలు నిర్వహించాలన్నా సిబ్బందికి స్థలం చాలదు. దీంతో వైద్యశాల ఆవరణలోని చెట్ల కింద మాత్రమే సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో వైద్యులు, సిబ్బంది, ఆశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలో ఎమ్మెల్యే ఇంటూరికి వినతి : డా.రమేష్

కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల పీహెచ్‌సీల వద్ద సమావేశపు హాళ్లు ఉండగా లింగసముద్రం పీహెచ్‌సీ ఆవరణలో మాత్రం లేదు. దీంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్టు వైద్యాధికారి డా.పి రమేష్ చెప్పారు. ఇక్కడ సమావేశపు హాలు నిర్మించేందుకు తగిన చర్యలు చేపట్టాలని తాను, తమ వైద్యులు, సీహెచ్‌ఓ, సిబ్బంది త్వరలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్టు డా.రమేష్ చెప్పారు.



లింగసముద్రం పీహెచ్‌సీ ఆవరణలో శనివారం చినుకుల మధ్య చెట్ల కింద సమావేశం నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

మాలకొండ ఆదాయం రూ. 9,35,692

వలేటివారిపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 9,35,692 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 5,950, కుంకుమార్చన ద్వారా రూ. 19,400, వివాహముల ద్వారా రూ. 1,000, తలనీలాలు ద్వారా రూ. 40,500, వాహనపూజలు ద్వారా రూ. 2,820, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,55,400, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 820, రూముఅద్దెలు ద్వారా రూ. 32,780, కవర్లు ద్వారా రూ. 9 వేలు, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,13,460, అన్నదానం ద్వారా రూ. 2,29,446, విరాళముల ద్వారా రూ. 25,116 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తెలియజేశారు.

ప్రకృతి సాగు

● సొంతంగా ఎరువుల తయారీకి శ్రీకారం
● పంటల్లో మెరుగైన దిగుబడులు
● ఆసక్తి చూపుతున్న రైతులు

పంటల సాగులో అధిక పెట్టుబడులు పెట్టి రసాయన ఎరువులు వినియోగించినా, ఆశించిన మేర ఫలితాలు రావడంలేదు. దీంతో విసుగెత్తిన రైతులు వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. నేల స్వభావాన్ని బట్టి తక్కువ ఖర్చుతో నివాసాల వద్దే సొంతంగా ఎరువులు తయారు చేసి పంటలకు వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడుల భారం తగ్గడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాల ద్వారా రైతులు జీవన ఎరువుల తయారీపై ఆసక్తి చూపుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ఎరువుల సంచులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



రసాయనాలను ప్రదర్శిస్తున్న అధికారులు

● వినియోగం ఇలా...

జీవామృతం: పండ్ల తోటల్లో పిచికారీ చేయడంతో పాటు నీటిలో కలిపి చెట్లకు అందించాలి. దీంతో చీడ, పీడలను నివారించి అధిక దిగుబడులు సాధించవచ్చు.

ఘనజీవామృతం: ఎలాంటి రసాయన ఎరువులను వినియోగించకుండా ఎకరాకు 400 కేజీల ఘనజీవామృతం వేసి ఏడాది పాటు పచ్చని పంటలతో కప్పి ఉంచాలి. దీంతో భూమిలో కార్బన్ శాతం పెరిగి కలుపు నిర్మూలన జరుగుతుంది.

వేప గింజల ద్రావణం: ఈ ద్రావణాన్ని పిచికారీ చేయడంతో తెగుళ్లను వ్యాపింపచేసే పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. ప్రతి పంటలో వినియోగించడం వలన రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది.

బ్రహ్మాస్త్రం: దీన్ని వేప, కానుగ, ఆముదం, నేరేడు, సీతాఫలం వంటి ఐదు రకాల ఆకులతో తయారు చేస్తారు. దీన్ని వినియోగించడంతో పంటను నాశనం చేసే పెద్ద పెద్ద పురుగులను సైతం పూర్తి స్థాయిలో నియంత్రించే అవకాశం ఉంది.

అందుబాటులో విత్తనాలు: వీటితోపాటు పంటకు బలాన్ని చేకూర్చే జనుము, జీలగలు వంటి 25 నుంచి 30 రకాల వరకు సారవంతమైన విత్తనాల కిట్లను తయారు చేసి రైతులకు అందజేస్తున్నారు. దీంతో భూమిలో బయోమాస్ నిల్వ ఉండి పంటల సాగులో సమృద్ధిగా పోషకాలను అందించి నాణ్యమైన దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. అంతేగాక ఆసక్తి ఉన్న రైతులకు ప్రోత్సాహం అందించి, వారికి తయారీలో మెలకువలు నేర్పిస్తున్నారు.

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపు రం, మర్రిపాడు మండలాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు, ఇతర ద్రావణాలు తయారు చేస్తున్నారు. అనంత రం వాటిని బయటి మార్కెట్లో లభించే రసాయన ఎరువుల కంటే తక్కు వ ధరకే రైతులకు విక్రయిస్తున్నారు. తొలిసారిగా ఉదయగిరి మండలంలోని గండిపాళెంలో ప్రయోగాత్మక ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మంచి ఫలితాలు సాధించారు. దీంతో ఇతర గ్రామాల రైతులు కూడా అలా తయారు చేసిన ఎరువుల వినియోగంపై మొగ్గు చూపుతున్నారు. ఈ కేంద్రంలో కోడిగుడ్డు, నిమ్మ రసం కలిపిన మిశ్రమ ద్రావణంతో సహా బెల్లం ద్రావణం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, జీవామృతం, ఘన జీవామృతం, నేచరల్ పొటాష్, మూత్రం కలిపిన ఇంగువ ద్రావణం తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

ఆసక్తి పెరుగుతుంది..



ప్రకృతి వ్యవసాయంపై రోజు రోజుకు రైతుల్లో ఆసక్తి పెరుగుతుంది.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో అన్ని మండలాల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. వీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది.

- కే రామమోహన్‌రావు, డివిజన్ సలహదారుడు

ఏపీఐఐసీ డైరెక్టరుగా కంచర్ల మాధవి



ఆత్మకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మరో మూడు కార్పొరేషన్లకు 33 మందిని డైరెక్టర్లుగా నియామకం చేపడుతూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అందులో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా ఆత్మకూరు మండలం నారంపేటకు చెందిన కంచర్ల మాధవి నియమితులయ్యారు. ఆమె ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడి కోడలు. ప్రస్తుతం ఆమె నారంపేట సర్పంచ్‌గా ఉన్నారు. తన మామ కంచర్ల శ్రీహరినాయుడి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని తెలుగుదేశం పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తున్నారు. అందుకు తగిన గుర్తింపుగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆశీస్సులతో పార్టీ అధిష్టానం ఆమెను ఏపీఐఐసీ డైరెక్టరుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాలికల గురుకులంలో విషజ్వరాలు..!

పలువురు విద్యార్థినులకు అస్వస్థత ● తక్షణ చర్యలకు మంత్రి ఆనం ఆదేశం



ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఆత్మకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులు విషజ్వరాల బారినపడి అస్వస్థతకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తక్షణమే స్పందించి జిల్లా కలెక్టర్, అధికారులతో గ్రూప్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టి విద్యార్థినులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా విద్యాలయాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దాంతో అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆత్మకూరులోని గురుకుల పాఠశాలకు తరలివచ్చి పరిస్థితిని సమీక్షించారు. జ్వరాల బారిన పడిన విద్యార్థినులను ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించి తక్షణ వైద్య సేవలు అందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో బి పావని, జిల్లా వైద్యశాఖాధికారులు సుజాత, షేక్ ఖాదర్‌వలీ, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం తదితరులు విషజ్వరాల తీవ్రతపై విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విషయాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం జ్వరాల బారినపడిన విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని అధికారులు తెలిపారు. కాగా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి తదితరులు మంత్రి ఆనం ఆదేశాల మేరకు అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించి పండ్లు అందజేశారు.

మాలకొండను దర్శించుకున్న దేవదాయ శాఖ ఆర్‌జేసీ



వలేటివారిపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం దేవదాయ శాఖ ఆర్‌జేసీ ఆజాద్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందచేశారు. అనంతరం అన్నదానం, లడ్డుప్రసాదం కౌంటర్, కేశఖండనశాల, క్యూలైన్లు, దుకాణాలు, మరుగుదొడ్లు తదితర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, భక్తులకు రుచి, శుచికరమైన భోజనం పెట్టాలని, నాణ్యమైన ప్రసాదం అందించాలని, మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. మండపాలపై ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌యూఎస్ నేతలు కోరారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రధానంగా డీఏలు, ఐఆర్‌ను ప్రకటించడతో పాటు పీఆర్సీ కమిటీని నియమించాలన్నారు. దీనికోసంగా ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో సభ్యత్వ నమోదును విస్తృతం చేసి సంఘం బలోపేతం చేసేందుకు నేతలు పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య యాదవ్, ప్రధానకార్యదర్శి రవీంద్ర, నేతలు వెంకటేశ్వర్లు, పద్మయ్యనాయుడు, బాలబ్రహ్మాచారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

● హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణం చేపటట్టాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. ఇటీవల హంస నెల్లూరు సిటీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఆయా కార్యవర్గ నేతలను నగరంలోని హంస కార్యాలయంలో శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చేజర్ల మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో కారుణ్య నియామకాలలో జాప్యం జరుగుతుండడంతో ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏఎన్ఎంలు 1998 నుంచి ఉద్యోగ ఉన్నతులకు నోచుకోలేదని, కొంత మంది ఉద్యోగ విరమణ కూడా చేశారని పేర్కొన్నారు. అర్హత ఉన్న వారికి ఉద్యోగ ఉన్నతులు కల్పించాలని కోరారు. కోర్టు తీర్పుతో తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఫార్మసీలు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు ఉద్యోగ ఉన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఇందిర, గౌరవ సలహాదారు అరవ పరిమళ, అసోసియేట్ అధ్యక్షుడు కప్పా నారాయణరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జలీల్ అహ్మద్, కోశాధికారి శేషగిరిరావు, మజార్, రాజయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యవర్గ అభినందన కార్యక్రమంలో మాట్లాడుతున్న హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు

అమ్మ ఒడి.. అంగన్‌వాడీ!

● గర్భిణులను కంటికి రెప్పలా కాపాడుతూ... ● అంగన్‌వాడీ టీచర్ల సేవలు అమూల్యం

కోవూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు, బాలింతల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో వారి సంక్షేమానికి తోడ్పడుతున్నాయి. జిల్లాలోని 2,934 అంగన్‌వాడీ కేంద్రాల్లో 14,195 మంది గర్భిణీలకు అంగన్‌వాడీ కార్యకర్త లు సేవలందిస్తున్నారు. గర్భిణీలకు పోషకాహారం అందిస్తూనే 'జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన' పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేస్తున్నారు. గర్భిణీ ప్రసవించిన తరువాత రాష్ట్ర ప్రభుత్వ పథకమైన 'జననీ సురక్ష యోజన' ద్వారా రూ. 1000, కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి 'మాతృవందన యోజన' నుంచి రూ. 5000 అందేలా చర్యలు తీసుకుంటున్నారు. గర్భిణీల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా వారికి ఆర్థిక సహాయం అందించేందుకు కూడా అంగన్‌వాడీలు కృషి చేస్తున్నారు.



గర్భిణీకి సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

● దరఖాస్తు చేయడం ఎలా?

'జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన' పథకాల ద్వారా ఆర్థిక సాయం పొందాలనుకునే గర్భిణీలు ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. అంగన్‌వాడీ కార్యకర్తలు దరఖాస్తుల్ని సేకరించి జిల్లా, రాష్ట్ర అధికారులకు పంపుతారు. గర్భిణీ వయస్సు 18 సంవత్సరాల ఏడు నెలలు పూర్తయి ఉండాలి. 55 సంవత్సరాల లోపు గర్భిణీలు మాత్రమే అర్హులు. ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటో, బ్యాంకు ఖాతా వివరాలు, ఆరోగ్యకార్డుల్ని అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించాలి.

● ఆర్థిక సాయం అందుతుందిలా...

గర్భం దాల్చిన ఆరు నెలల తరువాత వైద్యుడి పరీక్ష నిర్ధారణ తర్వాత ప్రతీ గర్భిణీకీ రూ. 3000 చెల్లిస్తారు. ప్రసవం అనంతరం బిడ్డకు టీకాలు వేయించాక రూ. 2000 చెల్లిస్తారు. గర్భిణి బ్యాంకు ఖాతాలోనే నగదు జమ చేస్తున్నందువల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్థిక సహాయాన్ని పొందుతున్నారు. ప్రసవించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రూ 1000 చెల్లిస్తుంది.

బాలలకూ, గర్భిణులకు సేవలందిస్తున్నాం



'అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలకూ, గర్భిణీలకు సేవ చేస్తున్నాం. పోషకాహారం అందించడంతో సరిపెట్టుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్ని గర్భిణీలకు వర్తించే విధంగా కృషి చేస్తున్నాం. జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలందరూ బాధ్యతగా గర్భిణీలకు సేవలందిస్తున్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఉన్నప్పటికీ గర్భిణీలు, బాలింతల సంక్షేమం కోసం పని చేస్తున్నాం.'

- సుజాత, జిల్లా అధ్యక్షురాలు, స్త్రీ, శిశు సంక్షేమ సంఘం

రేపు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

● జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఈనెల 15వ తేదీన డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ వెల్లడించారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ మహాసభకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. గడచిన మూడేళ్లలో ఆశాల సమస్యలపై జరిగిన పోరాటాలు, సాధించిన విజయాలపై చర్చిస్తామని తెలిపారు. ఆశాలకు వేతనాలు పెంపు, ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చులు సాధించుకున్నామన్నారు. అలాగే పెన్షన్, ఇన్సూరెన్స్ సాధించుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశాలను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, అందుకోసం సమరశీల పోరాటాలకు ఈ మహాసభలో పిలుపు నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయలక్ష్మి, స్వర్ణ, కృష్ణమ్మ, శిరీష, రేణుక తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

రేపటి నుంచి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం సోమవారం నుంచి చేపడుతున్నట్లు పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే.రమేష్‌నాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టరును జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జిల్లాలోని మూడు డివిజన్లలో 5,18,000 పశువులకు అవసరమైన టీకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 4 నెలల వయస్సు దాటిన గేదెలు, ఆవులు ఉన్న ప్రతీ పాడి రైతు ఈ టీకాలను తప్పనిసరిగా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో విజయకుమార్, ఆర్డీవోలు అనూష, పావని తదితరులు పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమ పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ కార్తీక్ తదితరులు